PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 115 | విజయవాడ, ఆదివారం 26 నవంబర్ 2023 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 26 November 2023 | Rs

వెలికితీత మరింత ఆలస్యం

- ఉత్తరకాశీ టన్నెల్‌లో నిలిచిపోయిన రెస్క్యూ పనులు
- నేటి నుంచి మాన్యువల్ డ్రిల్లింగ్
- ఎన్‌డిఎంఎ వెల్లడి

5

తేజస్‌లో ప్రధాని మోడీ విహారం

స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తేలికపాటి యుద్ధ విమానం 'తేజస్'లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విహరించారు. ఈ విమానంలో ప్రయాణించిన తొలి ప్రధానిగా ఆయన రికార్డులకెక్కారు.

వార్త 5వ పేజీలో

ఎన్యూమరేషన్ జాప్యం

కరువు ప్రకటించి 3 వారాలు దాటినా అసమగ్రమే

- ఇప్పటికి పది లక్షల ఎకరాల్లో నష్టం
- ఇది 103 మండలాల లెక్క
- గుర్తించని మండలాల్లో సాయంపై అస్పష్టత

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ఖరీఫ్‌లో ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల్లో సుమారు పది లక్షల ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బ తిన్నట్లు అంచనాలు రూపొందుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర విపత్తు సహాయ నిబంధనల ప్రకారం 33 శాతం, అంతకంటే ఎక్కువ నష్టం వాటిల్లిన ఏరియానే పరిగణనలోకి తీసుకున్నారు. సర్కారు తాజాగా విడుదల చేసిన జిఒఎంఎస్‌నెం.5 ప్రకారం పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ) చెల్లింపుల కోసం రూ.వెయ్యి కోట్ల వరకు అవసరమవుతాయని ఎస్టిమేట్ చేశారని సమాచారం. వ్యవసాయ, ఉద్యానవన శాఖల వరకు ఈ అంచనాలతో కేంద్రానికి ఇచ్చే సమగ్ర విజ్ఞాపన పత్రంలో పొందుపర్చనున్నట్లు తెలిసింది. కాగా కరువు మండలాలను ప్రకటించడంలోనే జాప్యం జరగ్గా, కరువును గుర్తించాక మూడు వారాలు దాటిపోయినా పంట నష్టాలపై ఎన్యూమరేషన్ శనివారం వరకు కొలిక్కి రాలేదు. రాష్ట్ర కేంద్రానికి అనంతపురం, చిత్తూరు, ఎన్‌టిఆర్ జిల్లాల నుంచే సమగ్ర సమాచారం వచ్చింది. ఎన్యూమరేషన్ చేయాల్సిన తతిమ్మా నాలుగు జిల్లాల నుంచి త్వరలోనే వివరాలొస్తాయని చెబుతున్నారు. సమాచారం అందిన జిల్లాలను పరిశీలిస్తే ఒక్క అనంతపురంలోనే సర్కారు ఎక్కువ మండలాలు ప్రకటించింది. ఆ జిల్లాలో 28 మండలాల్లో కరువును గుర్తించింది. చిత్తూరులో నాలుగు, ఎన్‌టిఆర్‌లో రెండు మండలాలనే ప్రకటించింది. కర్నూలులో 24, శ్రీసత్యసాయి 21, అన్నమయ్య 18, నంద్యాలలో 6 మండలాలు ప్రకటించగా, వాటి ఎన్యూమరేషన్ వివరాలు హెడ్‌క్వార్టర్‌కు చేరలేదు. 103 మండలాలకుగాను 34 మండలాల వివరాలే అందాయి. ఇంకా 69 మండలాల ఎన్యుమరేషన్ పూర్తి కాలేదు. కేంద్రానికి, కేంద్రం పంపే అధికార బృందాలకు సమగ్ర వివరాలివ్వాల్సి ఉందని, అందుకే ఒకటికి రెండుసార్లు తనిఖీలు చేస్తున్నామని ఉన్నతాధికారులు తెలిపారు.

అచితూచి..

ఖరీఫ్ సీజన్ ముగిసేనాటికి రాష్ట్రంలో 300 కుపైగా మండలాల్లో తీవ్ర దుర్భిక్షం ఉంది. కానీ ప్రభుత్వం గీచిగీచి 80 తీవ్ర స్థాయి, 23 మధ్యస్త స్థాయి కరువు మండలాలను ప్రకటించింది. కేంద్ర సాయం కోరుతూ ఆ మేరకే అంచనాలు పంపుతోంది. ప్రకటించిన మండలాల్లో తొలుత ప్రాథమికంగా ఆరేడు లక్షల ఎకరాల్లో 33 శాతానికి మించి పంటలకు నష్టం జరిగిందని, రూ.534 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లింపులకు కావాలని అంచనా వేశారు. పూర్తి స్థాయి ఎన్యూమరేషన్ చేపట్టాక నష్టం 10 లక్షల ఎకరాలకు పెరిగేలా కనిపిస్తోంది.

రాష్ట్రానికి భారం

ఏ సీజన్‌లో పంట నష్టాలకు ఆ సీజన్‌లోనే పరిహారం అని మూడేళ్ల నుంచి స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ రెస్పాన్స్‌ఫండ్ (ఎస్‌డిఆర్‌ఎఫ్) నిబంధనల కింద రైతులకు ప్రభుత్వం తృణమో పణమో చెల్లిస్తూ వచ్చింది. ఆ పరిహారానికి కరువు, లేదంటే వరద, తుపాన్ మండలాలను సర్కారు అధికారికంగా ప్రకటించాల్సిన అవసరం లేదు. కాబట్టి కేంద్రంతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం తన సొంత ఖజానా నుంచి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చింది. ఈ ఏడాది అనూహ్యంగా కరువు రావడంతో నష్టం పెరిగిపోయింది. ఖరీఫ్‌లో వ్యవసాయ పంటలు 62 లక్షల ఎకరాల్లో సాగు చేయగా, వాటిలో సగభాగంలో 33 శాతం కంటే ఎక్కువ నష్టం జరిగిందని రైతులు చెబుతున్నారు. ఉద్యానవన పంటలు అదనం. జిఒ5 ప్రకారం కనీసం 30 లక్షల ఎకరాలకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలంటే దాదాపు రూ.3 వేల కోట్లు కావాలి. ప్రభుత్వం కరువును తక్కువ చేసి చూపేందుకు కేవలం 103 మండలాలనే ప్రకటించింది. ఆ మండలాల్లోని నష్టాలకే, అదీ కేంద్రం దయదలిస్తే నిధులొస్తాయి. అవి ఎప్పుడొస్తాయో తెలీదు. మిగతా పంట నష్టాలకు గతంలో మల్లే ఎలాంటి గెజిట్‌లూ, ధ్రువీకరణలు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం తన ఖజానా నుంచి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలంటే రూ.2 వేల కోట్లు కావాలి. ఆ నిధులను రాష్ట్ర ప్రభుత్వం పెట్టుకుంటుందా, లేదంటే 103 మండలాలకే పరిమితమవుతుందా అనే విషయంలో ఇప్పటికైతే స్పష్టత లేదు. ప్రస్తుతానికైతే ప్రకటించిన కరువు మండలాల్లోనే నష్టాలపై ఎన్యూమరేషన్ జరుగుతోంది.

క్రికెట్ చూసిన ప్రధాని...
మణిపూర్ ఎందుకెళ్లలేదు?

- బిజెపిని ఓడించడమే మా లక్ష్యం
- సుప్రీం తీర్పును గవర్నర్లు అమలు చేయాలి
- అభ్యర్థులకే కాదు పార్టీల ఖర్చుపైనా పరిమితి ఉండాలి
- మీట్ ది మీడియాలో సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

వన్డే ప్రపంచకప్ ఫైనల్ క్రికెట్ మ్యాచ్ చూసేందుకు వెళ్లిన ప్రధాని మోడీ... మణిపూర్‌కు ఎందుకెళ్లలేదని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సూటిగా ప్రశ్నించారు. దేశంలో బిజెపిని ఓడించడమే తమ లక్ష్యమని చెప్పారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (టిడబ్ల్యుజెఎఫ్), హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యుజె) ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మీట్ ది మీడియా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఐదు రాష్ట్రాల్లో బిజెపి ఓటమి కోసమే పనిచేస్తామని స్పష్టం చేశారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణలో కాంగ్రెస్ గెలిచే అవకాశాలున్నాయని వివరించారు. రాజస్థాన్‌లో పోటాపోటీ ఉందని, కానీ బిజెపి పట్ల వ్యతిరేకత ఉందని తెలిపారు. మోడీ పాలనలో నిరుద్యోగం, పేదరికం పెరిగిందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాల్లేవని తెలిపారు. ధరల నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ధరల పెరుగుదల ప్రభావం ప్రజల్లో తీవ్రంగా ఉందని తెలిపారు. మోడీ ప్రభుత్వంలో ఎవరికీ జవాబుదారీతనం లేదన్నారు. ఉత్తరాఖండ్‌లో టన్నెల్‌కు అనుమతి ఇచ్చింది ఎవరని, ఆ ఘటనకు బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించారు. మోడీ ఎన్నికల నియమావళి ఉల్లంఘించినా ఇసి నోటీసులు ఇవ్వడం లేదన్నారు. ప్రతిపక్షాలకు మాత్రం వెంటనే నోటీసులు ఇస్తోందని వివరించారు. తెలంగాణలో సర్దుబాటు ఎందుకు కుదరలేదో కాంగ్రెస్ పార్టీనే అడగాలన్నారు. ఖమ్మంలో తమకు ఒక్క సీటూ ఇవ్వకుండా కాంగ్రెస్‌తో సర్దుబాటు ఎలా సాధ్యమని ప్రశ్నించారు. అందుకే తాము 19 స్థానాల్లో సొంతంగా పోటీ చేస్తున్నామని చెప్పారు. తాము పోటీ చేయనిచోట బిజెపిని ఓడించే పార్టీలకు మద్దతు ఇస్తామని, స్థానిక కమిటీలు నియోజకవర్గాల వారీగా నిర్ణయం తీసుకుంటాయని తెలిపారు. రాష్ట్రంలో హంగ్ వస్తే బిజెపి మద్దతును బిఆర్‌ఎస్ తీసుకుంటుందన్నారు. ఎన్నికల్లో ఓడిపోయినా, తక్కువ సీట్లు వచ్చినా దొడ్డిదారిన అధికారంలోకి వచ్చే నీచమైన చరిత్ర బిజెపిదని తెలిపారు. ఇడి, సిబిఐ, ఇసి, సుప్రీంకోర్టు కేంద్రం చేతిలో బందీ అయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చుపై పరిమితి ఉందని, పార్టీల ఖర్చుపై పరిమితి లేదని చెప్పారు. అందుకే రాజకీయ పార్టీలు విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు చేస్తున్నాయన్నారు. జర్మనీ తరహాలో ప్రభుత్వమే అభ్యర్థులకు ఖర్చు చేసే నిధులను ఇచ్చే పద్ధతి రావాలని చెప్పారు. ఎపి మాజీ సిఎం చంద్రబాబు అరెస్టు తీరును ఖండిస్తున్నామన్నారు. అసలు వాస్తవమేంటో త్వరలో బయటపడుతుందని చెప్పారు. పోరాడాలంటే ఎర్రజెండా కావాలని, ఓటేసేందుకు వేరే పార్టీలను ప్రజలు ఎంచుకుంటు న్నారని పేర్కొన్నారు. మోడీ అధికారంలోకి వచ్చాక కార్పొరేట్ సంస్థలకు రూ.16 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేశారని గుర్తు చేశారు. వ్యవసాయ మోటార్లకు మీటర్ల ఏర్పాటుకు తాము వ్యతిరేకమని తెలిపారు.

రాజస్థాన్‌లో 72.64% పోలింగ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికలు శనివారం ప్రశాంతంగా ముగిసాయి. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ 72.64 శాతం పోలింగ్ నమోదైనట్టు ఎన్నికల కమిషన్ అధికారులు తెలిపారు. 6 గంటల తరువాత క్యూలో ఉన్నవారికి ఓటింగ్‌కు వీలు కల్పించారు. ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్, గవర్నర్ కలరాజ్ మిశ్రా, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, బిజెపి నేత, మాజీ ముఖ్యమంత్రి వసుంధరా రాజే, ప్రతిపక్ష నేత రాజేంద్ర రాథోర్, మాజీ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింగ్ సింగ్ డోటస్రా, విధాన సభ స్పీకర్, కాంగ్రెస్ నేత సిపి జోషి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి అమ్రారామ్ తదితరులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. శనివారం మొత్తం 200 అసెంబ్లీ స్థానాలకు గాను 199 స్థానాల్లో పోలింగ్ జరిగింది. ఒకటి, రెండు రాళ్లు రువ్వుకున్న సంఘటనలు మినహా ప్రశాంతంగా పోలింగ్ జరిగినట్టు అధికారులు తెలిపారు. సికార్‌లోని బోచివాల్ భవన్, ఫతేపూర్ షెఖావతి సమీపంలో రాళ్ల దాడి జరిగింది. 1862 మంది అభ్యర్థులు బరిలో ఉండగా, 5.29 కోట్లకు పైగా ఓటర్లు ఉన్నారు. కొత్తగా ఈసారి 22.61 లక్షల మందికి ఓటు హక్కు లభించింది. 3 లక్షల మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అశోక్ గెహ్లాట్, వసుంధరా రాజే, సచిన్ పైలట్, గోవింగ్ సింగ్ డోటస్రా, సీపీ జోషి తదితర హేమాహేమీలు బరిలో ఉన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 51,890 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 2,74,000 మంది ప్రభుత్వ సిబ్బంది పోలింగ్ విధులు నిర్వహించగా, 1,71,000 మంది పోలీసు, భద్రతా సిబ్బంది మోహరించారు. రహదారి నిర్మించకపోవడాన్ని నిరసిస్తూ జైపూర్ జిల్లా పాలావాలా జతన్ గ్రామస్థులు వరుసగా ఏడోసారి ఎన్నికలను బహిష్కరించారు.

అన్నా రుఫ్తా | సారా థామస్ | అతుల్ తంబి

కోచ్చిలో తొక్కిసలాట

- నలుగురు విద్యార్థులు మృతి
- మరో 65 మందికి గాయాలు

కోచ్చి : కేరళలోని కోచ్చి విశ్వవిద్యాలయంలో శనివారం విషాదం చోటుచేసుకుంది. క్యాంపస్‌లో సాయంత్రం టెక్‌ఫెస్ట్ నిర్వహిస్తుండగా వర్షం కురియటంతో తొక్కిసలాట జరిగి నలుగురు విద్యార్థులు చనిపోయారు. మరో 65 మంది గాయపడ్డారు. చనిపోయిన వారిలో ఇద్దరు యువకులు, ఇద్దరు యువతులు ఉన్నారు. మృతులను అన్నా రుఫ్తా, సారా థామస్, అతుల్ తంబి, అల్బిన్ జోసఫ్‌గా గుర్తించారు. క్షతగాత్రులను కలమస్సేరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంలో జరిగిన టెక్ ఫెస్ట్ కార్యక్రమంలో రాత్రి 7 గంటలకు వర్షం కురవడంతో విద్యార్థులు లోపలి వైపు ఒక్కసారిగా దూసుకురావడంతో తొక్కిసలాట జరిగింది. ప్రముఖ ప్లేబ్యాక్ సింగర్ నిఖితా గాంధీ లైవ్ కాన్సర్ట్‌ను వీక్షించేందుకు విద్యార్థులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తొక్కిసలాట ఘటనపై ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులతో మిగతా 5లో

ఇంటెలిజెన్స్ డిఎస్‌పి హఠాన్మరణం

- తిరుమల నడక దారిలో ఘటన

ప్రజాశక్తి- తిరుమల

ఇంటెలిజెన్స్ డిఎస్‌పి కృపాకర్ (59) తిరుమలలో హఠాన్మరణం చెందారు. మెట్ల దారిలో వెళ్తుండగా గుండెపోటుకు గురై ఆయన కుప్పకూలారు. ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేస్తుండగానే కన్నుమూశారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆది, సోమవారాల్లో తిరుమల పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించేందుకు కృపాకర్ వచ్చారు. మెట్లదారిలో సెక్యూరిటీ ఏర్పాట్లు పర్యవేక్షించడంతోపాటు శ్రీవారిని దర్శించుకోవాలని భావించారు. మెట్ల దారి గుండా పైకి వెళ్తుండగా 1,805 మెట్టు వద్ద అస్వస్థతకు గురయ్యారు. గుండెలో నొప్పితో కుప్పకూలారు. ఆయన స్వస్థలం విజయవాడ దగ్గర్లోని పోరంకి. కృపాకర్ మరణవార్తను ఆయన కుటుంబ సభ్యులకు పోలీసులు తెలియజేశారు.

రాష్ట్రానికి చేసిన ద్రోహానికి వెంకన్న సాక్షిగా
ప్రజలకు మోడీ క్షమాపణ చెప్పాలి

- వి.శ్రీనివాసరావు డిమాండ్
- పాచిపోయిన లడ్డూకు జైకొట్టమంటున్న పవన్‌ను కార్యకర్తలు ప్రశ్నించాలి
- స్మార్ట్ మీటర్ల పేరుతో అదానీకి దోచిపెడుతున్న జగన్

2014 ఎన్నికల సభలో ప్రత్యేక హోదా తదితర అంశాలపై మోడీ ప్రసంగ వీడియోను ప్రదర్శిస్తున్న దృశ్యం, చిత్రంలో వి శ్రీనివాసరావు, వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తానని, హామీలు అమలు చేస్తానని, ప్రత్యేక దృష్టితో చూసి గుజరాత్‌కన్నా అభివృద్ధి చేస్తానంటూ తొమ్మిదేళ్ల క్రితం వాగ్దానం చేసి మాట తప్పిన ప్రధాని మోడీ వెంకన్న సాక్షిగా రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. విజయవాడలోని ఎంబివికెలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన మాట్లాడారు. 2014 ఏప్రిల్ 30వ తేదీన రాష్ట్ర విభజన తరువాత తిరుపతి, నెల్లూరు సభల్లో ఇచ్చిన హామీలను మోడీ విస్మరించారన్నారు. తిరుమలకు వస్తున్న మోడీ అక్కడే రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని కోరారు. లేదా ప్రత్యేక హోదా ప్రకటించాలని కోరారు. మోడీ దేవుడిని కూడా రాజకీయాల కోసం వాడుకుంటున్నారని అన్నారు. ఎన్నికలు రాగానే వెంకటేశ్వరస్వామి గుర్తుకు రావడమే దీనికి నిదర్శనమన్నారు. ఇటీవల బిజెపి మాతృసంస్థ ఆర్‌ఎస్‌ఎస్ అంతర్జాతీయ హిందూ మహాసభ పెట్టి తమది హిందూయిజం కాదని, హిందూత్వ అని ప్రకటించారని తెలిపారు. హిందూమతం అన్నా హిందువులన్నా వారికి గౌరవం లేదన్నారు. అది ఆర్‌ఎస్‌ఎస్ రాజకీయ ప్రాజెక్టని పేర్కొన్నారు. హిందువుల్లో అగ్రవర్ణ సంపన్నులు అదానీ, అంబానీలాంటి వారి ఆధిపత్యం సాధించడమే ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి ప్రాధాన్యతలని తెలిపారు. తిరుపతిలో ప్రధానిని విభజన హామీలపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మిగతా 2లో

హిందూత్వ-యూదు పొత్తును వ్యతిరేకించాలి

పాలస్తీనాకు అండగా నిలవాలి

న్యూఢిల్లీ: పాలస్తీనియన్లను ముస్లిం తీవ్రవాదులుగా చిత్రించేందుకు హిందూత్వశక్తులు, దాని అధీనంలోని కార్పొరేట్ మీడియా బాకాలు చేస్తున్న యత్నాల పట్ల పీపుల్స్ డెమొక్రసీ (పీడి) ఆందోళన వ్యక్తం చేసింది. దీనికి మతం రంగు పులిమి ఇస్లామిక్ ఫోబియాను రెచ్చగొట్టాలని బిజెపి చేస్తున్న యత్నాలను తిప్పికొట్టాల్సిన ఆవశ్యకతను అది నొక్కి చెప్పింది. పీపుల్స్ డెమొక్రసీ తన తాజా సంచికలో ప్రచురించిన సంపాదకీయంలో హిందూత్వ-యూదు పొత్తు, దాని ప్రమాదం గురించి హెచ్చరిస్తూ ఇలా వ్యాఖ్యానించింది.

" గాజాపై ఇజ్రాయిల్ అమానుష యుద్ధంలో మరణించిన పాలస్తీనా చిన్నారులను గుర్తు చేసుకుంటూ బాలల దినోత్సవాన్ని జరుపుకోవడం కూడా నూతన భారతదేశంలో నేరమైపోయింది. ముంబయిలో నవంబరు 14న జుహూ బీచ్‌లో మైనర్ బాలికలతో పాటు కొద్దిమంది, పాలస్తీనా చిన్నారుల కోసం మౌనంగా ప్రార్ధనలు జరిపారు. వారిలో 17మందిని పోలీసులు అరెస్టు చేశారు. సాయంత్రం వరకు పోలీసు స్టేషన్‌లోనే అట్టిపెట్టారు. వీరందరూ కూడా మైనారిటీ కమ్యూనిటీకి చెందినవారే. గాజాలో 5,600మంది చిన్నారులు మరణిస్తే ఆ పరిణామాలు బిజెపి పాలకులను కొంచెం కూడా కదిలించలేకపోయాయి.

అదే రోజు, ఢిల్లీ పోలీసులు వివిధ మసీదుల ఇమామ్‌లకు నోటీసులు పంపడం, ప్రార్ధనలు, సమావేశాల సందర్భంగా గాజాలో ఇజ్రాయిల్ బలగాల దాడులు గురించి లేదా పాలస్తీనా గురించి ప్రస్తావించవద్దంటూ హెచ్చరికలు జారీ చేశారు. గాజాలో మరణించిన వేలాదిమంది స్మృత్యర్థం ప్రార్ధన జరపరాదంటూ నిషేధం విధించడం ప్రాథమిక హక్కు అయిన భావ ప్రకటనా స్వేచ్ఛను హరించడమే కాకుండా మత స్వేచ్ఛపై కూడా దాడి చేయడమే..

అక్టోబరు 13న, ఆ తర్వాత వచ్చే శుక్రవారాల్లో ప్రార్ధనలు మానేయాల్సిందిగా శ్రీనగర్‌లోని ప్రధాన మసీదు అయిన జామియా మసీదుకు నగర యంత్రాంగం ఆదేశాలు జారీ చేసింది. ప్రార్ధనల సమయాల్లో గాజాలోని ప్రజలకు సంఘీభావం తెలియచేయకుండా అడ్డుకునేందుకు యత్నించిందని పీపుల్స్ డెమొక్రసీ విమర్శించింది.

ఇజ్రాయిల్ విధ్వంసంతో మృతుల దిబ్బగా మారిన గాజా

బిజెపి పాలిత రాష్ట్రాలన్నింటిలో, పాలస్తీనాకు మద్దతుగా ఎలాంటి నిరసనలు లేదా ప్రదర్శనలు నిర్వహించకుండా పోలీసులు నిషేధం విధించారు. ఢిల్లీలో కూడా, జంతర్ మంతర్ వద్ద నిరసన తెలియచేస్తుండగా విద్యార్థులు, ఇతర నిరసనకారులను పోలీసులు చుట్టుముట్టారు.

ఇజ్రాయిల్‌ను అతిగా పొగుడుతూ, పాలస్తీనా పోరాటాన్ని తీవ్రవాదంగా చిత్రీకరించే బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ దృక్పథం కారణంగానే ఈ చర్యలన్నీ చోటు చేసుకున్నాయి. ఒకపక్క అంతర్జాతీయంగా పేద, వర్ధమాన దేశాలన్నీ గాజాలో సాగుతున్న యుద్ధంలో కాల్పుల విమరణ జరగాలని డిమాండ్ చేస్తుంటే, మరోపక్క ఇజ్రాయిల్‌కు పూర్తి స్థాయిలో మద్దతు ప్రకటిస్తూ, కాల్పుల విరమణ పిలుపునకు మద్దతు ఇవ్వడానికి కూడా తిరస్కరిస్తూ మోడీ ప్రభుత్వ వైఖరిలో వచ్చిన పూర్తి మార్పును ఈ చర్యలు ప్రతిబింబిస్తున్నాయి.

పీపుల్స్ డెమొక్రసీ వ్యాఖ్య

హిందూత్వ, మితవాద యూదు ఉన్మాదం ఈ రెండూ సైద్ధాంతిక సోదరుల వంటివి. హిందూత్వ భావనకు మూలకర్త అయిన వి.డి.సావర్కర్ పాలస్తీనాలో యూదు దేశం ఏర్పాటుకు మద్దతిచ్చినట్లు 1923లోనే రాసుకున్నారు. యూదు వాదానికి సావర్కర్ ఎప్పుడూ మద్దతిచ్చేవారు. దాన్ని ఆయన ముస్లిం వ్యతిరేకిగా చూశారు. దీనికి పూర్తి విరుద్ధంగా, పాలస్తీనా ప్రయోజనాలకు గాంధీజీ కూడా అంతే దృఢంగా మద్దతిచ్చారు. "అరబ్బులపై యూదులను రుద్దడం తప్పు, అమానవీయం" అని 1938లో గాంధీజీ రాశారు. ఈనాడు పాలస్తీనాలో జరుగుతున్నదాన్ని ఏ నైతిక ప్రవర్తనా నియమావళితోనూ సమర్ధించలేం.

పాలస్తీనాపై భారత్ వైఖరిని మోడీ ప్రభుత్వం పూర్తిగా మార్చివేయడమనేది బిజెపి నేతృత్వంలోని మొదటి వాజ్‌పేయి ప్రభుత్వం ఇజ్రాయిల్‌తో పెట్టుకున్న వ్యూహాత్మక సంబంధాలకు పరాకాష్టగా వుంది. ఆనాడు ఉప ప్రధాని హోదాలో ఎల్.కె.అద్వానీ 2000 సంవత్సరంలో ఇజ్రాయిల్‌లో పర్యటించారు. అలా పర్యటించిన మొదటి అత్యున్నత భారత ప్రభుత్వ నేత ఆయనే. ఈ ధోరణి వివిధ మిలిటరీ, భద్రతా సంబంధాల్లోనూ ప్రస్ఫుటంగా కనిపించింది. తదనంతరం ఇజ్రాయిల్ ప్రధాని ఏరియల్ షరోన్ భారత్‌లో పర్యటించారు. యూదు మితవాద విభాగానికి ఆయన నేతృత్వం వహిస్తున్నారు. భారత్‌లో పర్యటించిన మొదటి ఇజ్రాయిల్ ప్రధాని ఆయనే. ఈ వ్యూహాత్మక పొత్తు నరేంద్ర మోడీ, మితవాద ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో కలిసి మరింత ముందుకు తీసుకెళ్లారు. మోడీ ప్రభుత్వానికి అంతర్గత భద్రతా వ్యవస్థకు అవసరమైన పరికరాలను, సాంకేతికతను అందించే కీలక సరఫరాదారుగా ఇజ్రాయిల్ మారింది. అటువంటి సాంకేతికతల్లో ఒకటే పెగాసస్ స్పైవేర్. ఇజ్రాయిల్ ప్రభుత్వ ఆమోదంతో ఒక ఇజ్రాయిల్ కంపెనీ దీన్ని సరఫరా చేసింది.

గాజాపై సాగించిన మారణకాండ ప్రపంచవ్యాప్తంగా నిరసనలు,, ఆందోళనలను లేవనెత్తింది. ఖండనలకు గురైంది. ఇజ్రాయిల్‌కు పూర్తిగా మద్దతిచ్చే దేశాల్లో కూడా వేలాదిమంది ప్రజలు వీధుల్లోకి వచ్చి గాజా ప్రజలకు, మిగతా 5లో

విద్యుత్ భారాలు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా

విశాల ఐక్య ప్రజా ఉద్యమం

సిపిఎం రాష్ట్ర కమిటీ తీర్మానం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం మోపుతున్న విద్యుత్ భారాలకు, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా విశాల ఐక్య ఉద్యమం చేపట్టాలని ప్రజానీకానికి సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. అటువంటి ఉద్యమంతోనే విద్యుత్ భారాలను తిప్పికొట్టగలమని పేర్కొంది. ఈ మేరకు రెండురోజులపాటు జరిగిన సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశంలో తీర్మానం చేశారు. ఈ తీర్మానాన్ని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శనివారం మీడియాకు విడుదల చేశారు. రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ స్కీమ్ (ఆర్‌డిఎస్ఎస్) అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును ఉపసంహరించాలని, ఇప్పటికే అధిక విద్యుత్ భారాలతో బాధపడుతున్న వినియోగదారులపై ప్రతిపాదించిన రూ.7,200 కోట్ల ట్రూ అప్ భారాన్ని విరమించాలని ఈ తీర్మానంలో సిపిఎం డిమాండ్ చేసింది. ప్రభుత్వం వెనక్కు తగ్గకపోతే భారాలను తిప్పికొట్టేందుకు విశాల ఐక్య ఉద్యమం సాగించాలని ప్రజలను కోరింది. తీర్మానం వివరాలు:

'విద్యుత్ సవరణ చట్టం పేరుతో క్రాస్ సబ్సిడీ విధానం ఎత్తేసి, విద్యుత్ పంపిణీ పూర్తిగా ప్రయివేటు చేయాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి చేసి మొండిగా వ్యవహరిస్తోంది. 2400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే ఆధునిక నెల్లూరు జెన్‌కోను అదానికి అప్పగించడానికి రాష్ట్ర కేబినెట్ బిడ్డింగ్ వరకు వెళ్లింది. అక్కడి జెన్‌కో పోరాట కమిటీ నిలబడి అడ్డుకోవడంతో ఆ నిర్ణయం ఆగిపోయింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ల ప్రయోజనాల కోసం 'డైనమిక్ ప్రైసెస్' పేరుతో ఎక్కువ ధరకు విద్యుత్ కొనడం ద్వారా ప్రజలపై భారాలు పెరుగుతున్నాయి. స్మార్ట్‌మీటర్ల కొనుగోలు, సోలార్ విద్యుత్ ఒప్పందాలపై సమీక్ష చేయాలి. టెండర్లు పారదర్శకంగా ఉండాలి. వేలకోట్ల కుంభకోణాన్ని అరికట్టాలి.' అని తీర్మానంలో పేర్కొన్నారు.

'వ్యవసాయ పంపుసెట్లకు మీటర్ల ఏర్పాటుతో అదనపు ప్రయోజనం చేకూరలేదని శ్రీకాకుళం జిల్లాలో అధ్యయనం చేసిన ప్రయాస్ (పూణే) సంస్థ ఇప్పటికే నిర్ధారించింది. అయినా రాష్ట్ర ప్రభుత్వం వెనక్కు తగ్గలేదు. సరికదా వాణిజ్య, గృహ కనెక్షన్లకూ స్మార్ట్‌మీటర్లు బిగిస్తామని, తొలిదశలో అమృత్ పథకంలోని నగరాల్లో ఏర్పాటు చేయడానికి సిద్ధమవుతోంది. దేశంలో ఎక్కడా లేనంత ఎక్కువధరకు వీటిని కొనుగోలుచేస్తున్నారని తెలిసింది. ఆ ఖర్చును వినియోగదారులపై మోపుతోంది. వినియోగదారులకు భారంగా, కార్పొరేట్లకు లాభంగా స్మార్ట్‌మీటర్ల విధానాన్ని ఇప్పటికే కేరళ వామపక్ష ప్రభుత్వం సహా పలు ప్రభుత్వాలు పక్కనబెట్టాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును పూర్తిగా ఉపసంహరించుకోవాలి.' అని సిపిఎం రాష్ట్ర కమిటీ కోరింది.

ట్రూ అప్ భారాలపై

'ఇప్పటికే 2014-19 కాలానికి రూ.2,910 కోట్లు, 2021-22 సంవత్సరానికి సంబంధించి రూ.3,083 కోట్లు ట్రూఅప్ ఛార్జీల పేరిట వినియోగదార్లపై అదనపు భారాలు మోపారు. ఇది కాక ఎఫ్‌పిపిసిఎ పేరుతో నెలనెలా యూనిట్‌కి కనీసం రూ.0.40 పైసలు బాదేస్తున్నారు. ఇలాంటి భారాలన్నీ ఉండగా తాజాగా ఎపిఈఆర్‌సికి 2022-23 సంబంధించి రూ.7,200 కోట్ల ట్రూఅప్‌ను డిస్కాములు ప్రతిపాదించడం దారుణం. ట్రూఅప్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలి. కనీసం ఈ తాజా ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలి.' అని డిమాండ్ చేసింది.

'ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రపంచ బ్యాంకు ఆదేశిత సంస్కరణలను అమలు చేసినప్పుడు ప్రజా ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి అప్పటి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపడం అందరూ గుర్తు చేసుకోవాలి. అవే విధానాలను మోడీ సర్కారు షరతులకు తలొగ్గి ఇప్పటి ప్రభుత్వం అమలు చేస్తోంది. విద్యుత్తుపై అదానీకి గుత్తాధిపత్యం కట్టబెట్టడానికే మోడీ సర్కార్ తపనపడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం మోడీకి లొంగిపోయి అదానీ సేవలో తరిస్తోంది. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు, ట్రూఅప్ ఛార్జీల విషయంలో ప్రభుత్వం వెనక్కు తగ్గకపోతే విశాల ఐక్య ప్రజాఉద్యమం సాగించడం అవసరం. అందుకు ప్రజలు సన్నద్ధం కావాలి. తద్వారా భారాలను తిప్పికొట్టాలి' అని సిపిఎం విజ్ఞప్తి చేసింది.

అర్హులైన అసైన్డ్ లబ్ధిదారులకే హక్కులు

'అసైన్డ్ భూములను పొంది 20 సంవత్సరాలు అనుభవం ఉన్న పేదలకు యాజమాన్యపు హక్కులు కల్పిస్తామని, అక్రమంగా అనుభవిస్తున్న భూస్వాముల నుండి వెనక్కి తీసుకొని నిజమైన పేదలకు, లేదా వారి వారసులకు తిరిగి ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం అసైన్డ్ చట్ట సవరణ చేసింది. తద్వారా ప్రతి పేద కుటుంబాన్ని సంపన్నులుగా మార్చడమే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని ముఖ్యమంత్రి ప్రకటించడంతో అసైన్డ్ భూములను పొందిన పేదలు సంతోషించారు. కానీ ఆ సంతోషం నుండి తేరుకోక ముందే రాష్ట్ర ప్రభుత్వం పిడుగులాంటి వార్త చెప్పింది. అసైన్డ్ భూములు అనుభవిస్తున్న పెద్దలు మార్కెట్ రేటుకు రెండున్నర రెట్లు పరిహారం చెల్లిస్తే వారికే హక్కులు కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దీనిని సిపిఎం తీవ్రంగా ఖండించింది. ఈ ప్రకటన వల్ల లక్షలాది పేద, దళిత కుటుంబాలకు తీవ్రమైన నష్టం జరుగుతుంది. 9/77 అసైన్డ్ చట్టసవరణ సందర్భంగా నిజమైన అసైన్డ్‌దారులకే హక్కులు కల్పిస్తామని ప్రభుత్వం చెప్పిన మాటకు కట్టుబడి ఉండాలి. సన్న, చిన్నకారు రైతుల జోలికి పోకుండా అక్రమంగా అసైన్డ్ భూములను పొందిన భూస్వాములు, గ్రామీణ సంపన్నుల నుండి భూములను స్వాధీనం చేసుకొని అర్హులైన పేదలకు వారి వారసులకు హక్కులు కల్పించాలి. కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సుల మేరకు అర్హులందరికీ భూపంపిణీ చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

'వామపక్ష పార్టీలు, ప్రజా ఉద్యమాల ఫలితంగా 1947 అనంతరం విభజిత ఆంధ్ర రాష్ట్రంలో సుమారు 26 లక్షల కుటుంబాలకు 33 లక్షల ఎకరాలకు ప్రభుత్వాలు పేదలకు భూ హక్కులు కల్పించబడ్డాయి. ఈ భూములను గ్రామంలో పలుకుబడి కలిగిన భూస్వాములు పేదలకు ఆశచూపి, లేదా దౌర్జన్యంగా సుమారు 15 లక్షల ఎకరాల వరకు అక్రమంగా అనుభవిస్తున్నట్లు ప్రభుత్వమే ప్రకటించింది. కోనేరు రంగారావు నాయకత్వంలో వేసిన భూ కమిటీ కూడా చెప్పింది. రాజశేఖరరెడ్డి నుండి నేటి జగన్‌మోహన్‌రెడ్డి వరకు పేదలకు ఈ భూములు తిరిగి ఇప్పిస్తామని హామీ ఇస్తూ వచ్చారు. అందులో భాగంగానే విభజిత ఆంధ్ర రాష్ట్రంలో అన్యాక్రాంతమైన అసైన్డ్ హక్కుదారులకు అన్ని హక్కులు కల్పించడానికి 9/77 అసైన్డ్ చట్టం సవరించి అసెంబ్లీలో తీర్మానం చేశారు. అన్ని గ్రామ సచివాలయాల్లో అసైన్డ్ లబ్ధిదారుల లిస్టు బహిర్గతం చేస్తామని, అభ్యంతరాలు ఉన్న పేదలు తమ అభిప్రాయాలను చెప్పాలని కోరింది. ఇవేమీ చేయకుండా అసైన్డ్‌దారుల విన్నపాలు స్వీకరించకుండా, ఏకపక్షంగా భూస్వాములకు మేలు చేయడానికి, ఆ పేరుతో ప్రభుత్వం డబ్బులు దండుకోవడానికి అక్రమంగా అనుభవిస్తున్న వారి ప్రయోజనాలను కాపాడడానికి ప్రభుత్వం నిర్ణయించడం సిగ్గుచేటు. నిరంతరం దళిత, గిరిజన, బలహీనవర్గాల జపంచేసే జగన్ ప్రభుత్వం ఆ తరగతుల వారికే హాని తలపెట్టడాన్ని సిపిఎం గర్హిస్తున్నది. ఈ నిర్ణయం వల్ల అసలైన అసైన్డ్‌దారులు దళితులు, బలహీనవర్గాల పేదలకు తీవ్రమైన నష్టం జరుగుతుంది. ప్రభుత్వం చేసిన చట్ట సవరణ ప్రకారం భూస్వాముల ఆధీనంలో ఉన్న అసైన్డ్ భూములను తిరిగి హక్కుదారులకు ఇవ్వాలని కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సుల మేరకు భూమిలేని పేదలకు భూపంపిణీ చేయాలని, మార్కెట్ రేటుకు రెండున్నర రెట్లు పరిహారం చెల్లించే విధానం ఉపసంహరించాలి' అని సిపిఎం రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

కార్పొరేషన్ కార్యాలయం ఎదుట మాట్లాడుతున్న మూలం రమేష్

కదం తొక్కిన మున్సిపల్ కార్మికులు

- నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి - నెల్లూరు

ప్రజారోగ్య పరిరక్షణ కోసం తమ ఆరోగ్యాన్ని సైతం ఫణంగా పెట్టి పనిచేస్తున్న తమను తక్షణమే పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం అందజేయాలని డిమాండ్ చేస్తూ నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు ధర్నా చేపట్టారు. తమను పర్మినెంట్ చేసేలా కౌన్సిల్‌లో తీర్మానం చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో శనివారం ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ పోరాటానికి సిపిఎం మద్దతు తెలిపింది.కౌన్సిల్ తీర్మానం చేసే విషయంలో నగర మేయర్ హామీ ఇవ్వకపోవడంతో కార్పొరేషన్ కార్యాలయం లోపలికి వెళ్లేందుకు కార్మికులు ప్రయత్నించారు. పోలీసులు అడ్డగించడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ సందర్భంగా వారికి, పోలీసులకు మధ్య తోపులాటలు, వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. ఈ సందర్భంగా ఎపి మున్సిపల్ వర్కర్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడారు. ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని ఆర్భాటంగా సిఎం జగన్ హామీలు గుప్పించారని, అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీని నెరవేర్చలేదని గుర్తు చేశారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆప్కాస్ వంటి వ్యవస్థను తీసుకు వచ్చి 60 ఏళ్లు నిండిన కార్మికులందరికీ ఎటువంటి రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేకుండా అర్ధాంతరంగా ఇళ్లకు పంపడం దారుణమన్నారు. మున్సిపల్ కార్మికుల పోరాటానికి జనసేన మద్దతు ప్రకటించింది. ఈ ధర్నా కార్యక్రమంలో సిఐటియు రూరల్ కార్యదర్శి బత్తల కృష్ణయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పెంచల నరసయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్ బోట్లు దగ్ధం కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

గత ఆదివారం అర్ధరాత్రి ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన ఘోర అగ్ని ప్రమాదంలో దగ్ధమైన బోట్ల కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు కేసు వివరాలను విశాఖ సిటీ పోలీసు కమిషనర్ ఎ.రవిశంకర్ శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ ప్రమాదంలో ప్రధాన నిందితులుగా వాసుపల్లి నాని, ఆయన మామయ్య అల్లిపిల్లి సత్యంలను గుర్తించామని తెలిపారు. సంఘటన జరిగిన రోజున ఉదయం పది గంటల నుండి రాత్రి తొమ్మిది గంటల వరకు అల్లిపిల్లి వెంకటేష్‌కు చెందిన 887 నెంబర్ బోటులో వీరు ఉన్నారని, అక్కడే మద్యం సేవిస్తూ, సిగరెట్లు కాల్చారని చెప్పారు. సిగరెట్‌ను ఆర్పకుండా పక్కనే ఉన్న ముస్నెం హరి సీతారాంకు చెందిన 815 నెంబరు బోటులో విసిరేశారన్నారు. అక్కడ నైలాన్ వలకు నిప్పు అంటుకొని చిన్నగా పొగ మొదలైందని, అదే సమయంలో ఆ ప్రాంతమంతా సముద్రంపై గాలులు వీయడంతో మంటలు పెరిగాయని తెలిపారు. వాటిని చూసి వీరు భయపడి పారిపోయారని చెప్పారు. ఈ ప్రమాదం అనుకోని విధంగా జరిగినప్పటికీ ఆ ప్రాంతంలో అనేక భద్రతా, పర్యవేక్షణ లోపాలు ఉన్నాయని గుర్తించామని పోలీసు కమిషనర్ వెల్లడించారు. కేసు విచారణకు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, వారు సిసి టివి కెమెరాల ఫుటేజీలను పరిశీలించి 20 మంది అనుమానితులను విచారించారని తెలిపారు. ఈ క్రమంలోనే కేసును ఛేదించామని చెప్పారు.

యూట్యూబర్ నానికి సంబంధం లేదు

సంఘటన జరిగిన అనంతరం ప్రసార మాధ్యమాల్లోనూ, స్థానికంగా అందిన ప్రాథమిక సమాచారం మేరకు విచారణలో భాగంగా యూట్యూబర్ నానిని అదుపులోకి తీసుకున్నామని పోలీసు కమిషనర్ చెప్పారు. విచారణ తరువాత ఆయనను నిరపరాధిగా నిర్ధారించామని తెలిపారు. తాజాగా ఆయన స్నేహితులు హైకోర్టులో వేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌కు కూడా తాము సమాధానం ఇచ్చామని చెప్పారు.

ఆందోళనకు దిగిన నిందితుల బంధువులు

హార్బర్‌లో జరిగిన ఘోర అగ్ని ప్రమాదానికి కారకులుగా భావిస్తూ వాసుపల్లి నాని, అల్లిపిల్లి సత్యంలను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ వారి కుటుంబీకులు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. ఘటన సమయంలో అసలు వాళ్లు అక్కడ లేరని, తప్పుడు సాక్ష్యాలతో అరెస్ట్ చేసారని పేర్కొంటూ కొందరు మహిళలు రోడ్డుపై బైఠాయించారు.

పోలీసుల తీరుపై భిన్న కథనాలు

ఈ ప్రమాదంపై పోలీసులు తీరుపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. సిసి టివి ఫుటేజీలు, ప్రాథమిక సమాచారం ఉందని అధికారులు తెలిపినప్పటికీ వివరాలు వెల్లడించేందుకు ఆరు రోజుల సమయం తీసుకోవడం, విచారణలో జాప్యం పలు అనుమానాలకు దారితీస్తోందని స్థానికులు అంటున్నారు. కేసును ఎలాగైనా క్లోజ్ చేయాలన్న తలంపు పోలీసుల్లో కనిపించిందని కొందరు ఆరోపిస్తున్నారు. సంఘటన జరిగిన రెండో రోజు జిల్లా కలెక్టర్ ఏర్పాటు చేసిన ఐదుగురు సభ్యుల కమిటీ నివేదిక, విచారణపై పోలీసులు ఎటువంటి వివరణా ఇవ్వకపోవడం వంటి అంశాలు ఈ ప్రమాద సంఘటనను ముగించే ప్రయత్నమేనని అంటున్నారు.

బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ ఆత్మహత్య

- మూడు రోజుల క్రితం ఎసిబికి పట్టుబడి పరారీ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అవినీతి నిరోధక శాఖకు చిక్కి పరారీలోనున్న శ్రీ సత్యసాయి జిల్లా బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాస్ నాయక్ (47) ఆత్మహత్యకు పాల్పడారు. శనివారం సాయంత్రం చెన్నైలోని ఓ భవనం పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడినట్టు సమాచారం. ఈ నెల 22వ తేదీన ఓ రైతు నుంచి పది వేల రూపాయలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కారు. ఎసిబి అధికారుల విచారణ జరుగుతున్న సమయంలో బాత్‌రూంకు వెళ్లివస్తాయని చెప్పి కార్యాలయం నుంచి పారిపోయాడు. మూడు రోజులుగా పోలీసులు ఆయన కోసం గాలించారు. అయినా ఆచూకీ లభించలేదు. ఈ పరిస్థితుల్లో శ్రీనివాస్‌నాయక్ చెన్నై నగరంలో ఆత్మహత్యకు పాల్పడినట్టు బంధువులకు సమాచారం అందింది.శ్రీనివాస నాయక్‌ది పెనుకొండ మండలం గౌనిపల్లి గ్రామం. ఈయనకు భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

'బిసిల వెన్ను విరుస్తున్న జగన్'

పుస్తకాన్ని ఆవిష్కరించిన అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి ముద్రించిన 'బిసిల వెన్ను విరుస్తున్న జగన్' అనే పుస్తకాన్ని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టిడిపి బలహీన వర్గాల పార్టీ కావడంతో వైఎస్ కుటుంబం ఉక్కుపాదంతో అణచివేస్తోందని విమర్శించారు. బిసిల ఓట్లను తొలగించడానికి వలంటీర్ల ద్వారా జనగణన చేస్తున్నారని ఆరోపించారు. జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత 74 మంది హత్యగావించబడ్డారని విమర్శించారు. తనతో పాటు దాదాపు 800 మందిపై అక్రమ కేసులు బనాయించారని, 3వేల మందిపై దాడి చేసి ఇబ్బందులకు గురిచేశారని చెప్పారు. ప్రతి రంగంలో బిసిలకు చంద్రబాబు పెద్దపీట వేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కొల్లు రవీంద్ర, బుద్ధా వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

బోటు ప్రమాద బాధితులకు టిడిపి ఆర్థిక సాయం

విశాఖపట్నంలోని షిపింగ్ హార్బర్‌లో చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో బోట్లు కోల్పోయిన బాధితులకు ఆర్థిక సాయం అందించాలని పార్టీ నిర్ణయం తీసుకున్నట్లు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తిగా బోట్లు కోల్పోయిన వారికి రూ.లక్ష చొప్పున, పాక్షికంగా పాడైపోయిన వారికి రూ.50 వేలు, బోటు కలాసీలకు రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నామని ప్రకటించారు. బాధితులను పూర్తిగా ఆదుకోవడంలో ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని విమర్శించారు. టిడిపి-జనసేన ప్రభుత్వం అధికారంలోకి రాగానే బాధితులకు కొత్తబోట్లు అందించడంతోపాటు అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. తెరవెనుక తన తమ్ముడిని పెట్టి జగన్ ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారని మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు విలేకరుల సమావేశంలో విమర్శించారు. మైనింగ్‌తో సంబంధం లేని కంపెనీలకు ఇసుక కాంట్రాక్టులు ఎలా కట్టబెడతారని ప్రశ్నించారు. ప్రతిపక్షాలపై తప్పుడు కేసులు పెట్టడమే ఎజెండాగా జగన్ పాలన ఉందని పొలిట్‌బ్యూరో సభ్యులు బొండా ఉమామహేశ్వరరావు విమర్శించారు. తిరుపతికి చెందిన హథీరామ్‌జీ ట్రస్టును నిర్వీర్యం చేసే పనిలో వైసిపి నాయకత్వం తలమునకలైందని టిడిపి ఎస్‌టి సెల్ అధ్యక్షులు ఎం ధారునాయక్ విమర్శించారు.

ప్రియాంకకు విమానాశ్రయంలో ఘన స్వాగతం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీకి గన్నవరం ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం లభించింది. తెలంగాణలో ఎన్నికల ప్రచారం ముగించుకుని ప్రియాంక గాంధీ గన్నవరం ఎయిర్‌పోర్టుకు శనివారం సాయంత్రం చేరుకున్నారు. పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు శాలువాతో ఘన స్వాగతం పలికారు. కాంగ్రెస్ నేతలు జెడి శీలం, సుంకర పద్మశ్రీ, జంగా గౌతమ్, నరహరశెట్టి నరసింహారావు, శ్రీరామ్మూర్తి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అనంతరం గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు.

టిబి రోగులకు పౌష్టికాహారాన్ని ఇవ్వండి

- కార్పొరేట్ సంస్థలకు వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ సిఎస్ ఎం.టి. కృష్ణబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిబి రోగులకు అవసరమైన పౌష్టికాహారాన్ని అందించేందుకు ముందుకు రావాలని కార్పొరేట్ సంస్థలకు వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ సిఎస్ ఎం.టి. కృష్ణబాబు విజ్ఞప్తి చేశారు. మంగళగిరి ఎపిఐఐసి టవర్స్ తన ఛాంబర్‌లో కొహన్స్ లైఫ్ సైన్సెస్ లిమిటెడ్ (అపరేషన్) ఎంఎస్ఎన్ రెడ్డి క్షయ రోగులు బలవర్ధక ఆహారాన్ని అందజేసేందుకు కనెక్ట్ టు ఆంధ్రా సంస్థ సిఇఒ శివశంకర్ ద్వారా శుక్రవారం కృష్ణబాబుకు రూ.40 లక్షల చెక్‌ను అందజేశారు.

ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ కోహెన్స్ లైఫ్ సైన్సెస్ లిమిటెడ్ సంస్థ స్ఫూర్తితో క్షయ రోగులకు బలవర్ధకమైన ఆహారాన్ని అందచేసేందుకు కార్పొరేట్ సంస్థల యాజమాన్యాలు తమ కార్పొరేట్ సామాజిక బాధ్యతతో ముందుకు రావాలన్నారు. అదనపు పౌష్టికాహారాన్ని అందించేందుకు ముందుకు రావాలని కార్పొరేట్ సంస్థల యాజమాన్యాలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో పేద ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపర్చేందుకు మెరుగైన సేవలందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. టిబి రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని పేర్కొన్నారు.

1 నుంచి ఆరోగ్యశ్రీపై అవగాహన

- సిఇఒ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జగనన్న ఆరోగ్య సురక్ష-2ను జనవరి ఒకటి నుంచి జరపాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారని, అందుకనుగుణంగా డిసెంబరు ఒకటి నుంచి ఎఎన్‌ఎంలు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్యశ్రీపై అవగాహన కల్పించి బ్రోచర్‌కు అందజేయాలని ఆరోగ్యశ్రీ సిఇఒ వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం నాడు మంగళగిరిలోని ఆరోగ్యశ్రీ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 26 జిల్లాల ఎఎన్‌ఎంల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ బ్రోచర్‌లోని ప్రతి విషయాన్నీ ప్రజలకు వివరించాలన్నారు. ఆరోగ్యశ్రీ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు.

కళ్లాలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘం నేతలు

కళ్లాల్లో ధాన్యం కొనుగోలు చేయాలి

ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు రూరల్ మండలంలోని మల్కాపురంలో ఎపి రైతు సంఘం నాయకులు శనివారం పర్యటించి కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ధాన్యం ఇప్పటి వరకు కళ్లాలోనే ఉందని, అకాల వర్షాలు పడితే తీవ్ర ఇబ్బందులు పడతామని ఆందోళన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు వేగవంతంగా జరిగేలా చూడాలని నేతల దృష్టికి తీసుకెళ్లారు.

ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. రైతుల కళ్లాల నుండి ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వాతావరణంలో మార్పులు రావడంతో వర్షాలు కురుస్తున్నాయని, అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చిరిగిన గోనె సంచులు ఇవ్వడం వల్ల ధాన్యం నేలపాలై రైతులు నష్టపోతున్నారన్నారు. తేమ శాతం నిబంధనలు సడలించి ధాన్యం కొనుగోలు చేయాలని, నాణ్యమైన గోనె సంచులు రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లుకలాపు దుర్గారావు, లుకలాపు రమేష్, వట్టి సత్యనారాయణ, ఎ.రామారావు, కె.ప్రసాద్, మజ్జి రామారావు పాల్గొన్నారు

బిల్లులపైనా నిఘా

- వివరాలు చెప్పకపోవడంపై పిఎజి ఆరా

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఎఫ్‌ఆర్‌ఎంబి (ద్రవ్య బాధ్యత-బడ్జెట్ నిర్వహణ) చట్టంలోని నిబంధనలను పాటించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. చాలాకాలం నుంచి ఈ అంశాలపై ఆరోపణలు వస్తున్నప్పటికీ ఆర్థికశాఖ నుంచి స్పందన మాత్రం కనిపించడం లేదన్న భావన వ్యక్తమవుతోంది. ప్రధానంగా బిల్లులకు సంబంధించిన బకాయిలపైనా వివరాలు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. చివరకు ఇదే అంశంపై దృష్టి సారించిన ప్రధాన గణాంక జనరల్ కార్యాలయం కూడా కొద్ది రోజుల క్రితం రాష్ట్ర ఆర్థికశాఖను ప్రశ్నించినట్లు తెలిసింది.

ఎఫ్‌ఆర్‌బిఎం చట్టంలోని ఆరో నిబంధన మేరకు ఫారం డి-9 కింద కొన్ని వివరాలు సమర్పించాల్సి ఉంటుంది. ప్రధానంగా రాష్ట్రంలో నిర్వహిస్తున్న భారీ పథకాలపై కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బకాయిలపైనా చెప్పాల్సి ఉంటుంది. అయితే చాలాకాలంగా ఈ వివరాలను ప్రభుత్వం సమర్పించడం లేదన్నది ప్రధాన అపవాదు. తాజాగా తమకు బిల్లులు చెల్లించడం లేదని, అప్పుల బాధ తట్టుకోలేక అనేక మంది చిన్న కాంట్రాక్టర్లు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారని కాంట్రాక్టర్ల సంఘం తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ విజయవాడలో నిరసన ప్రదర్శన కూడా చేసింది. ఈ తరుణంలోనే బిల్లుల బకాయిలపై పిఎజి నుంచి ప్రశ్నలు రావడం గమనార్హం. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన గణాంకాల్లో డి-9 ఫార్మాట్‌లో ఎటువంటి వివరాలు ఇవ్వకపోవడాన్ని తన లేఖలో పిఎజి ఆక్షేపించినట్లు తెలిసింది. అప్పటివరకు ఉన్న అప్పుల వివరాలు కూడా అందకపోవడాన్ని పిఎజి ప్రస్తావించింది. అందుకే పూర్తి స్థాయి ఆడిట్ నిర్వహించలేకపోతున్నామని కూడా పేర్కొన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే మార్చి 2023 ఆర్థిక సంవత్సరంతో ముగిసిన ఏడాదికి వివరాలు సమర్పించాలని కోరినట్లు సమాచారం. ప్రధాన పనులకు సంబంధించి ఎంత బిల్లులు చెల్లించాలి, ఇంకా ఎంత మొత్తం బకాయిలుగా ఉన్నాయి, భూసేకరణ వంటి అంశాలకు చెల్లించాల్సిన బకాయిలు వంటివి తక్షణమే సమర్పించాలని కోరినట్లు తెలిసింది.

27 నుంచి లోకేష్ యువగళం

- యాత్ర నిలిచిన రాజోలు నుంచే ప్రారంభం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర తిరిగి ఈ నెల 27 నుంచి పున:ప్రారంభం కానుంది. రాష్ట్రంలో 400 రోజుల పాటు 4 వేల కిలోమీటర్ల వరకు పాదయాత్ర చేయాలనే లక్ష్యంతో చిత్తూరు జిల్లా కుప్పం నుంచి జనవరి 27న యాత్ర ప్రారంభమైన సంగతి తెలిసిందే. అయితే టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టుతో సెప్టెంబరు 9న యాత్ర నిలిచిన విషయం తెలిసిందే. యాత్రను నిలుపుదల చేసిన రాజోలు నియోజకవర్గం పొదలాడ నుంచి మళ్లీ సాగనుంది. కుప్పం నుంచి పొదలాడ వరకు 208 రోజులపాటు 2,852.4 కిలోమీటర్లు పూర్తి చేశారు. ఇప్పటి వరకు 9 ఉమ్మడి జిల్లాల్లోని 84 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కొనసాగింది. తూర్పుగోదావరిలో 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పాదయాత్ర సాగనుంది. తుని మీదుగా ఉమ్మడి విశాఖ జిల్లాలోకి ప్రవేశించనుంది.

'సంగం' ప్రతిష్టను దెబ్బతీసే కుట్ర : దూళిపాళ్ల

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సంగం డెయిరీ ప్రతిష్టను దెబ్బతీసేందుకు వైసిపి నాయకులు కుట్ర చేస్తున్నారని సంగం డెయిరీ చైర్మన్ దూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆరోపించారు. గుంటూరు లో ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ.. అమూల్ కోసమే సంగం డెయిరీ వ్యాపారాన్ని దెబ్బతీయాలని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి కుట్రలు చేస్తున్నారని, సజ్జల రామకృష్ణారెడ్డి నేతృత్వంలో పోలీసు అధికారులు తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు. ఎన్ని కేసులు పెట్టినా వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. డెయిరీ వద్ద ఘర్షణతో తమకు సంబంధం లేకున్నా తనతోపాటు సీనియర్ జిఎం ప్రసాద్, పలువురు ఉద్యోగులు, కాంట్రాక్టర్లపై ఉద్దేశపూర్వకంగా ఎఫ్ఐఆర్‌లో పేర్లు చేర్చారని విమర్శించారు. పశ్చిమ గోదావరి జిల్లా జానంపేటకు చెందిన పాల వ్యాపారి ముసునూరి రాము తమపై ఫిర్యాదు చేస్తే వైసిపి నాయకులు ఎందుకు జోక్యం చేసుకున్నారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే కిలారి రోశయ్య ఆధ్వర్యంలోనే పోలీసులపై ఒత్తిడి తెచ్చి హత్యాయత్నం కేసులు నమోదు చేశారని తెలిపారు. డెయిరీలో ఏటా ఒకే రకం బోనస్ ఇవ్వరని, లాభాలకు అనుగుణంగా పాలకవర్గం బోనస్‌ను నిర్ణయిస్తుంద న్నారు. సంగం డెయిరీకి నష్టం కలిగించేలా వ్యవహరించిన పోలీసులపై చట్టపరంగా సివిల్, క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సంగం డెయిరీ డైరెక్టర్లు కంచర్ల శివరామయ్య, వలివేటి ధర్మారావు, గొల్లపూడి శ్రీనివాసరావు, బొర్రు రామారావు, కట్టా జగన్మోహన్‌రావు, పులుకూరి శ్రీనివాసరావు, శేషకుమారి, మరీదు వెంకటేశ్వరరావు, దేవిరెడ్డి వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మోడీ క్షమాపణ చెప్పాలి

మొదటి పేజీ తరువాయి

నిలదీయాలని కోరారు.

పవన్‌ను జనసైనికులు ప్రశ్నించాలి

జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారు వస్తుందని, మోడీని మూడోసారి ప్రధానిని చేయాలని అంటున్నారని, ఇది ఎందుకో చెప్పాలన్నారు. డబుల్ ఇంజన్‌తో రాష్ట్రాన్ని విధ్వంసం చేస్తున్నందుకా అని ప్రశ్నించారు. హోదా పాచిపోయిన లడ్డు అన్న పవన్ ఇప్పుడు వాటిని తీసుకొచ్చి వెంకన్న కాళ్లదగ్గర పెట్టి క్షమాపణ కోరాలన్నారు. ప్రశ్నించడానికి పుట్టామని చెప్పిన ఆయన మోడీని ప్రశ్నిస్తారా లేదో ప్రజలకు చెప్పాలన్నారు. జనసేనను ఆర్‌ఎస్ఎస్‌లో విలీనం చేసేలా ఉన్నారని అన్నారు. గతంలో అతని అన్న పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసిన సంగతిని గుర్తుచేశారు. ఆర్‌ఎస్ఎస్‌కు వంతపాడటంపై జనసైనికులు పవన్‌ను ప్రశ్నించాలని అన్నారు. మోడీ జగన్ కలిసి ఎపిని అదానీకి కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని, విద్యుత్ స్మార్ట్ మీటర్లు, సోలార్ ఒప్పందం ఇందులో భాగమేనని చెప్పారు. గ్రీన్‌ఎనర్జీలో 58 శాతం అదానీ చేతిలో ఉందని, విద్యుత్‌పై ఆయనకు గుత్తాధిపత్యం కల్పిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో అదానీ దోపిడీని పురందేశ్వరి ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు.

స్మార్ట్ మీటర్లపై విచారణ జరపాలి

మోడీ ఆదేశాల మేరకే జగన్ విద్యుత్ ఒప్పందాలు చేసుకున్నారని తెలిపారు. సోలార్ విద్యుత్ యూనిట్ రూ.2.71 పైసలకు ఒప్పందం చేసుకుంటున్నారని, దేశంలో ఎక్కడైనా ఇలాంటి ఒప్పందం ఉందా అని ప్రశ్నించారు. గతంలో రూ.2.48 పైసలకు తీసుకుంటేనే విచారణ చేయాలని కోరిన జగన్ ఇప్పుడు ఎందుకు ఇంత పెద్దఎత్తున ఒప్పందం చేసుకున్నారో చెప్పాలని ప్రశ్నించారు. ప్రతి రెండేళ్లకోసారి సోలార్ ఉత్పత్తి ఖర్చు తగ్గుతోందని అయినా 25 ఏళ్లకు ఒప్పందం చేసుకున్నారని అన్నారు. సోలార్ విద్యుత్ యూనిట్ రూ.0.46 పైసలుకు వస్తుందని, ప్యానల్స్ ధరలు కూడా తగ్గిపోతున్నాయని చెప్పారు. ఇప్పటికే రూ.2,600 కోట్లు అదానీకి దోచిపెట్టి వినియోగదారుల నుండి వసూలు చేస్తున్నారని తెలిపారు. స్మార్ట్‌మీటర్లు కూడా అదానీ కోసం పెడుతున్నారని అన్నారు. ఒక్కో మీటరు (గృహావసర) రూ.14 వేల నుండి రూ.17 వేలకు, వ్యవసాయ మీటరును రూ.37 వేలకు కొంటున్నారని, దేశంలో ఎక్కడా ఇంత రేటు లేదని అన్నారు. స్మార్ట్‌మీటర్ల టెండర్లపై జ్యుడీషియల్ స్క్రూటినీ పెట్టి దోపిడీనీ అరికట్టాలని కోరారు. గృహావసర మీటరు రూ.3,500, దాని నిర్వహణకు మరో రూ.3500 అవుతోందని, అయినా రూ.14 వేలకు కొంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న 1.91 కోట్ల విద్యుత్ కనెక్షన్లలో 1.48 కోట్లు గృహావసర కనెక్షన్లని, ఒక్కో కనెక్షన్‌పై రూ.10 వేలు భారం వేస్తున్నారని, వ్యవసాయ కనెక్షన్‌కు రూ.20 వేలు అదనంగా వసూలు చేస్తున్నారని అంటే రూ.20 వేల కోట్ల కుంభకోణం జరుగుతోందని తెలిపారు. స్మార్ట్ మీటర్లు వల్ల విద్యుత్ నష్టాలను తగ్గించొచ్చని విద్యుత్ సిఎండి పద్మాజనార్ధన్‌రెడ్డి చెబుతున్నారని, అదెలా సాధ్యమో ఆయనే చెప్పాలన్నారు.

ఈ పేరుతో 15 శాతం డిస్ట్రిబ్యూషన్ లాస్‌ను కూడా ప్రజల నుండి వసూలు చేయనున్నారని తెలిపారు. వినియోగించిన విద్యుత్ కంటే అదనపు విద్యుత్‌కు బిల్లులు వసూలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలపై పెనుభారం పడి భవిష్యత్‌లో ఎపి చీకటిమయం అవుతుందని తెలిపారు. ఈ విషయంలో మోడీ, జగన్ ఆడుతున్న నాటకాన్ని బయటపెట్టాలని, స్మార్ట్ మీటర్ల వ్యవహారంపై విచారణ జరపాలని డిమాండు చేశారు.

సంపన్నుల చేతుల్లోకి అసైన్డ్ భూములు

ప్రభుత్వ నిర్వాకం వల్ల అసైన్డ్ ల్యాండ్ పేదల చేతుల్లో నుండి సంపన్నుల చేతుల్లోకి మారుతోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. వెంకటేశ్వర్లు అన్నారు. అసలు లబ్ధిదారులకే భూములు అప్పగించాలని డిమాండ్ చేశారు. అసైన్డ్ భూములు పొందిన పేదలకు ఎలా లాభం చేయాలనే అంశంపై ధర్మాన నాయకత్వంలో వేసిన కమిటీ వేర్వేరు రాష్ట్రాల్లో విచారించి అక్టోబరు 11న క్యాబినెట్‌కు నివేదిక సమర్పించిందని తెలిపారు. ఎపిలో 33 లక్షల ఎకరాలు పంచగా 15 లక్షల ఎకరాలు పెద్దల చేతుల్లోకి వెళ్లాయని నిర్ధారణ అయిందని చెప్పారు. పేదలకు ఆ భూములను అప్పగించేందుకు అసైన్డ్ చట్టాన్ని సవరించారని తెలిపారు. ఇది పేదలను మోసం చేసేందుకు ఆడుతున్న నాటకమని సిపిఎం గతంలోనే బయటపెట్టిందన్నారు. అయినా వైసిపి ప్రకటనను పేదలు నమ్మారని తెలిపారు. కొంత పరిహారం చెల్లిస్తే భూములు రెగ్యులరైజ్ చేస్తామని ఇటీవల ప్రభుత్వం మెమో విడుదల చేసి పేదలను నిలువునా ముంచిందని విమర్శించారు. అసైన్డ్ వివరాలు గ్రామ సచివాలయాల్లో పెడతామని తెలిపారని, ఇంతవరకు పెట్టలేదని అన్నారు. ఆక్రమణలో ఉన్న భూములను భేషరతుగా నిజమైన హక్కుదారులు, వారి వారసులకు తిరిగి ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం ఆ పనిచేయకపోతే సిపిఎం ఆధ్వర్యాన పేదలకు భూములను అప్పగించేందుకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ మోసంపై జనసేన, టిడిపిలు స్పందించడం లేదని విమర్శించారు.

రేపు విదేశీ శాస్త్రవేత్తల పర్యటన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అమలవుతోన్న ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలన చేసేందుకు 27, 28 తేదీల్లో విదేశీ రైతు శాస్త్రవేత్తల బృందం రానుందని రైతు సాధికార సంస్థ పేర్కొంది. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేసింది. ఈ బృందం రాయలసీమ పరిధిలోని చిత్తూరు, అన్నమయ్య, అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో పర్యటించనుందని సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ విజయకుమార్ తెలిపారు. కెన్యా, జింబాబ్వే, సెనెగల్, బుర్కినాఫాసో, ట్యునీషియా, పెరూ దేశాలకు చెందిన పర్యావరణ వేత్తలు ఈ బృందంలో ఉన్నారని పేర్కొన్నారు.

మరో 9 పాలిటెక్నిక్ కళాశాలలకు నాక్ గుర్తింపు

- నైపుణ్యాభివృద్ధిశాఖ కార్యదర్శి సురేష్‌కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మరో 9 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బిఎ) గుర్తింపు పొందాయని నైపుణ్యాభివృద్ధిశాఖ కార్యదర్శి సురేష్‌కుమార్ తెలిపారు. ఎన్‌బిఎ సంబంధించిన వివరాలను శనివారం ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు. ఇప్పటికే 9 పాలిటెక్నిక్ కళాశాలల్లో 17 ప్రోగ్రామ్స్‌కు ఎన్‌బిఎ దక్కాయని పేర్కొన్నారు. కొత్తగా అనకాపల్లి, గన్నవరం, కళ్యాణదుర్గం, ఆముదాలవలస, గుంటూరు, నంద్యాల, కలికిరి, పార్వతీపురం, రాజంపేట, కాకినాడ, ధర్మవరం, చంద్రగిరి, ఆత్మకూరు కళాశాలల్లో 16 బ్రాంచ్‌లలో గుర్తింపు దక్కించుకున్నాయని తెలిపారు. అన్ని కళాశాలలు ఎన్‌బిఎ సాధించాలని సాంకేతిక విద్యాశాఖ ప్రయత్నాలు సత్ఫలితాలని ఇస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో మొత్తం 87 కళాశాలలు ఉండగా, తొలిదశలో 41 కళాశాలలు ప్రయత్నించామని, 18 గుర్తింపు పొందాయని వివరించారు. 2024-25 విద్యా సంవత్సరంలో మిగిలిన వాటికి గుర్తింపు వచ్చేలా కార్యాచరణ అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. పాలిటెక్నిక్ విద్యను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాల మేరకు నిర్వహించాలన్న ప్రభుత్వ లక్ష్య సాధన దిశలో ముందడుగు వేస్తున్నామని చెప్పారు. రానున్న రెండు నెలల్లో మరో 11 కళాశాలలకు ఎన్‌బిఎ లభించే అవకాశం ఉందని, ఇందుకు సంబంధించిన పనులు వేగంగా సాగుతున్నాయని కమిషనర్ సిహెచ్ నాగరాణి తెలిపారు. విద్యార్థులకు ఉపాధి ఏ మేరకు లభిస్తుందన్న అంశాన్ని కూడా ఎన్‌బిఎ పరిగణనలోకి తీసుకుంటుందని పేర్కొన్నారు. విద్యార్థుల వసతి గృహాలను మెరుగుపరిచి కొత్త ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థ నడిచేందుకు మార్గం సుగమం చేశామని తెలిపారు.

బిజెపి కబంధ హస్తాల నుండి
రైతులు, ప్రజలను రక్షించుకోవాలి

- కార్మిక, రైతు సంఘాల ఐక్యవేదిక
- 27, 28 తేదీల్లో మహాధర్నాను జయప్రదం చేయాలని విజ్ఞప్తి

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న శోభనాద్రీశ్వరరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దేశంలో రైతులు, కార్మికులు, సామాన్య ప్రజలను రక్షించుకోవాలని రైతు, కార్మిక సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు కోరారు. 27, 28 తేదీల్లో జరిగే మహాధర్నాకు సంబంధించి శనివారం కొండూరు కళ్యాణ మండపంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శోభనాద్రీశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ.. నవంబరు 27, 28 తేదీల్లో జింఖానా గ్రౌండ్‌లో మహాధర్నా జరగనుందని, దీనిలో అందరూ పాల్గొని మోడీ విధానాలను తిప్పి కొట్టాలని అన్నారు. రాజ్యాంగం ప్రకారం సహజ వనరులు ప్రజలకు చెందాల్సి ఉండగా కార్పొరేట్ కోటీశ్వరుల వద్ద పోగుపడుతోందని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారం ప్రజల హక్కులు కాపాడుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. దేశాన్ని దివాళా తీయించిన మోడీ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పేర్కొన్నారు. ప్రజలపై కోట్లాది రూపాయల భారం మోపి ప్రజల నడ్డి విరగ్గొడుతున్నారని విమర్శించారు. అదానీ, అంబానీల అడ్డగా దేశాన్ని మార్చారని పేర్కొన్నారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు మాట్లాడుతూ.. రైతు, వ్యవసాయ కార్మిక ఉద్యోగ, మహిళా, మైనార్టీ, దళిత, షెడ్యూలు తెగల సమస్యల పరిష్కారానికి రైతులు, కార్మికులు, కష్టజీవులు కలిసి రావాలన్నారు.

సహజ వనరులన్నీ అదానీ, అంబానీలకు కట్టబెడుతున్న బిజెపి పాలనను గద్దె దించాలని కోరారు. లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రం అమ్ముతోందని పేర్కొన్నారు. కరువు ఏర్పడి రైతులు, కూలీలు అవస్థలు పడుతుంటే ముఖ్యమంత్రి జగన్ ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. నదీ జలాలు వృథాగా సముద్రం పాలవుతుంటే పట్టించుకోకుండా మొద్దు నిద్రపోతున్నారని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు మాట్లాడుతూ.. బిజెపి కబంధ హస్తాల్లో నుండి వ్యవసాయ, పారిశ్రామిక రంగాన్ని కాపాడుకోవాలని అన్నారు. దీనికోసం అన్ని వర్గాల ప్రజలు ఉద్యమంలోకి రావాలని కోరారు. రైతు సంఘాల నాయకులు కెవివి ప్రసాద్, సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ఐదో షెడ్యూలు కల్పించిన హక్కుల ప్రకారం ఆదివాసీలను, గిరిజనులను వారి భూముల నుండి తరిమేయొద్దని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, వేర్వేరు సంఘాల నాయకులు దడాల సుబ్బారావు, కె ధనలక్ష్మి, ఎం హరిబాబు, పి జమలయ్య, ఆళ్ల వెంకట గోపాలకృష్ణ, కుర్రా నరేంద్ర, ఎ రవిచంద్ర, ఎం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బిజెపిని సాగనంపడానికి ప్రజలు సిద్ధం

- మోడీ అసమర్థ పాలనతో దేశం వెనక్కి
- 5 రాష్ట్రాల ఎన్నికల్లో కాంగ్రెస్, మిత్రపక్షాల విజయం
- సిపిఐ ప్రధాన కార్యదర్శి డి రాజా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్రంలో పదేళ్లుగా అధికారంలో ఉన్న బిజెపి అనుసరిస్తున్న విధానాలతో విసిగిపోయిన ప్రజలు ఆ పార్టీని సాగనంపడానికి సిద్ధంగా ఉన్నారని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు విజయం సాధిస్తాయని, దీని ప్రభావం 2024 సార్వత్రిక ఎన్నికల్లో కనిపిస్తుందని తెలిపారు. విజయవాడలోని దాసరి భవన్‌లో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోడీ ప్రజావ్యతిరేక విధానాలు అనుసరిస్తుండటంతో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అన్నారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రజల మధ్య విద్వేషాలు, అసమానతలు పెంచుతున్నాయని తెలిపారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల తరువాత ఇండియా వేదిక బలమైన రాజకీయ శక్తిగా మారబోతోందన్నారు. ఆకలి సూచీలో 120 దేశాల్లో భారతదేశం 111వ స్థానంలో ఉందన్నారు. మహిళలకు, చిన్నారులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. సామాజిక న్యాయం కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికల తరువాత ఇండియా వేదికలోని పార్టీలు దేశవ్యాప్తంగా మోడీకి వ్యతిరేకంగా ఐక్యపోరాటాలు చేసేందుకు భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. రాజకీయ పరిస్థితులు ఒక్కో రాష్ట్రంలో ఒక్కో రకంగా ఉంటాయని, ఆంధ్రప్రదేశ్‌లో లౌకిక పార్టీలు ఐక్య పోరాటాలకు కలిసి రావాలని కోరారు. చంద్రబాబు అరెస్టు విషయంలో ఎవరున్నారనేది త్వరలో నిజాలు బయటకు వస్తాయన్నారు. ఇజ్రాయిల్, పాలస్తీనా యుద్ధాన్ని ఆపాలని కోరారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో దొంగల రాజ్యం నడుస్తోందని, ఇసుక, మద్యం పాలసీల్లో పెద్దయెత్తున దోపిడీ జరుగుతోందని విమర్శించారు. యథేచ్ఛగా ఇసుక దోపిడీ జరుగుతోందని, నాసిరకం మద్యం విక్రయిస్తున్నారని తెలిపారు. హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘించి సిఎం వ్యవహరిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, గుజ్జుల ఈశ్వరయ్య, అక్కినేని వనజ పాల్గొన్నారు.

ప్యూర్ ఇవి నుంచి ఎకోడ్రిఫ్ట్ 350 విడుదల

హైదరాబాద్ : విద్యుత్ ద్విచక్ర వాహనాల కంపెనీ ప్యూర్ ఇవి కొత్తగా ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్ వేరియంట్ ఎకోడ్రిఫ్ట్ 350ని విడుదల చేసింది. ఒకే ఛార్జ్‌తో 171 కిలోమీటర్లు ప్రయాణించవచ్చని ఆ సంస్థ పేర్కొంది. కమ్యూటర్ సెగ్మెంట్‌లో అత్యంత సుదూర శ్రేణీ ఇ-మోటార్‌సైకిల్‌గా నిలువనుందని తెలిపింది. ఇది భారతీయ రోడ్ల కోసం రైడర్ అనుభవాన్ని మెరుగుపరచడానికి రూపొందించ బడిన లక్షణాలు కలిగి ఉందని పేర్కొంది. ప్రతి రోజు ఎక్కువగా ప్రయాణించే వినియోగదారులకు ఇది ఎంతగానో ఉపయోగపడనుందని తెలిపింది. దీంతో ప్రతీ నెల దాదాపు రూ.7,000 కంటే ఎక్కువ పొదుపు కోసం చూస్తున్న వినియోగదారులకు మంచి అవకాశమని పేర్కొంది. ఈ ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్ 3.5 కెడబ్ల్యుహెచ్ లి-అయాన్ బ్యాటరీ, 3 కేడబ్ల్యు పవర్ ట్రెయిన్‌తో 6 ఎంసియూలతో అనుసంధానం కలిగి ఉందని పేర్కొంది. ఎకోడ్రిఫ్ట్ 350 మార్కెట్ ధరను రూ.1,29,999 గా నిర్ణయించినట్లు తెలిపింది. దేశంలోని 100కి పైగా ఉన్న ప్యూర్ డీలర్‌షిప్‌లలో అందుబాటులో ఉంటుందని వెల్లడించింది.

మార్చి కల్లా 2500 శాఖలకు విస్తరణ

పూణె : ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బిఒఎం) 2024 మార్చి ముగింపు నాటికి 2500 శాఖలకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆ బ్యాంక్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎఎస్ రాజీవ్ తెలిపారు. గడిచిన నాలుగేళ్లలో కొత్తగా 650 శాఖలను కొత్తగా ఏర్పాటు చేశామన్నారు. ఈ ఏడాది 250 శాఖలను ఏర్పాటు చేయడం ద్వారా వ్యాపారంలో 23-25 శాతం వృద్ధిని సాధించాలని నిర్దేశించుకున్నామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.3,500 కోట్ల నికర లాభాలు అంచనా వేస్తున్నామన్నారు.

లింగ వివక్షను నిర్మూలిద్దాం

- డిఆర్‌డిఎ ఆధ్వర్యాన ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

లింగ వివక్షతను నిర్మూలించాలని డిఆర్‌డిఎ పిడి ఎ.కల్యాణ చక్రవర్తి కోరారు. లింగ ఆధారిత హింసకు వ్యతిరేకంగా శనివారం నుంచి డిసెంబరు 22వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించారు. దీనిలో భాగంగా రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశాల మేరకు సెర్ఫ్ ఆధ్వర్యంలో విజయనగరంలోని డిఆర్‌డిఎ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ.. ఈ ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో భాగంగా వారానికో అంశంపై విస్తతంగా ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. తమ శాఖతోపాటు మహిళా శిశు సంక్షేమ, ఇతర శాఖల సమన్వయంతో ఈ ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. లింగ ఆధారిత హింసను ప్రతీ ఒక్కరూ వ్యతిరేకించాలని, స్త్రీ, పురుషులిరువురూ సమానమేనని, బాలికా విద్యను ప్రోత్సహించాలని, రక్త హీనతను నివారించాలని, బాల్య వివాహాలను నివారించాలని అన్నారు. ప్రచార కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ అధికారులు, సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఆగని ఏనుగుల దాడులు

- అరటి, మామిడి, టమాటా పంటలు ధ్వంసం

ప్రజాశక్తి- వి.కోట

గత నాలుగు రోజులుగా చిత్తూరు జిల్లా అటవీ సరిహద్దు పంట పొలాల్లో ఏనుగులు విధ్వంసం సృష్టిస్తున్నాయి. అరటి, మామిడి, టమాటా, మొక్కజొన్న పంటలను నాశనం చేస్తున్నాయి. శుక్రవారం అర్ధరాత్రి వి.కోట మండల పరిధిలోని తోటకనుమ, కొమ్మరమడుగు, నాగిరెడ్డిపల్లి, వెంకటేపల్లి, దానమయ్య గారిపల్లి, ఎడగురికి, పచ్చారమాకులపల్లి, సికార్లపల్లి అటవీ సరిహద్దు గ్రామాల పంటపొలాల్లోకి 14 ఏనుగులు చొరబడి పంట పొలాలను ధ్వంసం చేశాయి. పచ్చురుమాకులపల్లి గ్రామం వెంకటరమణకు చెందిన ఎకరా టమాటా పంట, సీకర్లపల్లి గ్రామం సుబ్రహ్మణ్యానికి చెందిన రెండెకరాల టమాటా పంటను ధ్వంసం చేశాయి. కొమ్మరమడుగు గ్రామానికి చెందిన కృష్ణమూర్తి సాగు చేసేందుకు వేసిన మల్చింగ్ పేపర్‌ను, యడగురి గ్రామానికి చెందిన రైతు అబ్బయ్య సాగు చేసిన అరటి, మామిడి తోటపై దాడిచేసి చెట్లకొమ్మలను విరిచేశాయి. నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు వెంకటాచలపతి సాగు చేసిన వరి పొలాన్ని నాశనం చేశాయి. పలువురి రైతుల పొలాల్లోని డ్రిప్ పరికరాలను ధ్వంసం చేశాయి. సుమారు రూ. నాలుగు లక్షల మేర నష్టం వాటిలినట్లు పలువురు రైతులు తెలిపారు. గజరాజులు గత నాలుగు రోజులుగా రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఎప్పుడు ఏ పంటపై పడి ధ్వంసం చేస్తాయో అన్న భయాందోళన రైతుల్లో నెలకొంది. అటవీ శాఖ అధికారులు సత్వరం స్పందించి పంట పొలాలపైకి ఏనుగులు రాకుండా చర్యలు తీసుకోవాలని, నష్టపరిహారాన్ని అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఏనుగుల దాడిలో నాశనం అయిన టమాట పంట

జెండా ఊపి రైలును ప్రారంభిస్తున్న రామ్మోహన్ నాయుడు

శ్రీకాకుళం నుంచి కొల్లాంకు ప్రత్యేక రైలు

- ప్రారంభించిన ఎంపి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- ఆమదాలవలస (శ్రీకాకుళం జిల్లా

శబరిమల యాత్రకు వెళ్లే అయ్యప్పస్వామి యాత్రికులకు ప్రత్యేక రైలును ప్రారంభించినట్లు ఎంపి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషన్ నాలుగో నంబరు ప్లాట్ ఫారం నుంచి శ్రీకాకుళం రోడ్డు నుంచి కొల్లాం వెళ్లే ప్రత్యేక రైలుకు శనివారం జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని వివిధ సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించి వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మొదటిసారి ఎంపిగా ఎన్నికైన తరువాత ఉత్తరాంధ్ర ప్రజలు కాశీ వెళ్లేందుకు ప్రత్యేక రైలు ఏర్పాటు చేయాలని పార్లమెంట్‌లో ప్రతిపాదన చేశానని గుర్తు చేశారు. పలుమార్లు రైల్వే అధికారులు, మంత్రులను కలసి వినతిపత్రం అందించానని తెలిపారు. ఇప్పటికే విశాఖ నుంచి వారణాశి వెళ్లేందుకు రైల్వే శాఖ రైలును ఏర్పాటు చేసిందన్నారు. శ్రీకాకుళం రోడ్డు రైల్వే స్టేషన్‌లో పలు రైళ్ల నిలుపుదల చేయాలని రైల్వే అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ మొదలవలస రవి, రైల్వే చీఫ్ బుకింగ్ సూపర్‌వైజర్ ఎల్.శివశంకర్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

లింగ వివక్షకు వ్యతిరేకంగా ప్రచారం

- సెర్ప్ సిఇఒ ఇంతియాజ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సమాజంలో లింగ వివక్షకు వ్యతిరేకంగా డిసెంబరు 22 వరకు ప్రచారం నిర్వహిస్తున్నట్లు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సిఇఒ ఇంతియాజ్ తెలిపారు. లింగ వివక్ష వ్యతిరేక ప్రచార పోస్టరును విజయవాడలోని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ.. భయం, వివక్ష హింస లేని గౌరవప్రదమైన జీవితం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. దీనిపై డిసెంబరు 22 వరకు నాలుగు వారాల పాటు ప్రచారం ఉంటుందన్నారు. ఆధారిక హింస, బాల్య వివాహాలు, మూడవ వారం రక్త హీనత, బాలికా విద్య అనే అంశాలపై ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. రాబోయే రోజుల్లో గ్రామ స్థాయిలో జెండర్ పాయింట్ పర్సన్, జెండర్ ఫోరం, సోషల్ యాక్షన్ కమిటీ, మండల స్థాయిలో జెండర్ రీసోర్స్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. వీటి ద్వారా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ అడిషనల్ సిఇఒ విజయకుమారి, హెచ్‌ఆర్ డైరెక్టరు పి సుశీల, పెన్షన్ డైరెక్టర్ పి లావణ్య కుమారి, హ్యూమన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ పి శ్రీనివాసులు, స్త్రీ నిధి ఎమ్‌డి కెవి నాంచారయ్య పాల్గొన్నారు.

డిఎల్‌ఎఫ్‌లో ఇడి సోదాలు

- డొల్ల కంపెనీలకు రూ.440 కోట్లు తరలింపు..!

న్యూఢిల్లీ : ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ డిఎల్‌ఎఫ్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) సోదాలు చేపట్టింది. సూపర్‌టెక్ గ్రూప్ రియాల్టీ సంస్థ మనీలాండరింగ్ కేసులో భాగంగా గురుగావ్‌లోని డిఎల్‌ఎఫ్ కార్యాలయాల్లో జరిపిన సోదాల్లో పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. కాగా.. సూపర్ టెక్ వ్యవహారంలోనే కంపెనీకి సంబంధించిన లావాదేవీలను అధికారులు తనిఖీ చేశారని రిపోర్టులు వస్తున్నాయి. సూపర్ టెక్ ప్రమోటర్ అయిన ఆర్‌కె అరోరా 670 మంది గృహ కొనుగోలుదారులను రూ.164 కోట్లు మేర మోసగించారని ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఆయనపై వివిధ పోలీస్‌స్టేషన్లలో 26 ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయి. మదుపరులు, గృహ కొనుగోలుదారుల నుంచి సేకరించిన కోట్లాది రూపాయల నగదును వివిధ డొల్ల కంపెనీలకు తరలించారన్న ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. ఈ కేసులో అరోరాను గడిచిన జూన్‌లో ఇడి అధికారులు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఆయన జుడీషియల్ కస్టడీలో ఉన్నారు. ఈ నేపథ్యంలోనే మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఇది కేసు నమోదు చేసింది. మొత్తం రూ.440 కోట్ల మేర నిధులను నిబంధనలకు విరుద్ధంగా డొల్ల కంపెనీలకు తరలించారని అంచనా. గడిచిన 30 ఏళ్లలో ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో సూపర్‌టెక్ కంపెనీ దాదాపు 80వేల ఇళ్లను నిర్మించింది. ప్రస్తుతం మరో 20 వేల గృహాలకు సంబంధించిన 25 ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తోంది. రెండేళ్ల నుంచి గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటుంది. నోయిడాలో నిబంధనలకు విరుద్ధంగా అభివృద్ధి చేసిన ట్విన్ టవర్స్‌ను సుప్రీంకోర్టు ఆదేశాలతో కూల్చివేయడంతో కంపెనీకి రూ.500 కోట్లు మేర నష్టం రావడంతో పాటు ఇతర సమస్యలను ఎదుర్కొంటుంది. మరోవైపు యూనియన్ బ్యాంక్‌కు రూ.432 కోట్లు ఎగవేసిన కేసులో ఎన్‌సిఎల్‌టిలో దివాలా ప్రక్రియను ఎదుర్కొంటుంది.

ఒక్క రోజులో 4.63 లక్షల మంది విమానయానం

న్యూఢిల్లీ : భారత పౌర విమానయాన రంగం నూతన రికార్డ్‌ను సృష్టించింది. ఇది వరకు ఎప్పుడూ లేని విధంగా గురువారం ఒక్క రోజునే 4,63,417 మంది విమానాల్లో ప్రయాణించారని కేంద్ర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ట్వీట్ చేశారు. 5,998 విమాన సర్వీసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. ఈ ఏడాది నవంబరులో ప్రయాణికుల సంఖ్య రికార్డ్ స్థాయిలో నాలుగు రెట్లు పెరిగిందని వెల్లడించారు.

పేటియంలో బఫెట్ వాటా విక్రయం

- రూ.1,371 కోట్లకు 2.46% వాటా
- షేర్ 3 శాతం పతనం

న్యూఢిల్లీ : ప్రముఖ డిజిటల్ వేదిక పేటియం మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్‌లో ప్రముఖ బిలియనీర్ వారెన్ బఫెట్ తన వాటాలను పూర్తిగా విక్రయించారు. బఫెట్‌కు చెందిన బర్క్‌షైర్ హాత్‌వే కంపెనీ తన 2.46 శాతం వాటాను రూ.1,371 కోట్లకు అమ్మేశారు. ఓపెన్ మార్కెట్‌లో ప్రతీ షేర్‌పై 31 శాతం నష్టంతో విక్రయించారు. 1.56 కోట్ల షేర్లను రూ.620 కోట్లకు వదిలేసుకున్నారు. దీంతో శుక్రవారం బిఎస్‌ఇలో వన్ 97 కమ్యూనికేషన్ షేర్ 3.08 శాతం పతనమై రూ.895 వద్ద ముగిసింది.

కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్
మీ కుటుంబ బ్యాంక్, భారతదేశం అంతటా
Celebrating 100 Years of Trust 1924

అసెట్ రికవరీ మేనేజ్‌మెంట్ బ్రాంచి,
ఫస్ట్ ఫ్లోర్, ప్లాట్ నెం.50, శ్రీనగర్ కాలనీ,
రోడ్డు నెం.3, బంజారాహిల్స్, హైదరాబాద్-500073.

ఫోన్ : 040-23755686/23745686
ఇ-మెయిల్ : hyd.arm@ktkbank.com
వెబ్‌సైట్ : www.karnatakabank.com
CIN : L85110KA1924PLC001128

స్థిరాస్తుల యొక్క అమ్మకపు ప్రకటన

స్థిరాస్తులు అమ్మకానికి 2002 నాటి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు లోని నిబంధన 8(6) అంశాలతో చదువుకొనేలా 2002 నాటి సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం క్రింద ఇవ్వబడిన ఇ-వేలం అమ్మకం ప్రకటన, రుణదాతకు మార్టిగేజి చేసిన / చార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్ అధీకృత అధికారిచే 05.01.2023 మరియు 09.05.2023 తేదీన సింబాలిక్ స్వాధీనం చేసుకోబడిందని, సదరు ఆస్తులను రుణదాతచే ''ఎక్కడ ఉన్నది అక్కడే'' ''ఉన్నది ఉన్నట్లే'' మరియు ''యదాతథం'' ప్రాతిపదికపై తేది.19.12.2023 అమ్మకానికి తెలిపిన తేదీన విక్రయించబడునని ఋణగ్రహీతలు / హామీదారులు / సహపూచీదారులు: (1) మెస్సర్స్ విజయ చంద్రాస్ సీడ్స్, తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న యజమానురాలు: శ్రీమతి యస్‌బి రాణి ప్రభాకర్, చిరునామా: నెం. 5-87-47/4, 6వ లైను, చంద్రమౌళినగర్, గుంటూరు-522003. (2) శ్రీమతి యస్‌బి రాణి ప్రభాకర్, భర్త: శ్రీ ప్రభాకర్‌రావు యస్‌యల్, (3) శ్రీ ప్రభాకర్ రావు యస్ యల్, తండ్రి: శ్రీ యస్.గోపాలరావు, నెం. 2 మరియు 3 చిరునామా: డి.నెం.1-9-4/A, ఫణీంద్ర గ్రాండ్ అపార్ట్‌మెంట్, యస్‌వియన్ కాలనీ, గుజ్జనగుండ్ల, గుంటూరు-522003. (4) శ్రీమతి పుష్పవతి యస్, భర్త: శ్రీ యస్.గోపాలరావు, చిరునామా: ముత్తూరు గ్రామము, వట్టిచెరుకూరు మండలం, గుంటూరు-522003. (5) శ్రీ దుర్గా భవానీ సూధిరెడ్డి, తండ్రి: శ్రీ ప్రభాకర్‌రావు యస్ యల్, చిరునామా: డి.నెం.50-90-64/2, చంద్రమౌళినగర్, గుంటూరు-522003 నుంచి రుణదాత కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్, గుంటూరు బ్రాంచి, [Mobile: 99852 02444] కు i) PSOD A/c No.2557000700085301 క్రింద రూ.3,36,21,646.11 పై॥ (అక్షరాల మూడు కోట్ల ముప్పై ఆరు లక్షల ఇరవై ఒక్క వేల ఆరు వందల నలభై ఆరు రూపాయలు మరియు పదకొండు పైసలు మాత్రమే) + 01.11.2023 నుండి వడ్డీ మరియు ఖర్చులు మొ॥ వాటితో సహా ii) PDPN A/c.No.2557001400058301 క్రింద రూ.26,97,455/- (అక్షరాల ఇరవై ఆరు లక్షల తొంభై ఏడు వేల నాలుగు వందల యాభై ఐదు రూపాయలు మాత్రమే) + 29.10.2023 నుండి వడ్డీ మరియు ఖర్చులు మొ॥ వాటితో సహా వెరశి మొత్తము రూ.3,63,19,101.11 పై॥ (అక్షరాల మూడు కోట్ల అరవై మూడు లక్షల పంతొమ్మిది వేల నూట ఒకటి రూపాయలు మరియు పదకొండు పైసలు మాత్రమే) మొత్తాన్ని వసూలు చేయుటకై సదరు ఆస్తులు విక్రయించబడుచున్నవనీ సాధారణ ప్రజలకు మరియు ముఖ్యంగా రుణగ్రస్తుడు(లు) మరియు గ్యారంటీదారుడు(లు)లకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

స్థిరాస్తుల వివరములు

ఐటమ్ నెం.1 : గుంటూరు, రామచంద్రాపుర అగ్రహారం, బ్లాక్ నెం.27, పట్టా నెం.1053, డి.నెం. 51/2ఎ నందు **శ్రీమతి యస్‌బి రాణి పేరునగల** 401.3/9 చ॥గ॥ విస్తీర్ణము గల రెసిడెన్షియల్ స్థలము ప్లాట్ నెం. 14 & 15 నకు సంబంధించిన యావత్తు. **దీనికి హద్దులు: తూర్పు:** కొత్తమాసు వెంకటేశ్వర్లు యొక్క ప్లాట్ నెం.16 - 45అ॥; **దక్షిణం:** బొద్దులూరి అప్పయ్య యొక్క ప్లాట్ నెం.23 - 80అ॥; **పడమర:** తిరివీధి వెంకటరత్నం యొక్క ప్లాట్ నెం.13 - 45అ॥; **ఉత్తరం:** 20 అ॥ వెడల్పుగల రోడ్డు - 80అ॥. **లొకేషన్: అక్షాంశము మరియు రేఖాంశము: 16.28134709 N & 80.42931942 E.**

రిజర్వుధర: రూ.32,00,000/- (అక్షరాల ముప్పై రెండు లక్షల రూపాయలు)
చెల్లించవలసిన బయానా: రూ.3,20,000/- (అక్షరాల మూడు లక్షల ఇరవై వేల రూపాయలు)

ఐటమ్ నెం.2: గుంటూరు, తురకపాలెం రోడ్డు దగ్గర, నల్లపాడు, డి.నెం.319 నందు **శ్రీమతి యస్‌బి రాణి ప్రభాకర్ పేరునగల** 200.00 చ॥గ॥ విస్తీర్ణము గల ఖాళీస్థలము ప్లాట్ నెం.364 నకు సంబంధించిన యావత్తు. **దీనికి హద్దులు: ఉత్తరం:** ప్లాట్ నెం.363 - 53అ॥; **దక్షిణం:** ప్లాట్ నెం.365 - 53అ॥; **తూర్పు:** 40 అ॥ వెడల్పుగల రోడ్డు - 34'; **పడమర:** ప్లాట్ నెం.353 - 34'.

రిజర్వుధర: రూ.12,00,000/- (అక్షరాల పన్నెండు లక్షల రూపాయలు)
చెల్లించవలసిన బయానా: రూ.1,20,000/- (అక్షరాల ఒక లక్ష ఇరవై వేల రూపాయలు)

ఐటమ్ నెం.3: గుంటూరు, ప్రస్తుతము న్యూ గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ లిమిట్స్, గోరంట్ల, డి.నెం.257/1E, సాయి అర్జున్ II ఫేజ్, జనచైతన్య లేఅవుట్ ప్లాట్స్ నందు **శ్రీ దుర్గా భవాని సూదిరెడ్డి పేరునగల** 480.00 చ॥గ॥ విస్తీర్ణము గల రెసిడెన్షియల్ ఖాళీస్థలము ప్లాట్ నెం.679 నకు సంబంధించిన యావత్తు. **దీనికి హద్దులు: ఉత్తరం:** ప్లాట్ నెం.691 - 54అ॥; **దక్షిణం:** 40 అ॥ వెడల్పుగల రోడ్డు - 54'; **తూర్పు:** ప్లాట్ నెం.680 - 80'; **పడమర:** ప్లాట్ నెం.678 - 80'. **లొకేషన్: అక్షాంశము మరియు రేఖాంశము: 16.35526089 N & 80.46180183 E.**

రిజర్వుధర : రూ.24,00,000/- (అక్షరాల ఇరవైనాలుగు లక్షల రూపాయలు మాత్రమే)
చెల్లించవలసిన బయానా : రూ.2,40,000/- (అక్షరాల రెండు లక్షల నలభై వేల రూపాయలు మాత్రమే)

ఐటమ్ నెం.4: గుంటూరు, రామచంద్రాపుర అగ్రహారం, ఆర్.యస్.డి.నెం.51/2ఎ, పాత డి.నెం. 9/2, సమీప డోర్ నెం.25-18-115 నందు **శ్రీ దుర్గా భవాని సూదిరెడ్డి పేరునగల** 276.22 చ॥గ॥ విస్తీర్ణము గల రెసిడెన్షియల్ ఖాళీస్థలము ప్లాట్ నెం.5 నకు సంబంధించిన యావత్తు. **దీనికి హద్దులు: తూర్పు:** పొనుగంటి గోపాల స్వామి యొక్క ప్లాట్ నెం.6 - 65'; **దక్షిణం:** రోడ్డు 38'3''; **పడమర:** ఉల్లి సాంబ్రాజ్యమ్మ యొక్క ప్లాట్ నెం.4 - 65' మరియు **ఉత్తరం:** చిమటా వీరభద్రరావు మరియు శనక్కాయల రామానుజమ్మ నుండి ఇతరులకు అమ్మిన ప్లాట్ 38'3''. **లొకేషన్: అక్షాంశము మరియు రేఖాంశము: 16.28275627 N & 80.43155436 E.**

రిజర్వుధర: రూ.27,50,000/- (అక్షరాల ఇరవై ఏడు లక్షల యాభై వేల రూపాయలు)
చెల్లించవలసిన బయానా: రూ.2,75,000/- (అక్షరాల రెండు లక్షల డెబ్బై ఐదు వేల రూపాయలు)

(సెక్షన్ 13 సబ్ సెక్షన్ (8) చట్టం ప్రకారము ఋణగ్రహీతలు / తనఖాదారులు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరు.) (సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ (8) సబ్ రూల్ (6) క్రింద దీనిని నోటీసుగా కూడా పరిగణించబడుతుంది) అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు **కర్ణాటక బ్యాంక్** యొక్క వెబ్‌సైట్ అనగా **www.karnatakabank.com** లో **"mortgaged assets for sale"** హెడ్ క్రింద సందర్శించండి.

ఇ-వేలము 19.12.2023 తేదీన ఉ॥ 11.00 గం॥ నుండి ఉ॥ గం॥ 11.20 ని॥ల వరకు https://bankauctions.in/ పోర్టల్ ద్వారా 5 నిమిషాల అపరిమిత పొడిగింపుతో నిర్వహించబడును. ఉద్దేశించిన బిడ్డర్ తమ పేరును **https://bankauctions.in/** నందు నమోదు చేసుకొని, యూజర్ ఐడి మరియు పాస్‌వర్డ్‌ను ఉచితంగా పొందండి మరియు ఇ-వేలంపై శిక్షణను **(తాత్కాలికంగా 18.12.2023న)** ఆన్‌లైన్ ద్వారా **M/s.4closure,** 605ఎ, HMDA మైత్రీవనం, అమీర్‌పేట, హైదరాబాద్, తెలంగాణ-500038, సంప్రదించవలసిన నెం: **040-23736405, Mobile: 8142000062/63/64/66, Email: prakash@bankauctions.in and info@bankauctions.in** నుండి పొందవచ్చును.

తేది: 21-11-2023, ప్రదేశం: హైదరాబాద్ — **సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్**

కృష్ణా డెల్టాలో వరి దిగుబడి భారీగా తగ్గుదల!

- ప్రారంభమైన పంట కోత ప్రయోగాలు
- ఫసల్ బీమాపై రైతుల ఆశలు

గుంటూరు జిల్లా కాకుమాను మండలం బికె పాలెంలో పంటకోత ప్రయోగాలు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

కృష్ణా పశ్చిమ డెల్టాలో జులైలో వరి పంట సాగు చేసిన ప్రాంతాల్లోని కొన్ని గ్రామాల్లో ప్రస్తుతం కోతలు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది వరి దిగుబడులు గణనీయంగా తగ్గే సూచనలు కన్పిస్తున్నాయి. ప్రస్తుతం వ్యవసాయ, అర్థగణాంక, ప్రణాళిక శాఖల అధికారులు పంట కోత ప్రయోగాలు నిర్వహిస్తున్నారు. ఎకరం విస్తీర్ణంలో 25 మీటర్ల విస్తీర్ణంలో మార్కింగ్ చేసి పంటను కోసి నూర్చి అక్కక్కడికక్కడే తూకం వేసి పచ్చి ధాన్యం దిగుబడి అంచనాలను రూపొందిస్తున్నారు. రైతుల సర్వే నంబర్ల ఆధారంగా డెల్టాలోని అన్ని మండలాల్లో ఈ ప్రయోగాలు నిర్వహించనున్నారు. వ్యవసాయ శాఖాధికారి, అర్థగణాంక శాఖాధికారి, స్థానిక వ్యవసాయ శాఖ సిబ్బందితోపాటు బీమా కంపెనీ ప్రతినిధి అభిషేక్ కూడా పాల్గొంటున్నారు. జిల్లాకు ఫసల్ బీమా పథకం బీమా చెల్లించేందుకు హెచ్‌డిఎఫ్‌సి బీమా కంపెనీని ఏజెన్సీగా ఎంపిక చేశారు. ఈ కంపెనీ ప్రతినిధులు కూడా పంటకోత ప్రయోగాలకు హాజరవుతున్నారు. ఈ ఏడాది వర్షాభావం వల్ల వరి దిగుబడి తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కొన్ని మండలాల్లో 30 నుంచి 35 బస్తాల వరకు వస్తుండగా, మరికొన్ని మండలాల్లో 20 నుంచి 25 బస్తాలు మాత్రమే వస్తుందని చెబుతున్నారు. కొల్లిపర మండలంలో 35 బస్తాల వరకు దిగుబడి రాగా, పొన్నూరు మండలంలో 25 బస్తాలే దిగుబడి వచ్చినట్టు అంచనా. వాతావరణం అనుకూలిస్తే 40 బస్తాల వరకూ దిగుబడి వచ్చే అవకాశం ఉందని, ఈ ఏడాది ఆ పరిస్థితి లేదని రైతులు చెప్తున్నారు. కాలువ చివరి భూములకు నీరందకపోవడం, అక్టోబర్ మొత్తం వర్షం లేకపోవడం, చాలా మండలాల్లో వరి పైరు బెట్టకు రావడంతో కృష్ణా డెల్టాలో వరి దిగుబడుల్లో తగ్గుదల కన్పిస్తోంది. అక్టోబర్‌లో 21 రోజులపాటు వేడిగాలులు వీచినట్టు వాతావరణ శాఖ నిర్ధారించింది. అయినా, డెల్టా ప్రాంతంలో ఒక్క మండలాన్ని కూడా ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించలేదు. రైతులకు ఫసల్ బీమా సదుపాయం దక్కాలంటే దిగుబడి కనీసం 50 శాతం తగ్గాలని, దిగుబడి బాగా ఉంటే బీమా సదుపాయం రాదని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. గ్రామం యూనిట్‌గా దిగుబడి అంచనాలను రూపొందిస్తున్నారు. ఒక గ్రామం పరిధిలో 250 ఎకరాల్లో పంట సాగయితే దీనిని ఒక గ్రామంగా పరిగణిస్తారు. అంతకంటే తక్కువ విస్తీర్ణంలో సాగైతే పక్క గ్రామాలను కలిపి గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుంటారు. ఈ ఏడాది వచ్చే సాధారణ దిగుబడితోపాటు గత మూడేళ్ల కాలంలో వచ్చిన సగటు దిగుబడి ఆధారంగా ఈ ఏడాది బీమా ఇవ్వాలా? వద్దా? అనేది నిర్ధారిస్తారని చెప్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది వరి దిగుబడి తగ్గుదలపై అర్థగణాంక శాఖ, వ్యవసాయ శాఖలు రూపొందించే నివేదికలు కీలకం కానున్నాయి. గత వారం రోజులుగా అడపాదడపా వర్షాలు కురుస్తుండడం, అల్పపీడనాల ప్రభావంతో రైతులు కోతలపై ఆచితూచి అడుగులు వేస్తున్నారు. వరి కోతలకు అనువైన వాతావరణం కోసం ప్రస్తుతం ఎదురుచూస్తున్నారు.

సంపాదకీయం

జన భోజనాలు

'బ్రతుకునిచ్చు ప్రకృతి మాతకు చేసే వందనం/ భేద భావములు నెరగని మానవీయ సంగమం/ మన సంస్కృతి ఘన ప్రతీక సమ్మేళనం/ ఇది తెలిసిన నాడే నిజమైన విందు భోజనం/ రమ్మని వన భోజనం కమ్మని వన భోజనం' అంటారు కవయిత్రి బి.సుజాత. కార్తీకం అంటే వెన్నెల నెల. ఏటా కార్తీక మాసం మధ్య నుంచి చివరి వారం వరకు వన భోజనాల సందడి కొనసాగుతుంది. 'వేడివేడి అన్నం మీద కమ్మని పప్పు కాచిన నెయ్యి/ పప్పూ దప్పళం కలిపి కొట్టడం/ భోజనం వన భోజనం/ వన భోజనం జన రంజనం.../ తల్లితోడు పిల్లామేకా ఆలూమగలు అత్తాకోడలు బాసూబంటూ ఒకటేనంటూ కలవడం/ భోజనం వన భోజనం' అంటారు ఆరుద్ర. బంధు మిత్రులతో సమయం గడుపుతూ... ఆనందంగా, ఆహ్లాదకరంగా సాగే వనభోజనాలు మంచి ఆటవిడుపు. బంధువులు, స్నేహితులతో కలిసి చెట్ల నీడలో భోజనం చేయటాన్ని వన భోజనం అంటారు. ఇది ప్రకృతితో మనిషికి వున్న బంధాన్ని గుర్తుచేసుకునే రోజు. 'వనం' అనే పదానికి 'అరణ్యాన్ని ప్రేమించడమ'ని అమరకోశం చెబుతుంది. 'దీపావళి వెళితే కార్తీక మాసం వస్తుందని, అంటే శరదృతువు ద్వితీయార్ధంలో వుంటామని, కార్తీకంలో వెన్నెల బావుంటుందని చెబుతూ, వెన్నెల మానవ సంబంధాలను మెరుగుపరుస్తుంది' అని ప్రముఖ రచయిత శ్రీరమణ పేర్కొన్నారు.

ఇది స్పీడ్ యుగం. పక్కవారి గురించి పట్టించుకునే తీరిక కూడా లేని తనం మనిషిని ఒంటరి చేస్తున్నది. ఆ ఒంటరితనం నుంచి, ఒత్తిళ్లతో కూడిన జీవనపోరాటం నుంచి బయటపడి, కూసింత సేదతీరేందుకు ఈ వన భోజనాలు చక్కని వేదికలవుతాయి. అంతేకాదు, బయట గడిపేందుకు ఈ కార్తీక మాసపు రోజుల్లో వాతావరణం అనువుగా ఉంటుంది. చెట్లన్నీ పచ్చగా కళకళలాడుతుంటాయి. అలాంటి ఆహ్లాదకరమైన వాతావరణంలో, చెట్ల నుంచి వచ్చే స్వచ్ఛమైన గాలిని పీల్చుకుంటూ ఆరుబయట అందరూ కలిసి వంటలు వండుకోవడం, చిన్నా పెద్ద తేడా లేకుండా కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు చేయడం ఒక అద్భుతమైన అనుభూతి. అందుకే కార్తీకం రాగానే వన భోజనాలు చేయాలని అందరం సరదా పడుతుంటాం. అయితే... ఉసిరి చెట్టు వంటి ఔషధ గుణాలున్న వనంలో వన భోజనాలు చేయడం ఆరోగ్యకరం అంటారు పెద్దలు. వన భోజనాలంటే సంప్రదాయం ఒక్కటే కాదు... అందులో సామాజిక కోణమూ వుంది. అంతస్తుల తారతమ్యాలు, కుల, మత బేధాలు లేని స్నేహం, సమైక్యతా భావం ఈ భోజనాల్లో వెల్లివిరుస్తుంది. 'శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనే లేద'న్న మహాకవి మాటల స్ఫూర్తి అందరూ కలిసి పనిచేయడంలో కనబడుతుంది. కుల మతాలకతీతంగా బంధుమిత్రులతో కలిసి ఆహ్లాదకరంగా జరుపుకోవాల్సిన వన భోజనాలను కొందరు కుల భోజనాలు, ఎన్నికల భోజనాలుగా మార్చేస్తున్నారు. ఈ సంస్కృతి పల్నాటి బ్రహ్మనాయుడు, పుచ్చలపల్లి సుందరయ్య వంటి వారు చూపిన సహపంక్తి భోజన స్ఫూర్తిని మంటగలుపుతోంది. కార్తీక వన సమారాధనలు కాస్తా కుల సమారాధనలుగా, రాజకీయ ప్రచార వేదికలుగా మారుతున్నాయి.

అన్నానికి, ఆకలికి కులం ఉండదని అంటారు. కానీ... ఫ్లెక్సీలు కట్టి మరీ కులాలవారీగా ఈ వన భోజనాల తంతు నిర్వహిస్తున్నారు. చక్కని వాతావరణంలో అందరూ కలిసి భోజనం చేయడం, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా యాంత్రికతను వదిలించుకొని ఉత్తేజాన్ని పొందాలే తప్ప...కులం పేరుతోనో, మతం పేరుతోనో సమీకరణలు మంచిదికాదు. సమైక్యతా భావం, సామాజిక స్పృహ ఈ సహపంక్తి భోజనాల్లో వెల్లివిరియాలి. కులంతో పనిలేకుండా ప్రకృతిని, పర్యావరణాన్ని రక్షించే క్రమంలో వన భోజనాలు జన భోజనాలుగా జరగాలి. వాస్తవానికి వన భోజనాలు ప్రకృతి ఆరాధన కోసం ఏర్పడ్డాయి. ప్రకృతి మనకు అన్నీ ఇస్తుంది కనుకనే 'వృక్షో రక్షతి రక్షిత:' అంటారు. బహుశా ఈ నేపథ్యంలోనే వనభోజన సంస్కృతి ఏర్పడివుండొచ్చు. 'కనిపించని చేతులతో హత్తుకుని/ మనిషికి మరింత దగ్గరవుతుంది చెట్టు/ చెట్టుపై మమకారం పెంచుకుంటాడు మనిషి/ మనుషుల గుండె చప్పుడుని/ వనమంతా చెవులు రిక్కించి వింటూ/ తన ప్రతిస్పందనను/ పున్నాగపూల వర్షంలా/ మనుషులపై చిలుకరిస్తుంద'ని చెబుతారో కవి. ఇంత చక్కటి ఆహ్లాదకరమైన కార్తీకమాసంలో జరిగే వన భోజనాలను కుల భోజనాలుగా మార్చకుండా... ప్రకృతిని, పర్యావరణాన్ని సంరక్షించుకునే జన భోజనాలు కావాలి!

మహనీయుల మాట

ప్రతి వ్యక్తికి విద్యా హక్కు ఉంది. దీని ద్వారా తను అభివృద్ధి చెందడమే కాక తన జీవితాన్ని జీవించడానికి వీలు కల్పిస్తుంది.

- ఎ.పి.జె. అబ్దుల్ కలామ్,
భారత పూర్వ రాష్ట్రపతి.

తెలంగాణ సమరంలో సంకేతాలు, సందేహాలు

ప్రస్తుతం

తెలకపల్లి రవి

తెలంగాణతో సహా అయిదు రాష్ట్రాలలో పోలింగ్ ఈ నెలాఖరుతో ముగియనుంది. కొన్ని రాష్ట్రాలలో పోలింగ్ కూడా ముగిసిపోగా మిగిలిన చోట్ల ప్రచారం 28తో పూర్తయి నవంబరు 30న ఓటేయడానికి ప్రజలు సంసిద్ధులవుతున్నారు. ఈ రెండు రోజుల్లోనూ ప్రధానంగా తెలంగాణలో అన్ని పార్టీల అగ్రనాయకులూ పర్యటించనుండటంతో ప్రచారం తారాస్థాయికి చేరుతుంది. క్రమేణా రూపు మారుతున్న ప్రచార పద్ధతులూ, మీడియా సోషల్ మీడియా సాధనాలు, నాయకుల పర్యటనలూ అన్నీ హోరెత్తాయి. ప్రజల తీర్పు ఎలా వుంటుందనే దానిపై అనేక రకాల సర్వేలు వెలువడ్డాయి గానీ ఇవేవీ ప్రభంజనం వస్తుందని చెప్పలేదు. పాలక పార్టీ బిఆర్ఎస్ గెలుస్తుందని ఎక్కువ సర్వేలు చెప్పగా కాంగ్రెస్ తప్పక విజయం సాధిస్తుందని రెండు మూడు సర్వేలు చెప్పాయి. ఎన్నికల తేదీ దగ్గరైన కొద్దీ బిఆర్ఎస్ అనుకూల సర్వేలు జోరందుకున్నాయి. టీవీ చర్చలలోనూ, కార్యక్రమాలలోనూ మొత్తంపైన సర్వేలను తోసిపారేయడమే గాక ఇవన్నీ 'స్పాన్సర్డ్' అనే రీతిలో ఎదురుదాడి చేస్తున్నారు. కానీ పార్టీలుగా మాత్రం అనుకున్న వాళ్లను రంగంలోకి దింపి రోజుకు రోజు ప్రజాభిప్రాయాన్ని అంచనా వేసే ప్రయత్నాలు ఆపింది లేదు. బిఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యనే ప్రధాన పోటీ అనేదానిపై ఏకాభిప్రాయం వున్నా తేడా మాత్రం పెరిగిపోతున్న స్థితి. కాంగ్రెస్ ప్రభంజనం నెలకొందన్న కథనాలతో అతి విశ్వాసం పెంచుకున్న ఆ పార్టీ ఇప్పటికీ అంతే నమ్మకంతో వుందా అనేది సందేహమే. ప్రచార పరంగా బిఆర్ఎస్‌కు కెసిఆర్, కెటిఆర్, హరీశ్‌లు ముగ్గురు మూడు కోణాలలో ప్రచారం చేస్తుంటే కాంగ్రెస్ ప్రచార భారం పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాత్రమే మోయవలసి వచ్చింది. సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క మాత్రమే కొంత తోడు నిలిచారు. ముఖ్యమంత్రి ఎవరనే జాబితాలో ఈ ఇద్దరి పేర్లే ముందుండడం కూడా వాస్తవం. మిగిలిన జానారెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటి రెడ్డి వంటి వారెవరూ రాష్ట్ర వ్యాపితంగా పర్యటించడానికి సిద్ధం కాలేకపోయారు. వారి కుటుంబ సభ్యుల సీట్లలోనే దిగబడిపోయారు. నల్గొండ జిల్లా వంటి చోటికి రేవంత్ రావడాన్ని స్వాగతించింది కూడా లేదు. కెసిఆర్ సహా బిఆర్ఎస్ నాయకులు కూడా రేవంత్‌పైనే అస్త్రాలు సంధించారు. కాంగ్రెస్ కర్ణాటక తరహా వాగ్దానాలతో ఆకట్టుకోవడానికి ప్రయత్నిస్తే బిఆర్ఎస్ ఉన్న పథకాల పెంపుతో పాటు కొన్ని కొత్త వాగ్దానాలు ప్రకటించింది. తెలంగాణ సాధన, అభివృద్ధి, మరీ ముఖ్యంగా హైదరాబాద్ నవీకరణ తమ వల్లనే జరిగిందని కాంగ్రెస్ వస్తే ఇదంతా కొట్టుకుపోతుందని బిఆర్ఎస్ ప్రధాన పల్లవిగా వుంది. 30 మందికి పైగా పాత ఎమ్మెల్యేలను మార్చాలని అనేక సూచనలు వచ్చినా కేవలం పది మందిని మాత్రమే కొత్తవాళ్లను తీసుకున్న కెసిఆర్ నిర్ణయం ప్రభావం ఎన్నికల తర్వాత గాని తెలియదు. కొత్తగా టికెట్టివ్వడానికి అవకాశం లేకున్నా బిఆర్ఎస్ పొన్నాల లక్ష్మయ్య, నాగం జనార్ధనరెడ్డి వంటి వారిని ఆఖరి క్షణంలో చేర్చుకుంది. విజయశాంతి వంటి వారి కాంగ్రెస్ ప్రవేశం కూడా అలాంటిదే. విధానపరమైన నిబద్ధత, రాజకీయ విలువలు లేకపోవడం వల్ల ఎన్నికల పోరాటం కాస్త పదవుల కోసం ఆరాటంగానే తయారైంది.

> **2004 ఎన్నికలు విద్యుత్ ఉద్యమంలో వై.ఎస్. రాజశేఖరరెడ్డి వామపక్షాలతో కలసి పోరాడిన నేపథ్యం. అదే కేంద్రంలో యుపిఎ రావడానికి దోహదం చేసింది. ఈ వాస్తవాలను విస్మరించిన కాంగ్రెస్ ఒంటెత్తు పోకడ ఎలాంటి ఫలితాలకు దారితీసేది చూడవలసిందే. అలాగే తెలంగాణ సెంటిమెంటు, తమ సంక్షేమ పథకాలు, హైదరాబాద్ అభివృద్ధి, దిగుబడి పెరుగుదల వంటి వాటితో పాటు ప్రజలు సారు కారునే విశ్వసిస్తారన్న బిఆర్ఎస్ ఆఖరి ఆశలు ఫలిస్తాయా? బిజెపి పేరాశలను, పథకాలను ప్రజలు ఇప్పటికే విఫలం చేసినప్పటికీ ఎవరికీ మెజార్టీ రాని పరిస్థితే వస్తే ఏదో రూపంలో బిజెపి పట్టు బిగుస్తుందా అనేది కూడా ఫలితాలతో తేలాలి. ఇప్పటి వరకూ తెలుగు ప్రజలు అనిశ్చిత తీర్పులు ఇచ్చిన దాఖలాలు లేవు. మరి ఆ వరవడే 2023 లోనూ పునరావృతమవుతుందా?**

క్రమేణా మారిన దృశ్యం

బిజెపి మతోన్మాద రాజకీయాలకు వ్యతిరేకంగా జరిగే జాతీయ పోరాటంలో బిఆర్ఎస్ ఒక కీలక భాగస్వామి అవుతుందనే నమ్మకం మునుగోడు ఎన్నిక కలిగించింది. ఆ సమయంలోనే ఆపరేషన్ ఫాంహౌస్, లిక్కర్ స్కాం కేసు వంటివి రంగం మీదకు వచ్చాయి. బిజెపి నేతలు ముఖ్యమంత్రి కెసిఆర్ కుటుంబంపైనా తీవ్ర స్థాయిలో దాడి చేశారు. రకరకాల కథనాల మధ్య ఈ వాతావరణం మారిపోయింది. కెసిఆర్‌తో సహా ఆ పార్టీ నేతలు ఇండియా, బిజెపిల మధ్య సమ దూరం సిద్ధాంతం తీసుకున్నారు. కాంగ్రెస్ మా ప్రధాన ప్రత్యర్థి గనక దానిపై కేంద్రీకరిస్తున్నామని చెప్పినా మోడీపై విమర్శ తగ్గించడం వాస్తవం. అయితే ఎన్నికల ప్రచారం చివరి దశలో మాత్రం దీన్ని కొంత సరిదిద్దుకుని తామెప్పుడూ లౌకిక పార్టీగానే వుంటామని కెసిఆర్, కెటిఆర్ ప్రత్యేకంగా ప్రకటించడం మొదలుపెట్టారు. చంద్రబాబు నాయుడు అరెస్టు తర్వాత ఆ మూలాలున్న వారి ఓట్ల ప్రభావం, కులపరమైన లెక్కలు నడిచినా ఆయనకు బెయిల్ రావడంతో అది తగ్గింది. ఉద్యోగాల భర్తీలో వెనకబాటే తమపై కొంత అసంతృప్తికి కారణమైందని బహిరంగంగానే వ్యాఖ్యానించిన కెటిఆర్ ఉద్యోగార్థులతో సహా వివిధ తరగతుల వారిని మోడీ తరహాలో ఇంటర్వ్యూలు చేస్తూ దగ్గర చేసుకోవడానికి ప్రయత్నించారు. నిజానికి కెసిఆర్ గ్రామాలలో సభలు పెడుతుంటే కెటిఆర్ ఆ సభలతోపాటు నగర వాసులతో చానళ్లు, సోషల్ మీడియా ద్వారా దగ్గరయ్యే ప్రయత్నం పెంచారు. మోడీ, అమిత్‌షాతో సహా బిజెపి నేతలు మాత్రం పాలక పార్టీపై దాడి కొనసాగించారు. మతతత్వ వ్యాఖ్యలు చేశారు. ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామంటూ విద్వేషం రెచ్చగొట్టారు. కెసిఆర్‌ను అరెస్టు చేస్తామని బెదిరిస్తూనే వున్నారు. ఏమైనా వారి టార్గెట్ కాంగ్రెస్ అనేది స్పష్టం. హంగ్ వస్తుందని, అప్పుడు తాము బిఆర్ఎస్‌ను లోబర్చుకుని చక్రం తిప్పాలనీ ఆశపడుతున్నారు. వారి ఎత్తుగడలు ఏమైనా అసలు కాంగ్రెస్ శిబిరంలోనే ఐక్యత లేకపోవడం, అనేక మంది ముఖ్యమంత్రులు ముందుకు రావడం షరామామూలుగా సాగుతున్నది. మజ్లిస్ నేత ఒవైసీ బిఆర్ఎస్‌కే తమ మద్దతు వుంటుందని గట్టిగా ప్రకటించడమే గాక కాంగ్రెస్‌పై దాడి ఎక్కుపెట్టారు.

పేలవంగా జనసేన విన్యాసాలు

ఎ.పి లో టిడిపి నేస్తమైన పవన్ కళ్యాణ్ జనసేన బిజెపితో కలసి ఎనిమిది స్థానాల్లో పోటీ చేస్తూ డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని, మోడీ మూడోసారి ప్రధాని కావాలని భక్తి చాటుకుంటున్నారు. అయితే ప్రచారం కూడా చేయకపోగా మొక్కుబడి పోటీతో జనసేన ఇక్కడ పలచనవడమే గాక ఎ.పి లోనూ నష్టపోతుందనే మాట అందరి నోటా వస్తోంది. రిజర్వేషన్ వర్గీకరణ పేరిట మందకృష్ణ మోడీని దళితోద్ధారకుడిలా కీర్తించడం కూడా విమర్శకు గురైంది. బిజెపి తెలుగు రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలను తన చుట్టూ తిప్పుకోవడం కనిపిస్తుండగా కాంగ్రెస్ ఆ విధమైన వైఖరి తీసుకోవడంలో విఫలమైంది.

షర్మిల వైఎస్ఆర్‌టిపి, ప్రొఫెసర్ కోదండరామ్ టిజెఎస్‌లను కూడా పోటీకి దూరంగా వుంచింది. సిపిఐ కి ఒక్క స్థానం మాత్రం ఇచ్చి పొత్తు పెట్టుకుంది. బిఆర్ఎస్‌గా పేరు మార్చుకుని జాతీయ పాత్ర నిర్వహిస్తామని హడావుడి చేసిన కెసిఆర్ తెలంగాణలో గెలవడం కోసం ప్రాంతీయ పార్టీగా పరిమితం చేసుకోవడం గమనార్హం. కాంగ్రెస్‌ది కేవలం కల్పితమైన హైప్ మాత్రమేననీ తాము పూర్తి ఆధిక్యతతో గెలుస్తామని చెబుతున్న బిఆర్ఎస్ హంగ్ వస్తే బిజెపి మద్దతు తీసుకునేది లేదని మాత్రం చెప్పడం లేదు. మరో వంక కాంగ్రెస్‌లో కలిసిన మాజీ బిజెపి నేతలేమో తమ నాయకులు కెసిఆర్‌తో రాజీ పడినందుకే తాము బయిటకొచ్చామని ప్రకటిస్తున్నారు.

సిపిఎం కీలక ప్రభావం

బిజెపిని ఓడించడానికి, బిఆర్ఎస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడటానికి 19 స్థానాల్లో స్వంతంగా రంగంలోకి దిగిన సిపిఎం పోటీలు ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో ఫలితాలను కీలకంగా ప్రభావితం చేస్తాయి. మూడు శిబిరాల మధ్య స్వతంత్ర పాత్ర కాపాడుకుంటూ ఆత్మగౌరవం విధాన స్పష్టతతో ముందుకు పోవడం సిపిఐ పోటీ చేసే కొత్తగూడెంలో వారికే మద్దతునిస్తామని కూడా సిపిఎం చెప్పడం లౌకిక శక్తుల, వామపక్ష వాదుల మన్నన పొందుతున్నది. కాగా ఇదేదో బిఆర్ఎస్ కోసం చేస్తున్నట్టు వచ్చిన ఒక వర్గం మీడియా చేసిన ప్రచారాన్ని సిపిఎం గట్టిగానే ఖండించింది. ఈ పరిస్థితికి కారణమైన బిఆర్ఎస్, కాంగ్రెస్‌లు ఆయా చోట్ల ఓట్ల చీలిక పర్యవసానాలకు మూల్యం చెల్లించవలసి వుంటుంది. బిఎస్‌పి కూడా రంగంలో వుంది. కొల్లాపూర్‌లో బర్రెలక్క పోటీ మరో ప్రత్యేకతగా వుంది. వీటన్నిటిపై ఓటర్లు ఎలా స్పందిస్తారో డిసెంబర్ మూడున కానీ తేలదు.

ఒంటెత్తు పోకడల మూల్యం?

కెసిఆర్ ప్రభుత్వంపై అనేక విమర్శలు, తప్పొప్పులు వున్నా ఆయనను గద్దె దించాలనీ, కాంగ్రెస్‌కు అవకాశమివ్వాలని ప్రజలు దృఢ నిర్ణయంతో వున్నారా అనేదానిపై రెండు రకాల వాదనలు కొనసాగుతూనే వున్నాయి. నిజానికి 1983లో ఎన్టీఆర్ టిడిపి స్థాపించిన తర్వాత ఇప్పటివరకూ ఉమ్మడిగా, విడిగా తొమ్మిది ఎన్నికలు జరిగితే అందులో మూడు సార్లు మాత్రమే కాంగ్రెస్ గెలిచింది. 2004 ఎన్నికలు విద్యుత్ ఉద్యమంలో వై.ఎస్. రాజశేఖరరెడ్డి వామపక్షాలతో కలిసి పోరాడిన నేపథ్యం. అదే కేంద్రంలో యుపిఎ రావడానికి దోహదం చేసింది. ఈ వాస్తవాలను విస్మరించిన కాంగ్రెస్ ఒంటెత్తు పోకడ ఎలాంటి ఫలితాలకు దారితీసేది చూడవలసిందే. అలాగే తెలంగాణ సెంటిమెంటు, తమ సంక్షేమ పథకాలు, హైదరాబాద్ అభివృద్ధి, దిగుబడి పెరుగుదల వంటి వాటితో పాటు ప్రజలు సారు కారునే విశ్వసిస్తారన్న బిఆర్ఎస్ ఆఖరి ఆశలు ఫలిస్తాయా? బిజెపి పేరాశలను, పథకాలను ప్రజలు ఇప్పటికే విఫలం చేసినప్పటికీ ఎవరికీ మెజార్టీ రాని పరిస్థితే వస్తే ఏదో రూపంలో బిజెపి పట్టు బిగుస్తుందా అనేది కూడా ఫలితాలతో తేలాలి. ఇప్పటి వరకూ తెలుగు ప్రజలు అనిశ్చిత తీర్పులు ఇచ్చిన దాఖలాలు లేవు. మరి ఆ వరవడే 2023లోనూ పునరావృతమవుతుందా?

★

ప్రత్యేక సహాయంతోనే కరువు రైతుకు భరోసా

విశ్లేషణ

కె.ఎస్.వి. ప్రసాద్

> **దేశం మొత్తమ్మీద సాగు ఖర్చులను బేరీజు వేసుకొని కేంద్రం విపత్తు పరిహారం నిర్ణయిస్తుంటుంది. శాస్త్రీయత లేదు. రైతు సంక్షేమం దృష్టి అస్సలే లేదు. కేంద్రంపై ఒత్తిడి తెస్తూనే, ఉన్నంతలో రాష్ట్రాలు ఎంతో కొంత పరిహారం పెంచడం కనీస బాధ్యత. విభజన తర్వాత మన రాష్ట్రం వ్యవసాయ ప్రధాన రాష్ట్రమైంది. కాబట్టి రైతులను ఆదుకోవాల్సిన ధర్మాన్ని రాష్ట్ర ప్రభుత్వం పాటించాలి.**

ఈ ఏడాది ఖరీఫ్‌లో తీవ్ర కరువొచ్చింది. ఎల్‌నినో వల్లనైతేనేమి నైరుతి రుతుపవనాల వైఫల్యం అయితేనేమి పంటల సేద్యానికి అనుగుణంగా అదనుకు సరైన వర్షాలు పడలేదు. నెల, అంతకంటే ఎక్కువ రోజులు చినుకు జాడ లేక తీవ్రాతి తీవ్ర డ్రైస్పెల్స్ చాలా ప్రదేశాల్లో నెలకొన్నాయి. ఫలితంగా సీజన్ సాధారణ సాగు విస్తీర్ణంలో దాదాపు 30 లక్షల ఎకరాలు సాగు లేక బీడు పడ్డాయి. ఇవి ప్రభుత్వ ఉజ్జాయింపు లెక్కలు. రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్రతో పాటు రాష్ట్రంలోని ఇతర మెట్ట ప్రాంతాల్లో చాలా చోట్ల వేసిన పైర్లు పూర్తిగా తుడిచిపెట్టుకుపోగా, మరికొన్ని చోట్ల ఎండు దశకొచ్చి మిణుకుమిణుకు మంటున్నాయి. పంటలను కాపాడుకునేందుకు రైతులు ట్యాంకర్ల ద్వారా, ఆయిల్ ఇంజన్లతో అధిక వ్యయ ప్రయాశలకోర్చి భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. వేల రూపాయల పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు చేతికి రావని తెలిసి బాధను దిగమింగి ట్రాక్టర్లతో దున్నేస్తున్న హృదయవిదారక సన్నివేశాలు దర్శనమిస్తున్నాయి. ప్రాజెక్టులలో నీరు లేక వారబందీపై వదులుతున్న కొద్దిపాటి నీరు పంటలను నిలపలేకపోతున్నాయి. చివరి భూములకు మొత్తానికే నీరు అందని దుస్థితి. ఇంతటి దారుణ విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్న రైతాంగం తమను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నారు. రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నారు. రైతుపక్షపాతిగా చెప్పుకుంటున్న ప్రభుత్వం ప్రజలకు అన్నం పెట్టే అన్నదాతల విషయంలో కాఠిన్యంగా ఉంది. రాష్ట్రమంతటా దుర్భిక్షం తాండవిస్తున్నా కేవలం 103 కరువు మండలాలను ప్రకటించి ఇక అంతేనని భీష్మించుక్కూర్చుంది.

ప్రకటించిన కరువు మండలాలలోనైనా రైతులకు ఏ మేరకు పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ) వస్తుందో ప్రభుత్వ నిబంధనలు చూస్తే నివ్వెరపోవాల్సిందే. కరువు బారిన పడి పంటలు నష్టపోయిన రైతన్నలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలిచ్చే పరిహారం పిసరంత కూడా లేదు. దానికే రైతులను ఆదుకుంటున్నామని గొప్పలకు పోతున్నాయి. విపత్తుల బారిన పడ్డ రైతులకు ఇచ్చే ఇన్‌పుట్ సబ్సిడీ స్కేల్ ఆఫ్ అసిస్టెన్స్‌ను ఎప్పుడో 2015లో కేంద్రం నిర్ణయించింది. ఆ కొలబద్దలు 2020 వరకు కొనసాగుతాయంది. ఆ గడువు ముగిసినా స్కేల్ ఆఫ్ అసిస్టెన్స్‌ను మూడేళ్లపాటు సవరించలేదు. ఈ సంవత్సరమే నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ (ఎన్‌డిఆర్ఎఫ్) నిబంధనలను సవరించి, వాటిని అమలు చేయాలని రాష్ట్రానికి లేఖ పంపింది. కేంద్రం నిర్ణయించిన సహాయం చూస్తే విస్తుపోవాల్సిందే. ప్రధాన వ్యవసాయ పంటలు 33 శాతానికి మించి నష్టపోయిన పక్షంలో, వర్షాధారంపై సాగు చేసే పంటలకు ఎకరానికి రూ.3,400 నిర్ణయించారు. అదే సాగునీటి వసతి గ్యారంటీ ఉన్న ఏరియాల్లో రూ.6,800 చేశారు. 2015లో వర్షాధారమైతే రూ.2,720, కాల్వల కింద రూ.5,400. ఎనిమిదేళ్లలో కేంద్రం పెంచింది రూ.680, రూ.1,400. ఇదిలా ఉండగా మన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం నిర్ణయించిన స్కేల్ ఆఫ్ అసిస్టెన్స్‌ను ఆమోదిస్తూ 2023 నవంబర్ 14న జిఒఎంఎస్ నెం.5 జారీ చేసింది. ఈ జిఒ సరిగ్గా కరువుతో ఖరీఫ్ పంటలు నష్టపోయి ప్రభుత్వ సహాయం కోసం రైతులు ఎదురు చూస్తున్న సమయంలో వచ్చింది. రైతులకు కనీసం ఎకరాకు రూ.యాభై వేలివ్వాలని రైతులు, రైతు సంఘాలు, ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నారు. సర్కారు నిర్ణయంలో మార్పేమీ చేయలేదు. జిఒ5 ప్రకారం ఈ నెలాఖరులోపు ఎన్యుమరేషన్ తంతు చేసి ఎన్ని నిధులు కావాలో తెలపాలని యంత్రాంగానికి మెమో సైతం పంపించింది. క్షేత్ర పరిశీలన చేస్తున్న అధికారులు ఆ రకంగానే ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఎ.పి. సర్కారు ఆ మేరకే కేంద్రాన్ని నిధులు కోరుతూ వినతిపత్రం ఇచ్చేందుకు రెడీ అవుతోంది.

ఇన్‌పుట్ సబ్సిడీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించిన పరిమితులు కరువు బాధిత రైతులను ఆదుకోవాలన్న చిత్తశుద్ధి ఏ మాత్రం లేదని తెలిసిపోతుంది. కేంద్రం ఒక్కో రైతుకు ఐదెకరాల వరకు ఒక అమౌంట్, ఆ పైన ఇంకో అమౌంట్ ఇస్తామంది. కనీసం 33 శాతం నష్టం జరిగి తీరాలి. కాగా రాష్ట్ర సర్కారు ఒక రైతు ఎన్ని చోట్ల ఎన్ని ఎకరాల్లో పంటలు వేసి నష్టపోయినా ఐదెకరాల్లోపు నష్టాలకే పరిహారం అంది. ఆ పైన జరిగిన నష్టానికి పైసా ఇవ్వదు. 33 శాతం నష్టం నిబంధన సరేసరి. ఒక సీజన్‌లో ఎన్నిసార్లు ఎన్ని విపత్తుల్లో పంట నష్టపోయినా ఒక సారే పరిహారం ఇస్తామంది. ఇ-క్రాప్‌లో నమోదు కావాలని మెలిక పెట్టింది. ఇ-క్రాప్ ఎంత తప్పుల తడకగా సాగుతోందో చూస్తున్నాం. పంటలు వేయకపోయినా వేసినట్లు ఎంట్రీ చేస్తున్నారు. అనర్హుల పేర్లు ఎక్కిస్తున్నారు. కౌలు రైతులకు ఎటువంటి గుర్తింపులూ ఉండవు కనుక వారి పేర్లు ఇ-క్రాప్‌లోకి ఎక్కే ఛాన్సే లేదు. ఇ-క్రాప్ నిబంధన ఎవరికి మేలు చేయడానికో ప్రభుత్వమే శెలవివ్వాలి.

కేంద్రం నిర్ణయించిన స్కేల్ ఆఫ్ అసిస్టెన్స్‌కు ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వాలు, ఆ తర్వాతి టిడిపి ప్రభుత్వం కొంత పెంచి రైతులకు పంపిణీ చేశాయి. కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య గ్యాప్ నిధులను రాష్ట్ర ప్రభుత్వాలు భరించాయి. అప్పటికీ రైతుకు జరిగిన నష్టంతో పోల్చితే ప్రభుత్వాలిచ్చే ఇన్‌పుట్ సబ్సిడీ నామమాత్రం. కొంచెమైనా పెరిగింది కాబట్టి ఆ మేరకు రైతన్నలకు స్వల్పంగానైనా ఉపశమనం కలిగింది. కానీ ప్రస్తుత వైసిపి ప్రభుత్వం గత ఆనవాయితీకి చెల్లుచీటి ఇచ్చింది. కేంద్రం ఎంతైతే స్కేల్ ఆఫ్ అసిస్టెన్స్ ప్రకటించిందో అంతకే జిఒ ఇచ్చింది. రాష్ట్రం ఒక్క రూపాయి కూడా పెంచలేదు. 2014లో హుదూద్ ప్రచండ తుపాను సందర్భంగా అప్పటి టిడిపి ప్రభుత్వం, అంతకుముందు ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న స్కేల్ ఆఫ్ అసిస్టెన్స్‌ను కొద్దిగా పెంచింది. 2015లో కేంద్ర ప్రభుత్వం యుపిఎ-2 సర్కారు నిర్ణయించిన స్కేల్ ఆఫ్ అసిస్టెన్స్‌ను సవరించి అమలు చేయాలని రాష్ట్రానికి లేఖ పంపింది. 2015 చివరిలో టిడిపి ప్రభుత్వం కేంద్రం సవరణలను ఆమోదిస్తూనే, అప్పటికే తాము 'హుదూద్' నుంచీ అమలు చేస్తున్న స్కేల్‌ను ఇకపై కూడా అమలు చేస్తామని జిఒ ఇచ్చింది. ఉదాహరణకు 2015లో ప్రధాన పంటలు వరి, వేరుశనగ, పత్తి, చెరకు, పసుపు, మిర్చి, కూరగాయలు, ఉల్లి, పూలు, బొప్పాయి, పుచ్చకాయలు ఎకరాకు కేంద్రం ఖరారు చేసిన ఇన్‌పుట్ సబ్సిడీ రూ.2,720 కాగా రాష్ట్రం అప్పటికే ఇస్తున్నది రూ.6 వేలు. ఈ తడవ 2023లో కేంద్రం ప్రధాన పంటలను రెండు భాగాలుగా విడగొట్టి పరిహారం నిర్ధారించింది. వర్షాధార పంటలకు రూ.3,400, సాగునీటి వసతి గ్యారంటీ ఉన్న ప్రాంతాల్లో ప్రధాన పంటలకు రూ.6,800గా పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రధాన పంటలనూ ఒకే కేటగిరీలో చేర్చి పరిహారం రూ.6,800గా నిర్ధారించింది. ఎలా చూసినా ఎన్‌డిఆర్ఎఫ్ కంటే రాష్ట్రం తన స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ (ఎస్‌డిఆర్ఎఫ్) నిబంధనల్లో ఒక్క పైసా పెంచలేదు. ప్రతిపక్షంలో ఉండగా జగన్ మోహన్‌రెడ్డి పాదయాత్ర చేస్తున్న సమయంలో తిత్లీ తుపాన్ శ్రీకాకుళం జిల్లాను అతలాకుతలం చేసింది. అప్పటి టిడిపి సర్కారు ఇచ్చే పరిహారం చాలా తక్కువగా ఉందని, తామొచ్చాక ఎంత నష్టం జరిగిందో అంత మొత్తం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకొచ్చి నాలుగున్నరేళ్లయినా ఆ హామీని నెరవేర్చలేదు. ఏ సీజన్‌లో నష్టాలకు ఆ సీజన్‌లోనే పరిహారం అని సర్కారు ప్రస్తుతం ఇస్తున్న ఇన్‌పుట్ సబ్సిడీ నాడు హుదూద్ వేళ 2014లో టిడిపి ప్రభుత్వం నిర్ణయించిన స్కేల్ ఆఫ్ అసిస్టెన్స్ ప్రాతిపదికనే. తొమ్మిదేళ్లనాటి వ్యవసాయ ఖర్చులతో పోల్చితే రైతుకు కొన్ని రెట్ల ఖర్చు పెరిగింది. అరకొరగా ప్రభుత్వాలిచ్చే సాయం ఏ మాత్రం పెరగలేదు.

దేశం మొత్తమ్మీద సాగు ఖర్చులను బేరీజు వేసుకొని కేంద్రం విపత్తు పరిహారం నిర్ణయిస్తుంటుంది. శాస్త్రీయత లేదు. రైతు సంక్షేమం దృష్టి అస్సలే లేదు. కేంద్రంపై ఒత్తిడి తెస్తూనే, ఉన్నంతలో రాష్ట్రాలు ఎంతో కొంత పరిహారం పెంచడం కనీస బాధ్యత. విభజన తర్వాత మన రాష్ట్రం వ్యవసాయ ప్రధాన రాష్ట్రమైంది. కాబట్టి రైతులను ఆదుకోవాల్సిన ధర్మాన్ని రాష్ట్ర ప్రభుత్వం పాటించాలి. కనీస మద్దతు ధరలను నిర్ణయించే వ్యవసాయ పంటల ఉత్పత్తి ఖర్చులు, ధరల కమిషన్ (సిఎసిపి) తాజా నివేదిక ప్రకారం అన్ని రాష్ట్రాల్లోకెల్ల ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ ఖర్చులు అధికం. ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, పలు ప్రభుత్వేతర సంస్థలు, రైతు సంఘాల సర్వేల ప్రకారం ఒక్క వరి పంటనే తీసుకుంటే ఎకరాకు రైతు పెట్టే పెట్టుబడి కనీసం రూ.40 వేలు. కౌలు రైతులైతే రూ.55 వేలు. బ్యాంకులు పంట రుణాలిచ్చేందుకు నిర్ణయించిన సగటు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ రూ.34 వేల నుంచి 38 వేలు. పంట నష్టపోయిన రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలిస్తామంటున్న పరిహారం కేవలం రూ.6,800. వర్షాధారంపై వేసే వేరుశనగకు రైతుకయ్యే పెట్టుబడి రూ.30 వేలు. బ్యాంకులు నిర్ణయించిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ రూ.24-26 వేలు. ప్రభుత్వం ఇచ్చే ఇన్‌పుట్ సబ్సిడీ రూ.6,800 మాత్రమే. వాణిజ్య పంటలు, కొన్ని ఉద్యానవన పంటలు, తోటల పరిస్థితి చెప్పనలవి కాదు. రైతుల కోసమే పుట్టామంటున్న ప్రభుత్వాలు అదే రైతుల పట్ల ఎంత విద్రోహంగా వ్యవహరిస్తున్నాయో ఈ కొన్ని ఉదంతాలతో తేటతెల్లమవుతుంది. ఎ.పి. రైతుల్లో 93 శాతం మంది రుణ గ్రస్తులు. ఒక్కో రైతు కుటుంబంపై ఉన్న సగటు అప్పు రూ.2.45 లక్షలు. ఇవి నేషనల్ శాంపిల్ సర్వే, ఇతర కేంద్ర ఏజెన్సీల లెక్కలు. ఈ తరుణంలో కరువుల వంటి విపత్తులొస్తే రైతులు ఆర్థికంగా లేవలేరు. తిరిగి వ్యవసాయం సాగించలేరు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనలు అమలు చేస్తే కరువు రైతులకు దక్కే సహాయం గోరంత. అదీ అందరికీ రాదు. కరువు తీవ్రత దృష్ట్యా ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్, ఇత్యాది నిబంధనలను పక్కనపెట్టి ప్రత్యేక సహాయం లేక స్పెషల్ ప్యాకేజీ ఇస్తేనే రైతులకు కొంతైనా ఉపశమనం, భరోసా దొరుకుతుంది.

/ వ్యాసకర్త సెల్ : 9490099019 /

కవిత్వం

మాయగాడు

విద్వేషాలను రెచ్చగొట్టేవాడు
మహాత్మా ఫోటో పెట్టుకుంటున్నాడు.

ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేసేవాడు
బాబా సాహెబ్ బొమ్మ పెడుతున్నాడు.

దేశాన్ని విచ్ఛిన్నం చేసేవాడు
పటేల్ విగ్రహం కడుతున్నాడు.

సుభాష్ వారసులమని చెప్పుకునేవాడు
సామ్రాజ్యవాదానికి దాసోహమవుతున్నాడు.

వివేకానందుడు మా వాడే అనేవాడు
మతచిచ్చులు రేపుతున్నాడు.

బిర్సా ముండా పేరు చెప్పుకునేవాడు
గిరిజనుల భూములు కొట్టేస్తున్నాడు.

ఆత్మ నిర్భర్ నినాదమిచ్చేవాడు
ప్రభుత్వ సంస్థలు అమ్మేస్తున్నాడు.

మేక్ ఇన్ ఇండియా అని చెప్పేవాడు
విదేశీ సరుకులే వాడుతున్నాడు.

దేశ భక్తి జపం చేసేవాడు
దేశాన్ని తాకట్టు పెట్టేస్తున్నాడు.

పేరు విశ్వగురు అని చెప్పుకున్నా
వంచనకు మారుపేరే మాయగాడు.

- ఎ. అజ శర్మ

మీ వ్యాసాలు 5000 క్యారెక్టర్లు లేదా 700 పదాలు వుండాలి. పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

తెలంగాణలో ప్రచార హోరు

తెలంగాణలో పోలింగ్ తేదీ దగ్గర పడుతుండడంతో ఎన్నికల ప్రచారం హోరెత్తింది. ఎన్నికల పోటీ చేస్తున్న అభ్యర్థుల తరుపున ఆయా పార్టీల అగ్రనాయకులు శనివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఓటర్లను ఆకట్టుకొనే ప్రయత్నం చేశారు. బిఆర్ఎస్ అభ్యర్థుల తరుపున కెటిఆర్, హరీష్‌రావు పలు సభల్లో పాల్గొని ప్రసంగించారు. బిజెపి అభ్యర్థులకు మద్దతుగా జరిగిన సభల్లో ప్రధాని మోడీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా ఆ పార్టీ అగ్రనాయకులు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ విస్తృత ప్రచారం, రోడ్ షోలు నిర్వహించారు. సిపిఎం అభ్యర్థుల తరుపున ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, బృందా కరత్, మాణిక్ సర్కార్, బివి.రాఘవులు తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు. పలు సభల్లో ప్రసంగించారు. రోడ్ షోలు నిర్వహించారు.

హామీలు విస్మరించిన బిఆర్ఎస్

- ప్రధాని మోడీ విమర్శలు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ అవినీతి పాలనతో విసిగిపోయిన తెలంగాణ ప్రజలు ఇప్పుడు మార్పు కోరుకుంటున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందని విమర్శించారు. ఏడు దశాబ్దాలుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కూడా ప్రజలను విస్మరించిందన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం కామారెడ్డి, మహేశ్వరంలో బిజెపి నిర్వహించిన సభల్లో మోడీ మాట్లాడారు. రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వస్తే బిసి సామాజిక తరగతికి చెందిన వ్యక్తిని ముఖ్యమంత్రిగా చేస్తామన్న హామీకి కట్టుబడి ఉన్నామన్నారు. బిసిలకు, దళితులకు బిఆర్ఎస్, కాంగ్రెస్ చేసిందేమీ లేదని విమర్శించారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామన్న కెసిఆర్ హామీ ఏమైంది? అని ప్రశ్నించారు. దళితలను ఆయన మోసం చేశారని విమర్శించారు. తెలంగాణ ప్రజల్లో తెలివితేటలు పుష్కలంగా ఉన్నా బిఆర్ఎస్ అవినీతి వల్ల ప్రజల సామర్థ్యాలు వెలుగులోకి రాలేదని అన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నాయని, ఆ పార్టీలు స్వార్థ పార్టీలని విమర్శించారు. కాంగ్రెస్‌కు ఓటు వేయడమంటే బిఆర్ఎస్‌కు వేసినట్లేనని, కాంగ్రెస్‌లో ఎమ్మెల్యేలు గెలిచినా బిఆర్ఎస్‌లోకి వెళ్తారని అన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపిలు లక్ష్మణ్, బండి సంజయ్, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

కెసిఆర్ రిమోట్ మోడీ చేతిలో...

- రాహుల్ గాంధీ నిప్పులు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

'రాష్ట్రంలో దొరల తెలంగాణ... ప్రజల తెలంగాణ మధ్య జరుగుతున్న ఎన్నికలు ఇవి. ముఖ్యమంత్రి కెసిఆర్ కుటుంబ పాలనకు, ప్రజలకు మధ్య జరుగుతున్న ఎన్నికలు. ఇక్కడి ప్రజలు ఇలాంటి పాలన కోరుకోలేదు. ఈ దొరల పాలనను అంతమొందించి ప్రజల తెలంగాణను తీసుకురావాలనేదే మా లక్ష్యం' అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. తెలంగాణ కోసం అనేక మంది యువకులు బలిదానాలు చేసుకున్నారని, వారు ఇలాంటి తెలంగాణను కోరుకోలేదని తెలిపారు. ఎలాంటి తెలంగాణ కావాలో జనం తేల్చుకోవాలని సూచించారు. రాష్ట్రంలో బిఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యనే పోటీ ఉందని, బిజెపి, ఎంఐఎం పార్టీలు బిఆర్ఎస్‌కు సహాయకారిగా ఉన్నాయని అన్నారు. ఆదిలాబాద్, బోధన్, వేములవాడలో కాంగ్రెస్ విజయభేరీ సభల్లో శనివారం ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రజల తెలంగాణ అంటే ప్రభుత్వం ప్రజల చేతిలో ఉండాలని అన్నారు. ఈ ఆకాంక్షను కాంగ్రెస్ పార్టీ నెరవేరుస్తుందని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఎనిమిది వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఎస్‌సి, ఎస్‌టి, సబ్‌ప్లాన్ నిధుల్లో

ఎస్‌టిలవి రూ.5,500 కోట్లు, ఎస్‌సిలవి రూ.15,500 కోట్ల నిధులను దారి మళ్లించారని అన్నారు. సిఎం కెసిఆర్ అవినీతిని ప్రధాని మోడీ ఎందుకు బయటపెట్టడం లేదని ప్రశ్నించారు. మోడీ రిమోట్ తీయగానే కెసిఆర్ సైలెంట్ అవుతారని విమర్శించారు. నాపై కేంద్ర ప్రభుత్వం కేసులు మోపిందని, పార్లమెంటు సభ్యత్వం రద్దు చేసిందని, తాను ఉంటున్న బంగ్లాను ఖాళీ చేయించిందని, అయినా నేను భయపడలేదని, సంతోషంగా తాళాలు ఇచ్చి వచ్చానని వివరించారు. రాష్ట్రంలో బిఆర్ఎస్‌ను, కేంద్రంలో బిజెపిని ఓడించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. విద్వేషమనే బజారులో ప్రేమతో కూడిన దుకాణం తెరుస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వ అవినీతిలో మోడీ, కెసిఆర్ కూడా భాగస్వాములనే ఆరోపించారు. దేశ సంపదను ప్రధాని మోడీ తన స్నేహితులకు దోచిపెడుతున్నారని విమర్శించారు. ప్రజల సంక్షేమాన్ని విస్మరించిన బిఆర్ఎస్ ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు.

బిజెపితో దేశానికి ముప్పు

- బివి రాఘవులు ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈ ఎన్నికల్లో దేశానికి ప్రమాదకరమైన మతోన్మాద బిజెపిని అడ్డుకుని, సిపిఎం అభ్యర్థులకే తమ ఓటు వేసి అసెంబ్లీకి పంపించాలని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు కోరారు. బిజెపి పట్ల బిఆర్ఎస్ స్పష్టమైన వైఖరిని ప్రకటించాలన్నారు. ఇండియా కూటమిలోని భాగస్వామ్య పార్టీల మధ్య సీట్ల సర్దుబాటులో కాంగ్రెస్ ఏకపక్షంగా వ్యవహరించిందని చెప్పారు. బిజెపిని అడ్డుకోవాలంటే కాంగ్రెస్ వ్యవహరిస్తున్న తీరు సరైంది కాదన్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో సిపిఎం అభ్యర్థి యాదయ్యని గెలిపించాలని కోరుతూ చేపట్టిన ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. బిజెపి వ్యవహరిస్తున్న తీరు దేశానికి చాలా ప్రమాదకరమన్నారు. కేంద్రంలో అధికారం చేపట్టే ప్రభుత్వంలో ప్రాంతీయ పార్టీల ప్రాధాన్యత ఉంటుందని, అందులో బిఆర్ఎస్ కీలక పాత్ర పోషిస్తుందని కెసిఆర్ ప్రకటిస్తున్నారని అన్నారు. కానీ దేశంలో ఎవరికి మద్దతు ఇస్తారనే విషయంలోనే ఆయనకే స్పష్టత లేదని, ఇప్పటికైనా వారి నిర్ణయాన్ని ప్రకటించాలని తెలిపారు. అంతేకాకుండా, బిజెపి పట్ల కాంగ్రెస్ కఠినమైన వైఖరిని తీసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పోటీచేస్తున్న 19మంది సిపిఎం అభ్యర్థులకు ఓటేసి గెలిపించాలని కోరారు.

తేజస్‌లో మోడీ విహారం

బెంగళూరు : దేశీయంగా తయారైన తేలికపాటి యుద్ధ విమానం 'తేజస్'లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విహరించారు. యుద్ధ పైలెట్ దుస్తుల్లో మోడీ.. తేజస్‌ను స్వయంగా నడిపిన అనుభూతిని పొందారు. శనివారం ఆయన బెంగళూరులోని హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హల్)ను సందర్శించారు. హల్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న తయారీ యూనిట్‌ను కూడా ఆయన పరిశీలించారు. తేజస్‌లో ప్రయాణించిన తొలి ప్రధానిగా కూడా మోడీ రికార్డులకెక్కారు. ఈ వివరాలను సామాజిక మాధ్యమాల్లో ఆయన పోస్టు చేశారు. స్వదేశీ సామర్థ్యాన్ని పెంచాలన్న తన నమ్మకానికి బలం చేకూరినట్లు ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. 'తేజస్ ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తి చేశాను. ఈ అనుభవం చాలా అద్భుతంగా ఉంది. ఈ ప్రయాణంతో మన స్వదేశీ సామర్థ్యంపై విశ్వాసం మరింత పెరిగింది. మన దేశ శక్తి సామర్థ్యాల పట్ల నాకు గర్వంగా ఉంది. ఇది మన శాస్త్రవేత్తల కృషి, అంకిత భావానికి నిదర్శనం. స్వావలంబనలో మనం ప్రపంచంలో ఎవరి కంటే తక్కువ కాబోమని గర్వంగా చెప్పగలను. భారత వాయుసేన, డిఆర్‌డిఒ, హల్‌కు అభినందనలు' అని మోడీ పేర్కొన్నారు. తేజస్ యుద్ధ విమానం సాధారణంగా సింగిల్ సీటర్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్. కానీ మోడీ మాత్రం ట్విన్ సీట్ ట్రైనర్ వేరియంట్‌లో విహరించారు. ఎయిర్‌ఫోర్స్, భారత నేవీ వినియోగిస్తున్న తేజస్ ట్విన్ సీట్ ట్రైనర్ వేరియంట్‌ను వినియోగిస్తున్నాయి.

మా వేదనను ప్రదర్శనగా మార్చకండి

యుపి మంత్రిపై అమరవీరుడి తల్లి ఆగ్రహం !

లక్నో : కుమారుడి మృతితో తీవ్ర వేదనలో ఉన్న ఓ తల్లికి చెక్కు ఇవ్వబోయి ఉత్తరప్రదేశ్ మంత్రి ఒకరు విమర్శల పాలయ్యారు. జమ్మూ కశ్మీర్ రాజౌరీ జిల్లాలో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు సైనికులు అమరులైన విషయం తెలిసిందే. వారిలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన కెప్టెన్ శుభమ్ గుప్తా కూడా ఉన్నారు. శుభమ్ అకాల మరణంతో ఆ కుటుంబం అంతులేని వేదనను అనుభవిస్తోంది. ఆయన తల్లిని ఓదార్చడం ఎవరితరమూ కావడం లేదు. ఈ సమయంలో ఆమె వద్ద ఉత్తరప్రదేశ్ మంత్రి ఒకరు చెక్కుతో నిల్చొని ఫొటోకు పోజిస్తున్నట్లు దృశ్యాలు వైరల్ అయ్యాయి. తమ వేదనను ఒక ప్రదర్శనగా మార్చొద్దని ఆమె వారించడం ఆ వీడియోలో కనిపించింది. దీంతో మంత్రిపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఆ వీడియోలో దృశ్యాలను బట్టి... ఉత్తరప్రదేశ్ మంత్రి యోగేంద్ర ఉపాధ్యాయ.. శుభమ్ తల్లికి చెక్కు ఇవ్వడానికి ప్రయత్నించారు. కానీ అందుకు ఆ మాతృమూర్తి నిరాకరించారు. తమకేమీ వద్దన్నారు. కానీ మంత్రి చెక్కు పట్టుకుని కెమెరాలకు పోజివ్వడంపైన విపక్షాలూ ఆగ్రహం వ్యక్తం చేశాయి.

విమానాశ్రయాలను అభివృద్ధి చేయరేం?

- కేంద్రంపై పినరయి నిలదీత
- ప్రైవేటు కంపెనీలపై ప్రేమ కురిపిస్తోందని ఆగ్రహం

తిరువనంతపురం : రాష్ట్రంలోని ఉత్తర ప్రాంతంలో ఉన్న కన్నూర్, కరిపూర్ విమానాశ్రయాల అభివృద్ధిపై కేంద్రం చిన్నచూపు చూస్తోందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగానే ఈ విమానాశ్రయాల విస్తరణ ఆగిపోయిందని మండిపడ్డారు. నవ కేరళ సదస్ కార్యక్రమం సందర్భంగా శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ విమానాశ్రయాలను సమగ్రంగా అభివృద్ధి చేసి పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. కేరళ ప్రవాసుల భూమి అని అంటూ వారు తమ స్వరాష్ట్రంతో అనుసంధానమయ్యేలా సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు.

విమాన ఛార్జీలు తరచూ పెరుగుతున్నాయని, అయితే ప్రయాణికులకు ప్రత్యామ్నాయ రవాణా మార్గాలు అందుబాటులో లేవని పినరయి చెప్పారు. ఈ సమస్యను పరిష్కరించాలంటే కన్నూర్, కరిపూర్ విమానాశ్రయాలను అభివృద్ధి చేయాల్సి ఉందని అన్నారు. ప్రయాణికులను మలబార్ (ఉత్తర కేరళ) ప్రాంతానికి చేర్చే తొలి విమానాశ్రయం కలిపూరేనని, అయితే ఇప్పుడు దాని అభివృద్ధి ఆగిపోయిందని తెలిపారు. కరిపూర్ విమానాశ్రయంలో రన్‌వే నిర్మాణానికి అవసరమైన భూమిని అక్టోబర్‌లోనే ఎయిర్‌పోర్ట్ అథారిటీకి అప్పగించామని, అయితే టెండర్ ప్రక్రియ కారణంగా జాప్యం జరుగుతోందని వివరించారు. ఈ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి, రన్‌వే అభివృద్ధికి వాస్తవ రూపం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేస్తోందని అన్నారు. కన్నూర్ విమానాశ్రయం నిర్మాణం గత ఎల్‌డీఎఫ్ ప్రభుత్వ హయాంలోనే పూర్తయిందని, దానికి అవసరమైన అన్ని సౌకర్యాలు ఉన్నాయని, అయినా కేంద్రం ఇప్పటికీ విదేశీ విమానాశ్రయాల రాకపోకలను అనుమతించడం లేదని విమర్శించారు. విమానాశ్రయాలపై నియంత్రణ కోసం, తమ ఇష్టానుసారం ఛార్జీలు నిర్ణయించుకునేందుకు కేంద్రం ప్రైవేటు కంపెనీలకు సౌకర్యాలు కల్పిస్తోందని, వాటిపై ప్రేమ కురిపిస్తోందని ఆరోపించారు. అందుకే కన్నూర్ విమానాశ్రయం అభివృద్ధిని నిలిపివేశారని పినరయి చెప్పారు.

వెలికితీత మరింత ఆలస్యం

- ఉత్తరకాశీ టన్నెల్ ఘటనపై ఎన్‌డిఎంఎ వెల్లడి

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీలో టన్నెల్ కూలిన ఘటనలో కార్మికులను రక్షించే చర్యలు అప్పుడే తుది దశకు చేరుకునేలా కనిపించటం లేదు. ఈ ఆపరేషన్‌కు ఎక్కువ సమయం పట్టేలా కనిపిస్తున్నది. ఈ విషయాన్ని జాతీయ విపత్తుల నియంత్రణ సమస్థ (ఎన్‌డిఎంఎ) తెలిపింది. టన్నెల్ కూలి గత 13 రోజులుగా 41 మంది కార్మికులు లోపల చిక్కుకుపోయిన విషయం విదితమే. అయితే, అప్పటి గత 13 రోజులుగా అధికారులు రక్షణ, సహాయక చర్యలను కొనసాగిస్తున్నారు. అయినప్పటికీ అనేక ఇబ్బందులు ఎదురవటంతో కార్మికులను కాపాడటంలో జాప్యం జరుగుతున్నది. కార్మికులు చిక్కుకున్న సొరంగం వద్ద సహాయక చర్యలు నిలిచిపోయాయి. టన్నెల్ వద్ద నేటి(ఆదివారం) నుంచి మాన్యువల్ డ్రిల్లింగ్ చేపట్టనున్నారు. డ్రిల్లింగ్ చేపట్టిన ఆగర్ మెషిన్‌కు శుక్రవారం రాత్రి శిథిలాల్లోని ఇనుపపట్టి అడ్డుపడింది. దీంతో ఆగర్ మెషిన్ బ్లేడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి అన్నారు. అయితే, ప్రస్తుతం అది పనికి రాకుండా పోవటంతో మాన్యువల్ డ్రిల్లింగ్ చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు. కాగా, రోజులు గడుస్తున్నా కొద్దీ సొరంగంలో చిక్కుకున్న కార్మికుల కుటుంబాల్లో ఆందోళన కలుగుతున్నది.

మహువ మొయిత్రీపై సిబిఐ దర్యాప్తు షురూ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

డబ్బులు తీసుకుని ప్రశ్నలు అడిగారానే ఆరోపణలు ఎదుర్కొంటున్న తృణమూల్ కాంగ్రెస్ లోక్‌సభ ఎంపీ మహువా మెయిత్ర చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. లోక్‌పాల్ ఆదేశాలపై ఆమెపై ప్రాథమిక దర్యాప్తును సీబీఐ ప్రారంభించింది. దర్యాప్తు ఆధారంగా మొయిత్రపై క్రిమినల్ కేసు నమోదు చేయాలా వద్దా అనేది లోక్‌పాల్ నిర్ణయిస్తుంది. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం, కేసులో నిందితురాలిని (మొయిత్రీ) సీబీఐ అరెస్టు చేయడం కానీ, సోదాలు జరపడం కానీ చేయరాదు. సమాచారం అడగడం, డాక్యుమెంట్ల పరిశీలన, మొయిత్రీని ప్రశ్నించే అధికారం ఉంటుంది. లోక్‌పాల్ ఆదేశానుసారం దర్యాప్తు ప్రారంభించినందున ఇందుకు సంబంధించిన నివేదికను కూడా లోక్‌పాల్‌కు సీబీఐ సమర్పించాల్సి ఉంటుంది. పార్లమెంటులో ప్రశ్నలు అడిగేందుకు వ్యాపారవేత్త దర్శన్ హీరానందాని నుంచి ముడుపులు తీసుకున్నారనే ఆరోపణలపై సుప్రీంకోర్టు న్యాయవాది జై అనంత్ దేహాద్రయి సీబీఐకి ఫిర్యాదు చేశారు. ఆయన బీజేపీ ఎంపీ నిషాకాంత్ దుబేకి కూడా ఫిర్యాదు చేయడంతో ఈ విషయాన్ని స్పీకర్ ఓం బిర్లా దృష్టికి తీసుకురావడం, ఆయన ఎథిక్స్ కమిటీకి అప్పగించడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నారు. దుబే సైతం లోక్‌పాల్‌కు ఈ విషయమై ఫిర్యాదు చేశారు.

పాలస్తీనాకు సంఘీభావంగా హవానా బీచ్ మీదుగా అమెరికన్ ఎంబసీ వరకు ర్యాలీగా కదలివెళ్తున్న క్యూబన్లు

పాలస్తీనాకు సంఘీభావంగా క్యూబాలో భారీ ర్యాలీ

హవానా: గాజాలో పాలస్తీనీయన్లపై ఇజ్రాయిల్ సాగిస్తున్న ఊచకోతకు వ్యతిరేకంగా అధ్యక్షుడు డియాజ్ కానెల్ నేతృత్వంలో వేలాది మంది క్యూబన్లు గురువారం నాడిక్కడి అమెరికన్ ఎంబసీ ఎదుట భారీ ప్రదర్శన నిర్వహించారు. గాజాపై యుద్ధానికి స్వస్తి పలకాలని, స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటు చేయాలని ప్రదర్శకులు నినదించారు. యంగ్ కమ్యూనిస్టు లీగ్ నిర్వహించిన ఈ మార్చ్‌లో డియాజ్ కానెల్‌తోబాటు ప్రధాని మాన్యుయెల్, విదేశాంగ మంత్రి బ్రూనో రొడ్రిగజ్ తదితరులు కూడా పాల్గొన్నారు. పాలస్తీనా పతాకాలను చేబూని వేలాది మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రదర్శన హవానా సిటీలో సముద్ర తీరం వెంబడి రహదారిపై రెండు కిలో మీటర్ల పొడవునా అంటే మాలెకాన్‌లోని అమెరికన్ ప్రధాన దౌత్య కార్యాలయం వరకు సాగింది. అమెరికన్ ఎంబసీ ఎదుట ఇంత భారీ మార్చ్ నిర్వహించడం గత దశాబ్ద కాలంలో ఇదే మొదటి సారి.

క్యూబా పై అమెరికా ఆర్థిక దిగ్బంధనానికి వ్యతిరేకంగా క్యూబన్ విప్లవ యోధుడు ఫైడెల్ కాస్ట్రో నేతృత్వంలో ఇటువంటి భారీ ప్రదర్శనలు గతంలో జరిగాయి. పాలస్తీనాకు కాస్ట్రో గట్టి మద్దతుదారు. ఇజ్రాయిల్ దేశంగా ఏర్పడగానే దానిని మొట్టమొదట గుర్తించింది అమెరికా అయితే, . పాలస్తీనాను దేశంగా మొట్టమొదట గుర్తించింది క్యూబా అన్న విషయం మరచిపోరాదు. అంతేకాదు, యూదు దురహంకార ఇజ్రాయిల్‌తో దౌత్య సంబంధాలను నిర్ద్వంద్వంగా తిరస్కరించిన దేశం క్యూబా. 200 మందికిపైగా పాలస్తీనా వైద్యులకు క్యూబా శిక్షణ ఇచ్చింది. పాలస్తీనా, క్యూబా మధ్య బంధం చెక్కుచెదరనిది. గాజాపై ఇజ్రాయిల్ ఆటవిక దాడుల్లో గత ఆరువారాల్లో 14,800 మంది మరణించారు. వీరిలో 40 శాతానికిపైగా పిల్లలే ఉన్నారు.

జర్నలిస్టు సౌమ్యా విశ్వనాథన్ హత్య కేసులో నలుగురికి యావజ్జీవం

న్యూఢిల్లీ : జర్నలిస్టు సౌమ్యా విశ్వనాథన్ హత్య కేసులో ఢిల్లీ కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో దోషులైన నలుగురికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పు ఇచ్చింది. మరో నిందితుడికి మూడేళ్లు జైలుశిక్ష ఖరారు చేసింది. హెడ్‌లైన్స్ టుడే న్యూస్ ఛానెల్‌లో జర్నలిస్టుగా పనిచేసిన 25 ఏళ్ల సౌమ్యా విశ్వనాథన్ 2008 సెప్టెంబరు 30న హత్యకు గురైన విషయం తెలిసిందే. ఆఫీస్ ముగించుకుని కారులో ఇంటికి వెళ్తుండగా దుండగులు కాల్పులు జరిపి హత్య చేశారు. దక్షిణ ఢిల్లీలోని వసంత్ కుంజ్ ప్రాంతంలో కారులో ఆమె మరణించి ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. తొలుత రోడ్డు ప్రమాదంగా భావించారు. ఫోరెన్సిక్ నివేదిక వచ్చిన తర్వాత తలకు బుల్లెట్ గాయం వల్ల ఆమె చనిపోయినట్లు తెలిసింది. సిసిటివి ఫుటేజ్ కూడా దీనిని నిర్ధారించింది.ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు రవి కపూర్, అమిత్ శుక్లాను అరెస్టు చేశారు. వారిని ప్రశ్నించగా.. నేరం అంగీకరించారు. సౌమ్యా విశ్వనాథన్‌ను కాల్చి చంపి దోచుకున్నట్లు చెప్పారు. థ్రిల్లింగ్ కోసం ఈ హత్యలు చేసినట్టు వెల్లడించారు. ఈ నేపథ్యంలో మిగతా నిందితులైన బల్జీత్ మల్లిక్, అక్షయ్ కుమార్‌తో పాటు సహకరించిన అజయ్ సేథీని ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. 2010 జూన్‌లో ఈ కేసుపై చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో 15 ఏళ్ల పాటు విచారణ జరిపిన ఢిల్లీలోని సాకేత్ కోర్టు ఈ ఏడాది అక్టోబరులో ఐదుగురు నిందితులు రవి కపూర్, అమిత్ శుక్లా, బల్జీత్ మల్లిక్, అక్షయ్ కుమార్, అజయ్ సేథీని దోషులుగా నిర్ధారించింది. ఈ నేపథ్యంలోనే కేసును విచారించిన ఢిల్లీ కోర్టు ఐదుగురు నిందితుల్లో నలుగురు రవి కపూర్, అమిత్ శుక్లా, బల్జీత్ మల్లిక్, అక్షయ్ కుమార్‌కు తాజాగా జీవిత ఖైదు విధించింది. నలుగురు దోషుల చర్య 'అరుదైన' కేటగిరి కిందికి రాదని, అందువల్ల వీరికి మరణశిక్ష విధించలేమని కోర్టు పేర్కొంది. హత్యకు సహకరించిన అజయ్ సేథీకి మాత్రం మూడేళ్ల జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది.

ఎబబిలో టిప్పర్ బోల్తా.. ఆరుగురు మృతి

ప్రజాశక్తి - సీలేరు, ముంచంగిపుట్టు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

ఆంధ్రా - ఒడిశా సరిహద్దుల్లో సిమెంట్ లోడుతో వెళ్తున్న టిప్పర్ బోల్తా పడడంతో అరుగురు మృతి చెందారు. ఏడుగురికి తీవ్రంగా గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు. మల్కనగిరి జిల్లా కటాఫ్ ఏరియాలోని జోడాంబోలో ఓ నిర్మాణ సంస్థ ప్రభుత్వ భవనాన్ని నిర్మిస్తోంది. అందుకు అవసరమైన వంద బస్తాల సిమెంటు, ఇనుప ఊచలను జనతాపాయ్‌లో లోడ్ చేసుకుని డ్రైవర్‌తో సహా 13 మంది జోడాంబోకు టిప్పర్‌లో వెళ్తున్నారు. వంతలగూడ దాటిన తరువాత జోడాంబో ఘాట్ రోడ్డులో టిప్పర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో ఐదుగురు సంఘటనా స్థలంలోనే మరణించారు. ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు, బిఎస్‌ఎఫ్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చిత్రకొండ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందారు.

ఈ ప్రమాదంలో మృతి చెందిన వారంతా నవరంగపూర్, కొసమగుడ బ్లాక్‌కు చెందిన వారిగా గుర్తించారు. ప్రమాద ఘటనపై ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులు ఒక్కొక్కరికీ రూ.3 లక్షల పరిహారం ప్రకటించారు.

లూలా ప్రభుత్వానికి పెరుగుతున్న మద్దతు

బ్రాసిలియా : బ్రెజిల్‌లో అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డిసిల్వా ప్రభుత్వానికి గతంలో కంటే మద్దతు పెరిగింది. రిప్యూటేషన్ అండ్ ఇమేజ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఐపిఆర్ఐ) తాజాగా నిర్వహించిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడయింది. లూలా ప్రభుత్వాన్ని ఆమోదించే ప్రజలు 58 శాతానికి పెరిగారని అధ్యయనం తెలిపింది. గతంలో ఇది 38 శాతంగా ఉండేది. ప్రస్తుత సర్వే లూలా ప్రభుత్వంపై ప్రజల అవగాహన, వివరణాత్మక వీక్షణను ప్రతిబింబిస్తుందని బ్రెజిల్ 24/7 అనే పోర్టల్ పేర్కొంది. ప్రస్తుత సర్వే ప్రకారం.. బ్రెజిల్ పరిస్థితి బాగోలేదని భావించేవారి సంఖ్య గతం కంటే ఐదు శాతం (33 శాతం నుంచి 28 శాతం) తగ్గింది. కాగా, సరిగ్గా ఏడాది క్రితం జరిగిన ఎన్నికలపై లూలా ఇటీవల స్పందిస్తూ 'బ్రెజిల్‌లో ప్రజాస్వామ్యం గెలిచింది' అని వ్యాఖ్యానించారు. 'ఏడాది క్రితం ఎన్నికల్లో ప్రజాస్వామ్యం గెలిచింది. అక్కడ నుండి మేము సామాజిక కార్యక్రమాలను పునఃప్రారంభించాము, మేము అటవీ నిర్మూలనను, నిరుద్యోగాన్ని తగ్గించాము. ప్రపంచవ్యాప్తంగా బ్రెజిల్ యొక్క ప్రతిష్టను పునరుద్ధరించాము. జీవితాలను మెరుగుపరిచాము. ఒక సంవత్సరం తర్వాత మీకు ఎలా అనిపిస్తుంది.. మీరు ఏమనుకుంటున్నారు ?' అని సోషల్ మీడియా వేదికల్లో లూలా పోస్ట్ చేశారు.

అమెజాన్ కార్మికుల ఆందోళన

- పలు డిమాండ్లతో బ్లాక్ ఫ్రైడే

న్యూఢిల్లీ : అమెజాన్ సంస్థలో పనిచేస్తున్న కార్మికులు శుక్రవారం దేశవ్యాప్తంగా ఆందోళన నిర్వహించారు. 'మేక్ అమెజాన్ పే' పేరిట ప్రపంచ దేశాల్లో చేపట్టిన నిరసనల్లో భాగంగా మన దేశంలో కూడా బ్లాక్ ఫ్రైడే పాటించారు. యూఎన్ఐ గ్లోబల్ యూనియన్, ప్రోగ్రెసివ్ ఇంటర్నేషనల్ సంస్థ పిలుపు మేరకు 80 సంఘాలు, పౌర సమాజ సంస్థలు, పర్యావరణవేత్తలు ఈ నిరసన కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. కార్మికులకు మెరుగైన వేతనాలు చెల్లించాలని, సంఘాల్లో చేరే హక్కును గౌరవించాలని డిమాండ్ చేశారు. పన్నులు సక్రమంగా చెల్లించాలని, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కర్తవ్యాలను నెరవేర్చాలని కూడా వారు తమ ప్రచారోద్యమంలో డిమాండ్ చేశారు.

న్యూఢిల్లీ, పాట్నా, వారణాసి, ముంబయి, కొల్‌కతా, ఔరంగాబాద్, రుషీకేశ్, ఆగ్రా, భోపాల్, కొల్హాపూర్ తదితర ప్రాంతాల్లో అమెజాన్ కార్మికులు నిరసన తెలిపారు. తమ మానసిన, శారీరక బాగోగులను అమెజాన్ సంస్థ ఏ మాత్రం పట్టించుకోవడం లేదని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎనిమిది దేశాల్లో యూఎన్ఐ గ్లోబల్ యూనియన్ చేపట్టిన సర్వే ప్రకారం... అమెజాన్ సంస్థ జరుపుతున్న పర్యవేక్షణ కారణంగా తమ మానసిక, శారీరక ఆరోగ్యం దెబ్బతింటోందని యాభై శాతం మంది కార్మికులు ఫిర్యాదు చేశారు. అమెజాన్ గిడ్డంగిలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి మాట్లాడుతూ 'పని ఒత్తిడి విపరీతంగా ఉంటోంది. రోజుకు పది గంటలు పని చేయాలి. ఆ సమయంలో నిలుచునే ఉండాలి. గంటకు 150 పెద్ద వస్తువుల్ని ప్రాసెస్ చేయాల్సి ఉంటుంది. అది మా టార్గెట్. ఒకవేళ గంటలో ఆ పని చేయకపోతే అధికారులు మాపై ఒత్తిడి తెచ్చి రాజీనామా చేయాలని అడుగుతారు. మధ్యలో ఎలాంటి విరామాలు ఉండడం లేదు. లక్ష్యాన్ని చేరుకోకపోతే వాష్‌రూమ్‌కి కూడా వెళ్లనివ్వరు. తోటి కార్మికులతో మాటా మంతి ఉండదు. కనీసం ఫోన్‌లో మాట్లాడే అవకాశం కూడా ఇవ్వరు' అని వాపోయారు. సమాన వేతన విధానాన్ని అమలు చేయాలని, 2030 నాటికి ఉద్గమనాలను పూర్తిగా నివారించాలని, వాస్తవికతను దృష్టిలో పెట్టుకొని పనిలో లక్ష్యాలను నిర్దేశించాలని, ప్రమాదాలకు గురైతే నష్టపరిహారం అందజేయాలని, మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించాలని అమెజాన్ ఇండియా కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. కార్మికులు వరుసగా నాలుగు సంవత్సరాల నుండి బ్లాక్ ఫ్రైడేను పాటిస్తున్నారు. అమెజాన్ విధానాలను నిరసిస్తూ ఇటలీ, ఫ్రాన్స్, జర్మనీ వంటి దేశాల్లో సమ్మె కూడా చేస్తున్నారు. బంగ్లాదేశ్‌లో వస్త్ర పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు అమెజాన్ విధానాలకు వ్యతిరేకంగా ఆందోళన నిర్వహించారు.

హిందూత్వ-యూదు పొత్తును వ్యతిరేకించాలి

(మొదటిపేజీ తరువాయి)

పాలస్తీనాకు మద్దతును, సంఘీభావాన్ని ప్రకటించారు. బ్రిటన్‌లో, కన్జర్వేటివ్ ప్రభుత్వం, ప్రతిపక్ష లేబర్ పార్టీ నాయకత్వం రెండూ గాజాలో ఇజ్రాయిల్ ఊచకోతకు పూర్తిగా మద్దతిచ్చాయి. అయినా సరే వందల వేల సంఖ్యలో ప్రజలు ప్రతి శనివారం ప్రదర్శనలు నిర్వహిస్తూనే వున్నారు. ఇటువంటి నిరసనలను, పాలస్తీనా పతాకాలను ప్రదర్శించడాన్ని ఫ్రెంచి, జర్మనీ ప్రభుత్వాలు నిషేధించాయి. అయినా పారిస్, బెర్లిన్‌ల్లో నిరసనలు జరిగాయి.

నాలుగు రోజుల పాటు గాజాలో కాల్పుల విరమణ, హమాస్ చెరలో బందీలుగా వున్న 50మంది మహిళలు, చిన్నారులను విడుదల చేస్తే అందుకు ప్రతిగా ఇజ్రాయిల్ జైళ్లలో మగ్గుతున్న 150మంది పాలస్తీనా మహిళలను, చిన్నారులను విడుదల చేయడమన్నది తాత్కాలిక ఉపశమనం. కాల్పుల విరమణ సమయం ముగిసిన తర్వాత మళ్ళీ యుద్ధం సాగుతుందని నెతన్యాహు ఇప్పటికే స్పష్టం చేశారు. అందువల్లే, ఈ సమస్యకు రాజకీయ పరిష్కారం కనుగొనేవరకు, శాశ్వత కాల్పుల విరమణ జరిగేలా ఒత్తిడి తీసుకురావాలన్నది కీలకాంశంగా వుంది.

భారత్‌లో, పెద్ద పెద్ద బహిరంగ సభలు నిర్వహిస్తున్నారు. కేరళలో అన్ని జిల్లాల్లో వేలాదిమంది ప్రజలు పాల్గొంటున్నారు. కోల్‌కతాలో వామపక్షాలు పెద్ద ప్రదర్శన నిర్వహించాయి. వివిధ రాష్ట్రాల్లో సంఘీభావ చర్యలు, సమావేశాలను కూడా వామపక్షాలు నిర్వహిస్తున్నాయి.

పాలస్తీనియన్లను ముస్లిం తీవ్రవాదులుగా చిత్రీకరిస్తూ బిజెపి, కార్పొరేట్ మీడియా ఆధిపత్యంతో కూడిన మతపరమైన కథనాలు ఇస్తున్న తీరును దృష్టిలో పెట్టుకుంటే మరోవైపు లౌకిక ప్రతిపక్ష పార్టీలు ఈ అంశంపై ఎదురు తిరగకుండా నిష్క్రియాపరత్వంతో వ్యవహరిస్తున్నాయి. అందువల్ల, స్వతంత్ర పాలస్తీనా దేశం ఏర్పాటు చేయడానికి, పాలస్తీనా భూభాగాల్లో ఇజ్రాయిలీల ఆక్రమణను అంతమొందించడానికి, అలాగే శాశ్వతంగా కాల్పుల విరమణకు మద్దతుగా వామపక్షాలు విస్తృత రీతిలో, నిలకడగా ప్రచారం చేపట్టడం ఇక్కడ అత్యంత కీలకంగా మారింది. ఇందుకోసం జరిగే ప్రజా సమీకరణలో ఇతర లౌకిక, ప్రజాస్వామ్య శక్తులను కూడా కలుపుకుంటూ, దీన్నొక ఇస్లామోఫోబిక్ అంశంగా మార్చడానికి బిజెపి చేస్తున్న ప్రణాళికను భగ్నం చేయాల్సి వుంది." అని పీపుల్స్ డెమొక్రసీ పేర్కొంది.

రెండో రౌండ్ బందీల విడుదలలో జాప్యం

గాజాసిటీ: ఉత్తర గాజాకు సహాయం అనుమతిస్తామన్న హామీకి భిన్నంగా ఇజ్రాయిల్ వ్యవహరించడంతో రెండో రౌండ్ బందీల విడుదలలో జాప్యం జరుగుతోంది. ఉత్తర గాజాలోకి సహాయక ట్రక్కులను ప్రవేశించకుండా ఇజ్రాయిల్ అడ్డుకుందని హమాస్ తెలిపింది. కాల్పుల విరమణ ఒప్పందంలో ఇచ్చిన హామీకి కట్టుబడి ఉండేందుకు ఇజ్రాయిల్ తిరస్కరిస్తున్నంతవరకు బందీల విడుదల ఆలస్యమవుతుందని హమాస్ అధికారి ఒకరు తెలిపారు.

కోచ్చిలో తొక్కిసలాట

(మొదటిపేజీ తరువాయి)

అత్యున్నత సమావేశం నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. యూనివర్సిటీ క్యాంపస్‌లో జరిగిన విషాదం యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేస్తోందని విజయన్ అన్నారు. మరణించిన నలుగురు విద్యార్థుల కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా సూచనలు చేశారు. ఘటనపై సమగ్ర విచారణ జరుపుతామని స్పష్టం చేశారు. పరిశ్రమల శాఖ మంత్రి పి.రాజీవ్, ఉన్నత విద్యాశాఖ మంత్రి ఆర్.బిందు పరిస్థితిని నేరుగా అంచనా వేసేందుకు, కార్యకలాపాలను సమన్వయం చేసేందుకు కోచ్చి వెళ్లారు. సంతాపాన్ని తెలియ జేసేందుకు మంత్రులు అత్యవసరంగా సమావేశమయ్యారు. విద్యార్థులు మరణించడంతో సంతాప సూచకంగా ఆదివారం జరగాల్సి ఉన్న నవకేరళ వేడుకలు, సాంస్కృతిక కార్యక్రమాలను రద్దు చేశారు. కోజికోడ్‌లో శనివారం రాత్రి ప్రభుత్వం అతిథి గృహంలో ఈ సమావేశం జరిగింది.

కలమస్సేరిలో ప్రత్యేక వైద్య శిబిరం

తొక్కిసలాట నేపథ్యంలో ఎర్నాకులం జిల్లా కలమస్సేరి మెడికల్ కాలేజీలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ఆరోగ్యశాఖ మంత్రి వీణా జార్జ్ తెలిపారు. దీని కోసం వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలు ఇప్పటికే అక్కడకి చేరుకున్నారని చెప్పారు. ప్రైవేటు ఆస్పత్రులు కూడా సిద్ధంగా ఉండాలని, భారీ సంఖ్యలో 108 అంబులెన్స్‌లను సిద్ధం చేయాలని కూడా ఆదేశించారు. త్రిసూర్ మెడికల్ కాలేజీకి చెందిన సర్జరీ, ఆర్థోపెడిక్స్ విభాగం వైద్యుల బృందం ఎర్నాకులం చేరుకోనున్నట్లు మంత్రి తెలిపారు.

మీ కోసం

పాడిబారిన పెదవులపై కొబ్బరినూనె, బాదం నూనెను సమపాళ్లలో కలిపి రాసుకుంటే మృదువుగా ఉంటాయి.

జీవన సౌరభం

ఇతరుల తప్పులను ఎంచేవారు, తమలోని లోపాలను గుర్తించలేరు.

'క్క' కదంబం

బక్కచిక్కిన వాడంటాం
లెక్కలలోనే ఘనుడంటాం
నక్క వినయములవాడంటాం
టక్కరి దొంగని అంటుంటాం..

రొక్కము కాజెయ్యొద్దంటాం
అక్కసు కలిగుండొద్దంటాం
లెక్కన కవిగారంటుంటాం
చుక్కలలో చంద్రుడు అంటాం..

తొక్కతీసి తింటారంటాం
లక్క సీలు వేస్తారంటాం
పిక్క బలము కలవాడంటాం
డొక్కచించి వేస్తామంటాం..

అక్కకి మగనిని బావంటాం
చిక్కని పాలను కొంటుంటాం
బుక్కపట్నమొక ఊరంటాం
చక్కర్లను కొట్టాడంటాం..

చెక్క భజన చేస్తారంటాం
వక్క ఆకు కిళ్లీ అంటాం
లిక్కరు తాగి చెడకంటాం
చుక్కల మందుని వాడంటాం..

ఉక్కకు ఫేను వెయ్యంటాం
కుక్కకు విశ్వాసంబంటాం
తొక్కను పారెయ్యాలంటాం
నొక్కుల జుట్టని అంటుంటాం..

పిక్కలతో ఆడెదరంటాం
నిక్కరు బాగుందని అంటాం
కుక్కంటే భౌభౌ అంటాం
ఇక్కడ లేదని అంటుంటాం..

మొక్కకు నీరు పొయ్యాంటాం
ఒక్కడే కొడుకు అని వింటాం
అక్కరకు రాని వాడంటాం
ఎక్కడివివి అని అంటుంటాం..
జక్కన్నొక శిల్పని వింటాం
గుక్కపట్టి ఏడ్చాడంటాం
దక్కదు లాభం అంటుంటాం
గుక్కతిప్పక ఇలా మాట్లాడేస్తాం..!

దుక్కలాగా ఉన్నాడంటాం
నొక్కకు నొప్పెడుతుందంటాం
ముక్క విరిగిపోయిందంటాం
ముక్కుట, మూల్గుట అని అంటాం..!

ముక్కలాటలాడొద్దంటాం
ప్రక్కదారి పట్టొద్దంటాం
అక్కన్న మాదన్నలని వింటాం
రక్కసి చేష్టలు అంటుంటాం..!

ముక్కంటిది ఆ గుడి అంటాం
చుక్కమ్మక్కని వింటుంటాం
ముక్కలుకోసుకు తింటుంటాం
ఎక్కములన్నీ వల్లిస్తాం
ఇక్కడికివి చాలని చెపుదాం..!

-ఎస్.వి.ఆర్ సత్యనారాయణమూర్తి,
9440894087

నేను గీసిన బొమ్మ

బండి ప్రాచి
పదవ తరగతి,
జక్కాపూర్, సిద్దిపేట జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

చర్మవ్యాధులపై అప్రమత్తత అవసరం

ప్రస్తుత శీతాకాలంలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక అనారోగ్య సమస్యలతో బాధపడుతుంటారు. అయితే ఈ కాలంలో రోగాలతో పాటుగా ముఖ్యంగా చర్మ సమస్యలు బాగా ఇబ్బంది పెడుతుంటాయి. వాటిలో చర్మం పొడిబారిపోవటం, పెలుసుగా మారిపోవటం, పగుళ్లు, రాషెస్, దురదలు, మంటలు వంటి సమస్యలు ఎక్కువగా పీడిస్తుంటాయి. వీటిలో అత్యంత క్లిష్టమైన సమస్య సొరియాసిస్. ప్రపంచ జనాభాలో సుమారుగా మూడు శాతం మంది ఈ వ్యాధి బారిన పడుతున్నారంటే పరిస్థితిని ఇట్టే అర్థం చేసుకోవొచ్చు.

ప్రతి ఒక్కరూ రోజూ సూర్యరశ్మిలో కొంత సమయం గడపటం వల్ల చర్మం ఆరోగ్యంగా ఉండి పొలుసులు రాకుండా ఉంటుంది. అయితే ఎక్కువ ఎండలో ఉండేవారు మాత్రం తప్పకుండా శరీరాన్ని కప్పి ఉంచే పొడవాటి దుస్తులు, తనపైన రక్షణకు టోపీ వంటివి వాడటం శ్రేయస్కరం. చర్మాన్ని హైడ్రేట్‌గా ఉంచుకోవటం వల్ల కూడా తగిన తేమ లభించి చర్మ సమస్యలు దరిచేరబోవు. ఇందుకు మాయిశ్చరైజర్ వంటివి తప్పకుండా ఉపయోగించాలి. చర్మానికి తగిన తేమ లేకపోతే అనారోగ్యం కారణంగా అనేక చర్మ సమస్యలు వెంటాడుతుంటాయి. వాతావరణ కాలుష్యం, దుమ్ము, ధూళి, పొగ ... ఇలా అనేక రకాల కారణాల వల్ల కూడా అనేక చర్మ సమస్యలు వస్తాయి. కాలుష్య ప్రాంతాలకు వెళ్లటం తగ్గిస్తే మంచిది. వెళ్లాల్సి వస్తే వీలైనంత త్వరగా చర్మాన్ని వీలైనంత త్వరగా శుభ్రం చేసుకోవాలి. ఒత్తిడులకు దూరంగా ఉండాలి. ధూమ, మద్యపానం వంటివి చేయకూడదు. చాలామంది సమతుల్యమైన, పోషకాహారం తీసుకోకపోవటం, లోపం కారణంగా చర్మ వ్యాధుల బారినపడుతున్నారు. తగినంతగా నీరు తాగటం, క్యారెట్లు వంటివి తీసుకోవటం వల్ల విటమిన్-ఎ పొంది చర్మం పొడి బారకుండా తేమగా ఉండేలా చేస్తుంది. విటమిన్-సి ఉండే నారింజ, స్ట్రా బెర్రీలు, యాపిల్, పుచ్చకాయ, అరటిపండు, బొప్పాయి వంటి వాటిని తీసుకోవాలి. శరీరంలో సాధారణంగా రోగ నిరోధక వ్యవస్థ ప్రమాదకరమైన వ్యాధుల నుంచి మనల్ని రక్షిస్తుంది. చర్మపు అలెర్జీ ఉన్న వ్యక్తులు అతి సున్నితమైన రోగ నిరోధక వ్యవస్థను కలిగి ఉంటారు. ఎగ్జిమా (గజ్జి), దద్దుర్లు, కాంటాక్ట్ డెర్మటైటిస్ (చర్మవాపు), ఆంజియోడిమాలు వంటివి సాధారణ చర్మ ఎలర్జీకి ప్రతి చర్యలు.

శీతాకాలంలో ఇంకా అనేక అనారోగ్య సమస్యలు ఉన్నా ప్రధానంగా ఎగ్జిమా, సొరియాసిస్ సమస్యలతోనే ఎక్కువ మంది బాధపడుతున్నారు. శరీరంపై దద్దుర్లు మనం తీసుకునే ఆహారాలు, నీరు, మందులు, చలి, అతినీలలోహిత కాంతి, చర్మంపై ఒత్తిడి, మొక్కలు, జంతువులు లేదా పలు రసాయనాలు తాకినప్పుడు కూడా కలుగుతాయి.

డాక్టర్ హిమబిందు గొట్టాపు, ఎండి డివిఎల్
అసిస్టెంట్ ప్రొఫెసర్, డెర్మటాలజిస్ట్
సిద్ధార్థ మెడికల్ కళాశాల, విజయవాడ

ఎగ్జిమా (గజ్జి) : గజ్జి అనే చర్మవ్యాధిని స్కేబీస్‌అని, ఎగ్జిమా అని పిలుస్తారు. ఇది చిన్నగా ఉండే కాళ్లమైట్ అనే పరాన్నజీవి వల్ల వస్తుంది. ఈ పరాన్నజీవి ఆహారం కోసం చర్మం పొరలోకి ప్రవేశించినప్పుడు గజ్జి అనే చర్మ వ్యాధి వస్తుంది. తీవ్రమైన దురదను కలిగివుండటం దీని ప్రధాన లక్షణం. గజ్జి వ్యాధి చర్మం నుంచి చర్మానికి వ్యాప్తి చెందుతుంది.

దద్దుర్లు : వీటిని వైద్య పరిభాషలో అర్టికేరియా అని పిలుస్తారు. ఇది ప్రపంచవ్యాప్తంగా చాలామందిని ప్రభావితం చేస్తుంది. దద్దుర్లు చర్మంపై వాపు, దురద, చికాకును కలిగించటమే కాకుండా చర్మంపై బొబ్బలు, పొక్కులకు కూడా కారణమవుతుంది. చాలా రకాల దద్దుర్లు కొన్ని రోజులు లేదా వారాల్లో వాటంతట అవే తగ్గిపోతాయి. కొన్ని సందర్భాల్లో ఆరు వారాలకంటే ఎక్కువ రోజులు కనుక ఉంటే, అది దీర్ఘకాలిక దురదగా చెప్పుకోవచ్చు.

సొరియాసిస్ : సొరియాసిస్‌ని కేవలం సాధారణ చర్మ వ్యాధిగా పరిగణించటానికి వీల్లేదు. శరీరంలో రోగ నిరోధక వ్యవస్థ వికటించటం వల్ల వచ్చే చర్మవ్యాధి ఇది. సొరియాసిస్ వ్యాధిగ్రస్తుల్లో చర్మంపై దురదతో కూడిన వెండిరంగు పొలుసులు కన్పిస్తాయి. ఈ వ్యాధి ప్రభావం చర్మంపై మాత్రమే కాకుండా గోళ్లు, తల తదితర శరీర భాగాలు కూడా వ్యాధి ప్రభావానికి లోనుకావచ్చు. వ్యాధి నిరోధకశక్తి వికటించి స్వయం ప్రేరితంగా మారటంతో సొరియాసిస్ వస్తుంది. కొన్ని కుటుంబాల్లో అనువంశికంగా వస్తుంటుంది. దీర్ఘకాలం బాధించటం వల్లన రోగులు డిప్రెషన్‌కు గురౌతారు. తద్వారా వ్యాధి తీవ్రతకు గురౌతారు. సొరియాసిస్ జాయింట్ ఇన్వాల్వ్‌మెంట్ ఉన్నప్పుడు సొరియాటిక్ ఆర్థరైటిస్‌కు గురౌతుంటారు. తీవ్రత పెరిగితే హార్ట్ ఎటాక్, స్ట్రోక్ వంటివి వచ్చే అవకాశం కూడా ఉంటుంది. డయాబెటిక్, రక్తపోటుకు గురయ్యే ప్రమాదం కూడా ఉంది.

చర్మ సంరక్షణకు ఇలా చేయండి (బాక్సు)

చలికాలంలో చర్మాన్ని మృదువుగా ఉంచుకునేందుకు పగుళ్ల నుంచి దూరంగా ఉండేందుకు కోల్డ్ క్రీములు వాడాలి

తగిన విటమిన్లు, ప్రొటీన్లు ఉన్న పోషకాహారం తీసుకోవాలి

చర్మం మృదుత్వాన్ని కోల్పోకుండా విటమిన్లు, ప్రొటీన్లతో కూడిన సహజమైన క్రీములనే వాడాలి

ఆహారంలో కుంకుమ పువ్వు వాడితే చర్మం నిగారింపుతో ఉంటుంది.

ఆహారంలో తగినంత పసుపు, అల్లం, జీలకర్ర వాడితే తుమ్ములు,జలుబు, దురదలు వంటి ఎలర్జీల నుంచి బయటపడొచ్చు.

చర్మ వ్యాధులు ఎక్కువైతే నిపుణులైన వైద్యులను సంప్రదించటం శ్రేయస్కరం.

ఇవీ, ఎలర్జీ లక్షణాలు
చర్మం ఎర్రగా మారుతుంది
దురద
వాపు
దద్దుర్లు
పైకి ఉబ్బిన బొబ్బలు
చర్మం పొలుసులుగా మారటం
చర్మ పగులు, చీలిక

ప్రలోభాలకు లొంగనోళ్లు కమ్యూనిస్టులే

పాలేరులో తమ్మినేని వీరభద్రంను గెలిపించండి : సీతారాం ఏచూరి

అభివాదం చేస్తున్న సీతారాం ఏచూరి, తమ్మినేని వీరభద్రం తదితరులు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

ప్రలోభాలకు లొంగకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి నికరంగా కొట్లాడేది కమ్యూనిస్టులేనని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. అందుకే పాలేరు ఎమ్మెల్యేగా తమ్మినేని వీరభద్రంను గెలిపించాలని పిలుపునిచ్చారు. ప్రజల కోసం ప్రాణాలు అర్పించిన వీరులగన్న పోరాట గడ్డలే విప్లవకారులకు తీర్థయాత్రస్థలాలన్నారు. అలాంటి గడ్డపై కమ్యూనిస్టులను గెలిపించాలని ప్రజలను కోరారు. ఖమ్మం రూరల్ మండల కేంద్రంలోని వి.వెంకటాయపాలెంలో సిపిఎం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఏచూరి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశంలో నిరుద్యోగ, ప్రజా పోరాటాలను చీల్చడానికి మతోన్మాద రాజకీయాలను బిజెపి ముందుకు తీసుకొస్తోందని విమర్శించారు. ఉత్తరప్రదేశ్‌లో బిజెపి బుల్డోజర్ పాలన కొనసాగిస్తోందన్నారు. దేశంలో నిరుద్యోగం పెద్ద ఎత్తున పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తే కొత్త భారతాన్ని నిర్మించవచ్చన్నారు. కులగణన చేయకుండా మోడీ సర్కారు మొండికేస్తోందని విమర్శించారు. బీహార్‌లో గణన చేస్తే 85 శాతం దళితులు, గిరిజనులు, ఒబిలు ఉన్నారని తేలిందని, దీనికి అనుగుణంగా ఇప్పుడు అక్కడి ప్రజలకు రిజర్వేషన్లు పెంచే పనిలో ఆ ప్రభుత్వం ఉందని తెలిపారు. దేశ సంపదకు యజమానులు ప్రజలేనని, మనకు తెలియకుండానే ఆస్తులను అమ్ముకుంటున్న మేనేజర్ (మోడీ)ను మార్చాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ఎన్నికల్లో సీట్లు రాకపోయినా తమ ప్రభుత్వమే ఏర్పాటవుతుందని బిజెపి చెప్పడం వెనుక కొనుగోళ్ల పర్వం ఉందన్నారు. మోడీ తన మిత్రులకు లబ్ధి చేకూరుస్తూ వారి దగ్గర నుంచి ధనశక్తిని తీసుకుని ఎమ్మెల్యేలను కొంటూ ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తున్నారని, దీనికి గోవా, మహారాష్ట్ర ప్రభుత్వాలే తాజా ఉదాహరణనని వివరించారు. రాజకీయాన్ని వ్యాపారంగా బిజెపి మార్చిందని విమర్శించారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్ మాట్లాడుతూ పాలేరు గడ్డమీద సిపిఎం జెండా ఎగురబోతోందన్నారు.

దళితులు, రైతులు, ఆశాలు, అంగన్‌వాడీల తరుపున నికరంగా నిలబడి తమ్మినేని వీరభద్రం పోరాడారని తెలిపారు. ఖమ్మంలో 2004లో జరిగినట్టుగానే పాలేరు ఎన్నికల ఫలితం రాబోతోందన్నారు. కూలి రేట్ల పెంపులో కీలకపాత్ర పోషించిన తమ్మినేనిని గెలిపించాలని కోరారు. కేరళలో వామపక్ష ప్రభుత్వం సాధించిన ప్రగతిని, చేస్తోన్న కృషిని వివరించారు. పాలేరు అభ్యర్థి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ తన నియోజకవర్గంలో ఓటుకు ఇప్పటికే కాంగ్రెస్, బిఆర్‌ఎస్ పార్టీలు రూ.3 వేల చొప్పున పంచుతున్నాయని, ఎన్నిక రోజు మరో రూ.2 వేలు పంచేందుకు సిద్ధంగా ఉన్నాయని విమర్శించారు. సిపిఎం పోరాట ఫలితంగానే రాష్ట్రంలో నాలుగు లక్షల ఎకరాల పోడు భూములకు ప్రభుత్వం పట్టాలిచ్చిందన్నారు. దుమ్ముగూడెం ప్రాజెక్టు కోసం పాదయాత్ర చేశానని, తన పోరాటానికి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి దిగొచ్చి రూ.600 కోట్లు కేటాయించారని గుర్తు చేశారు. ఎస్‌సి సబ్‌ప్లాన్ చట్టం తీసుకురావడానికి చేపట్టిన సైకిల్ యాత్రను ప్రస్తావించారు. ఆ పోరాటం ఫలితంగానే నేడు దళిత కాలనీలకు రోడ్లు పడ్డాయని, అభివృద్ధి పనులు జరిగాయని వివరించారు. ఖమ్మం జిల్లా అభివృద్ధి వెనుక కమ్యూనిస్టుల పాత్ర ఉందని తెలిపారు. తనను గెలిపిస్తే ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

వైవిధ్యంతో.. సమాజం అనైక్యత

- ఆర్‌ఆర్‌ఎస్ నాయకుడి విడ్డూర వ్యాఖ్యలు

బ్యాంకాక్: 'భిన్నత్వంలో ఏకత్వం' అనే భారతదేశ స్ఫూర్తికి భిన్నంగా.. ఆర్‌ఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హొసబాలే విడ్డూర వ్యాఖ్యలు చేశారు. భారత్‌తో సహా అనేక దేశాల్లో వైవిధ్యం అనైక్యతకు దారి తీసిందని అన్నారు. థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్‌లో జరుగుతున్న 3వ ప్రపంచ హిందూ మహాసభలో దత్తాత్రేయ హొసబాలే ఈ వ్యాఖ్యలు చేశారు. భాషలు, వర్గాలు, కులాలు, ఉపకులాలు, గురువులు ఆధారంగా ప్రపంచంలో అనేక సంఘాలు, సంస్థలు, ఫోరంలు ఏర్పాటయ్యాయని, ఇలాంటి సంస్థలతో హిందూత్వ ఉనికికే ప్రమాదమన్నారు.

బ్యాంకాక్‌లో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే ఈ హిందూ మహాసభకు 60 దేశాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ మహాసభలో ఆర్‌ఎస్‌ఎస్ అధ్యక్షులు మోహన్ భగవత్ మాట్లాడుతూ.. భౌతికవాదం, కమ్యూనిజం, పెట్టుబడిదారీ ప్రయోగాలతో సతమతం అవుతున్న ప్రపంచానికి భారతదేశం సంతోషానికి, సంతృప్తికి బాట చూపిందని చెప్పారు.

ఆస్కార్‌కి '12th' ఫెయిల్

బాలీవుడ్ ఫిల్మ్ '12th' ఫెయిల్ ఆస్కార్‌కు పోటీపడనున్నది. చిత్ర హీరో విక్రాంత్ మాసే దీనిపై ఓ ప్రకటన చేశారు. ఇండిపెండెంట్ నామినేషన్ కింద ఈ సినిమాను ఆస్కార్‌కు పంపించినట్లు తెలిపారు. విదు వినోద్ చోప్రా దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కింది. అక్టోబరు 27న హిందీ, తమిళ, తెలుగు, కన్నడ భాషల్లో ఈ సినిమాను విడుదల చేశారు. మనోజ్ పాత్రలో విక్రాంత్ మాసే నటించారు. మేధా శంకర్ హీరోయిన్ పాత్రను పోషించారు. అనురాగ్ పాఠక్ రాసిన నవల ఆధారంగా ఈ సినిమాను తీశారు. ఐపీఎస్ ఆఫీసర్ మనోజ్ కుమార్ శర్మ, ఐఆర్‌ఎస్ ఆఫీసర్ శ్రద్ధా జోష్ జీవిత కథ ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు.

రోషన్‌తో డాన్స్ చేయాలనిపించింది

రవికాంత్ పేరేపు దర్శకత్వంలో రోషన్ కనకాల కథానాయకుడిగా పరిచయం అవుతున్న చిత్రం 'బబుల్‌గమ్'. ఈ చిత్రం డిసెంబరు 29న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఇటీవల చిరంజీవి ఈ చిత్రం నుండి 'ఇజ్జత్' అనే గీతాన్ని విడుదల చేశారు. అనంతరం, మాట్లాడుతూ 'బబుల్‌గమ్ ట్రైలర్ చూశాను. చాలా బాగా నచ్చింది. 'ఇజ్జత్' పాట కూడా ఎనర్జిటిక్‌గా ఉంది. శ్రీచరణ్ హుషారైన బాణీ అందించారు. పాట వింటుంటే.. రోషన్‌తో కలిసి స్టెప్పు వేయాలి అనిపించింది.' అని అన్నారు. మానస చౌదరి కథానాయికగా నటించిన ఈ చిత్రంలో హర్ష, కిరణ్ మచ్చ, అనన్య ఆకుల, అను హాసన్ కీలక పాత్రలు పోషించారు.

అదే జోరు కొనసాగించాలి

- నేడు ఆస్ట్రేలియాతో రెండో టి20
- పొంచి వున్న వర్షం ముప్పు?

తిరువనంతపురం: తొలి టి20లో గెలిచిన ఉత్సాహంలో ఉన్న టీమిండియా.. తిరువనంతపురం వేదికగా ఆస్ట్రేలియాతో రెండో టి20కి సిద్ధమైంది. విశాఖలో ఆసీస్ నిర్దేశించిన 208పరుగుల భారీ లక్ష్యాన్ని టీమిండియా మరో బంతి మిగిలి ఉండగానే ఛేదించింది. దీంతో ఐదు టి20ల సిరీస్‌లో 1-0 ఆధిక్యలో ఉన్న భారత్.. ఈ మ్యాచ్‌లోనూ గెలిచి ఆధిక్యతను కొనసాగించాలని చూస్తోంది. మరోవైపు ఈ మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచి ఉంది. నేడు ఉదయం, మధ్యాహ్నం వర్ష సూచన ఉందని ఇక్కడి వాతావరణ శాఖ తెలిపింది. కానీ, సాయంత్రం వర్షం తగ్గుముఖం పట్టవచ్చని పేర్కొంది. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని యువభారత్.. తిరువనంతపురంలోనూ జోరును కొనసాగించాలని భావిస్తోంది. మరోవైపు వన్డే ప్రపంచకప్ ఛాంపియన్ ఆసీస్ జట్టు తొలి టి20లో ఓడిన షాక్ నుంచి ఇంకా కోలుకోలేదు. ఆ జట్టు వికెట్ కీపర్ ఇంగ్లిస్ సెంచరీతో కదం తొక్కినా ఆ జట్టు పరాజయాన్ని చవిచూసింది. దీంతో ఆసీస్ బోణీ కొట్టాలనే పట్టుదలతో బరిలోకి దిగనుంది. వైజాగ్ టి20లో సూర్యకుమార్ యాదవ్ (80; 42 బంతుల్లో 9ఫోర్లు, 4సిక్సర్లు) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడగా.. వికెట్ కీపర్ ఇషాన్ కిషన్(58; 39 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లు)తో జట్టును గెలుపు వాకిట నిలిపారు. చివర్లో రింకూ సింగ్(28నాటౌట్) మ్యాచ్‌ను ముగించిన తీరు వర్ణనాతీతం. దాంతో, భారత్ ఈ ఫార్మాట్‌లో 209 పరుగుల రికార్డు లక్ష్యాన్ని ఛేదించింది. ఈ విజయంతో ఐదు టీ20ల సిరీస్‌లో భారత్ 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. తొలి పోరులో వాషింగ్టన్ సుందర్, అవేశ్ ఖాన్ బెంచ్‌కే పరిమితం కానున్నారు.

జట్లు...

భారత్: యశస్వీ జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్, ఇషాన్‌కిషన్(వికెట్ కీపర్), సూర్యకుమార్(కెప్టెన్), తిలక్‌వర్మ, శివమ్‌దూబే, రింకూసింగ్, అక్షర్‌పటేల్, రవి బిష్ణోయ్, అర్షదీప్‌సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ, ముకేశ్‌కుమార్.

ఆస్ట్రేలియా: స్టీవ్ స్మిత్, మాథ్యూ షార్ట్, ఆరోన్ హార్డీ, జోష్ ఇంగ్లిస్, స్టొయినిస్, టిమ్ డేవిడ్, మాథ్యూ వేడ్(కెప్టెన్, వికెట్ కీపర్)), సియాన్ అబాట్, నాథన్ ఎల్లిస్, బెహ్రెన్‌డార్ఫ్, తన్వీర్ సంగా.

ఉదయ్ సహారన్‌కు పగ్గాలు

ఆసియాకప్ అండర్-19కు జట్టును ప్రకటించిన బిసిసిఐ

యుఏఇ వేదికగా డిసెంబర్ 8నుంచి జరగనున్న అండర్-19 ఆసియాకప్‌లో ఆడే జట్టును భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు(బిసిసిఐ) శనివారం ప్రకటించింది. హైదరాబాద్‌కు చెందిన ఆరవెల్లి అవనీశ్ రావు, మురుగన్ అభిషేక్ తొలిసారి జాతీయ అండర్-19 జట్టులో చోటు దక్కించుకున్నారు. అవనీశ్ రావు వికెట్ కీపర్ బ్యాటర్ కాగా... మురుగన్ అభిషేక్ ఆల్ రౌండర్. వీరిద్దరూ నవంబరు 3 నుంచి 9 వరకు గౌహతిలో జరిగిన అండర్-19 చాలెంజర్ ట్రోఫీలో సత్తా చాటి సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించారు. కాగా, 15 మందితో అండర్-19 భారత జట్టును ప్రకటించిన సెలెక్టర్లు... ముగ్గురిని స్టాండ్ బై ఆటగాళ్లుగా ఎంపిక చేశారు. జట్టు కెప్టెన్‌గా ఉదయ్ సహారన్(పంజాబ్) వ్యవహరించనున్నాడు.

జట్టు: ఉదయ్ సహారన్(కెప్టెన్), సౌమీ కుమార్ పాండే(వైస్ కెప్టెన్), ఆరవెల్లి అవనీశ్ రావు (వికెట్ కీపర్), మురుగన్ అభిషేక్, నమన్ తివారీ, అర్షిన్ కులకర్ణి, రాజ్ లింబానీ, ఆదర్శ్ సింగ్, ఆరాధ్య శుక్లా, రుద్ర మయూర్ పటేల్, ధనుష్ గౌడ, సచిన్ దాస్, ఇన్నేశ్ మహాజన్(వికెట్ కీపర్), ప్రియాంశు మోలియా, ముషీర్ ఖాన్. స్టాండ్ బై: ఎండి అమన్, ప్రేమ్ దేవకర్, అన్ష్ గోసాయ్

రిజర్వ్ ఆటగాళ్లు: పి.విఘ్నేశ్, కిరణ్ చోర్మలే, దిగ్విజయ్ పాటిల్, జయంత్ గోయత్

ఫైనల్‌కు చిరాగ్-సాత్విక్ ద్వయం

చైనా మాస్టర్ బ్యాడ్మింటర్ టోర్నీ

హాంగ్జౌ: చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల డబుల్స్ ఫైనల్లోకి టాప్‌సీడ్, భారత ద్వయం సాత్విక్-చిరాగ్ శెట్టి దూసుకెళ్లారు. శనివారం జరిగిన హోరాహోరీ పోరులో చిరాగ్-సాత్విక్ 21-15, 22-20పాయింట్ల తేడాతో చైనాకు చెందిన హే-జి-టెంగ్-రెన్ షింగ్ యుపై వరుససెట్లలో గెలిచారు. తొలి గేమ్‌ను సునాయాసంగా నెగ్గిన భారత ద్వయం.. రెండో గేమ్‌లో ఓ దశలో 20-20 పాయింట్లతో సమంగా నిలిచారు. ఆ తర్వాత భారత జంట వరుసగా రెండు పాయింట్లు సాధించి మ్యాచ్‌ను 22-20తో ముగించి ఫైనల్లోకి దూసుకెళ్లారు. ముఖ్యంగా రెండో గేమ్స్‌లో చిరాగ్-సాత్విక్ అర్ధభాగం ముగిసేసరికి 9-11పాయింట్లతో వెనుకబడ్డా.. ఆ తర్వాత అద్భుతంగా పుంజుకొని మ్యాచ్‌ను ముగించడం విశేషం. చైనా షట్లర్ల మధ్య జరిగే మరో సెమీస్ విజేతతో ఆదివారం జరిగే ఫైనల్లో భారత జోడీ టైటిల్‌కై తలపడనుంది.

భరత్, హెబ్బర్ సెంచరీలు

- అరుణాచల్‌ప్రదేశ్‌పై 9వికెట్ల తేడాతో నెగ్గిన ఆంధ్ర
- విజయ్ హజారే వన్డే టోర్నీ

ఛండీగర్: విజయ్‌హజారే వన్డే టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు రెండో లీగ్ మ్యాచ్‌లో గెలిచింది. గ్రూప్-డిలో భాగంగా శనివారం అరుణాచల్‌ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన అరుణాచల్‌ప్రదేశ్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 234పరుగులు చేసింది. సచిన్ ధనేశ్ శర్మ(100నాటౌట్) సెంచరీతో కదం తొక్కాడు. ఆంధ్ర బౌలర్లు నితీశ్, తపస్వి, మనీశ్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ఆ లక్ష్యాన్ని ఆంధ్ర జట్టు 34.1 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి ఛేదించింది. శ్రీకర్ భరత్(117నాటౌట్), అశ్విన్ హెబ్బర్(103నాటౌట్) సెంచరీలతో కదం తొక్కారు. కెప్టెన్ హనుమ విహారి(5) నిరాశపరిచాడు.

మరో మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు 17పరుగుల తేడాతో జార్ఖండ్‌పై సంచలన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ జట్టు 8వికెట్ల నష్టానికి 297పరుగులు చేయగా.. ఛేదనలో జార్ఖండ్ జట్టు 50 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 280పరుగులు చేసి ఓటమిపాలైంది. దీంతో గ్రూప్-బిలో హైదరాబాద్ జట్టు వరుసగా రెండో విజయంతో 2వ స్థానానికి ఎగబాకింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68